ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥ 140/- పేజీలు: 154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

## కేరళలో కొత్త ప్రతిపక్ష నేత అవసరం



కేరళ ఎన్నికలలో ఎల్డీఎఫ్ పరాజయం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్ కుమార్ అన్నారు. అయితే ఇలాంటి పరిస్థితులు తమకు కొత్తేమీ కాదని తిరిగి పుంజుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. వామపక్ష ఉద్యమం ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త ప్రతిపక్ష నాయకుడు అవసరమని ఆయన ఐఎఎన్ఎస్ వార్తా సంస్థతో అన్నారు. ప్రతిపక్ష నేతగా సిపిఎం నుండి, ఉప నేతగా సిపిఐ నుండి ఉంటారని వారిద్దరు కొత్తవారు ఉంటే బాగుంటుందన్నారు.

సంపుటి 09, సంచిక: 157 | గురువారం | 07-05-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ప్రజల నెత్తిన

# నిత్యావసరాల భారం



- ప్రజాప్రయోజనాల కోసం కాకుండా మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం వల్లే ఈ దుస్థితి
- ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తాం
- కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ హెచ్చరిక
- ధరలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్న నిరసన

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం /వరంగల్ / హైదరాబాద్

కేంద్రంలోని మోడి సర్కార్ దేశ ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా కార్పోరేట్ శక్తుల ఊడిగం చేస్తుండటం వల్లే సామాన్య ప్రజలకు నిత్యవసరాలు భారంగా మారుతున్నాయని సిపిఐ మండిపడింది. పెట్రో, డీజిల్ కొరత, వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ పెంచిన ధరలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలో, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వరంగల్ జిల్లా కేంద్రంలో, ఇటి నర్సింహా హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ సిలెండర్లు, ప్లకార్డులతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆకాశాన్ని అంటుతున్న గ్యాస్ ధరను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిత్యవసరాల ధరల తగ్గుదలకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టకుండా కార్పోరేట్ శక్తులకు దోచుకునే అవకాశం ఇచ్చేందుకు ఎర్ర తివాచీ పరుస్తున్నారని తరువాయి 12లో

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు

# ఆమోదం తెలపండి

- ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి
- ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టండి
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డిపిఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్2, మెట్రో ఫేజ్3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్2, ఫేజ్3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్1ను ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సిఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్2, ఫేజ్3 విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డిపిఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సిఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్2 ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా తరువాయి 8లో



## ప్రజలను రోడ్లపై నిలపొద్దు

- నా పర్యటనలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూడాలి
- డిజిపి సివి ఆనంద్‌కు సిఎం రేవంత్ రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తన పర్యటనల సమయంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలపవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి డిజిపి సివి ఆనంద్‌కు సూచించారు. ముఖ్యమంత్రి తరువాయి 8లో



## అపోహలొద్దు...

# ఆందోళన చెందొద్దు

చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది రైతులకు మంత్రి ఉత్తమ్ భరోసా

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు నుంచి చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి అపోహాలు, ఆందోళనలకు గురికావద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల తరువాయి 8లో

## పశ్చిమ బెంగాల్‌లో

# లెనిన్ విగ్రహం ధ్వంసం

- వామపక్షాల నిరసన ప్రదర్శన
- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- బెంగాల్‌లో మరణాలు, విధ్వంసం
- ఎన్నికల ఫలితాల అనంతరం కొనసాగుతున్న బిజెపి గూండాగిరీ
- తక్షణ అరెస్టుకు సిఇసి ఆదేశం



ముర్షీదాబాద్‌లో దుండగులు కూల్చివేసిన లెనిన్ విగ్రహం

**ముర్షీదాబాద్:** పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ అనంతరం తీవ్ర హింసాకాండ చర్యలు కొనసాగుతున్నాయి. ముర్షిదాబాద్ జిల్లాలో రాజకీయపార్టీల మధ్య మరోసారి ఉద్రిక్తతలు పేట్రేగడంతో మళ్ళీ అల్లర్లు,హింసాకాండ చెలరేగింది. బిజెపి మద్దతుదారులు విధ్వంసకాండ సృష్టించారు. జియాగంజ్ ప్రాంతంలో ఉన్న రష్యా సోషలిస్టు విప్లవనేత వి.ఐ.లెనిన్ విగ్రహాన్ని బిజెపికి చెందిన మూకలు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశాయి. మంగళవారం రాత్రి యథేచ్ఛగా ఈ మూకలు హింసాకాండ కొనసాగించాయి. ఈ సందర్భంగా డోమ్‌కాల్ ప్రాంతంలో సాయుధ మూకలు కాల్పులకు పాల్పడటంతో సిపిఐ(ఎం) కార్యకర్త షఫీకుల్ ఇస్లామ్‌కు బుల్లెట్ దిగబడి తీవ్ర గాయమైంది. ఆయన మోటార్ సైకిలుపై వెళుతుండగా అనేకసార్లు ఆయనపై కాల్పులు జరిపారు. ఆయనను బెరహంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేర్చారు. ఆయన పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా మరోచోట ఖర్‌గ్రామ్ అసెంబ్లీ తరువాయి 12లో

### బిజెపి భయానికి నిదర్శనం : డి.రాజా

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం ముర్షిదాబాద్‌లో బిజెపి గూండాలు లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడాన్ని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. ఇది రాజకీయ విధ్వంసంతో కూడిన పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. లెనిన్ విగ్రహం జరిగిన ఈ దాడి, వామపక్ష భావజాలం పట్ల, ప్రజలలో దానికున్న ఆదరణ పట్ల బిజెపికి ఉన్న లోతైన భయానికి నిదర్శనం తప్ప మరొకటి కాదన్నారు.

## ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ

# ముగిసింది



- అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రుబియో ప్రకటన
- 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'కు 50 గంటలు విరామం : ట్రంప్
- డీల్‌కు ఒప్పుకుంటే యుద్ధ విరమణ లేకపోతే మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరిక
- 30 రోజులు శాంతి చర్చల ప్రక్రియపై 48 గంటల్లో స్పష్టత

**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో ఇరాన్‌పై గడచిన ఫిబ్రవరి 28న ప్రాంభించిన ''ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' (ఇరాన్‌పై యుద్ధం) ముగిసిందని అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి, జాతీయ భద్రతా వ్యవహారాల సహాయకుడు మార్కో రుబియో ప్రకటించారు. ఇప్పుడు తాము దౌత్య చర్చలకు,శాంతి మార్గానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇక ఇప్పుడు హోర్ముజ్ జలసంధిలో వాణిజ్యనౌకల స్వేచ్ఛా రాకపోకలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు.ట్రంప్ కూడా సోషల్ మీడియా ద్వారా ప్రకటన చేస్తూ,దౌత్యమార్గంలో జరుగుతున్న సంప్రదింపులలో మంచి పురోగతి ఒప్పందం కుదిరినందువల్ల ఎంఓయుపై సంతకాలకోసం వేచిచూస్తామని, అందుకోసం 50 గంటలపాటు మాత్రమే ''ప్రాజెక్టు ఫ్రీడమ్''కు విరామం ఇస్తున్నట్లు చెప్పారు.చర్చల్లో రాయితీలు ఇవ్వాలని, లేకపోతే చర్యలు ఎదుర్కోవాలని అన్నారు. ఒప్పందానికి వస్తే, ఇరాన్‌తోసహా అన్ని దేశాలకూ హోర్ముజ్ జలసంధి తెరచుకుంటుందని, ఇరాన్‌పై ఏప్రిల్ 13 నుండి అమలులో ఉన్న దిగ్బంధనం ముగుస్తుందని, అంగీకరించకపోతే మళ్ళీ తీవ్ర బలప్రయోగంతో బాంబు దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉందని, కానీ ఒత్తిళ్ళకు లొంగబోదని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ చెప్పినట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. రాబోయే 48 గంటల్లో ఇరాన్ నుండి సానుకూల స్పందన వస్తుందని అమెరికా ఆశిస్తోందని మీడియా పేర్కొంది. ఇరాన్‌తో తెరవెనుక చర్చలు పురోగతిలో ఉన్నాయని, వారు పైకి ఒకటి మాట్లాడుతూ, రహస్యంగా తమతో ఒప్పందాన్ని, చర్చలను కోరుకుంటున్నారని ట్రంప్ ఇటీవల చెప్పారు. చర్చలు ప్రారంభించేందుకు ఒక నిబంధనల చట్రానికి సంబంధించిన 'అవగాహనపత్రం'(ఎంఓయు)పై సంతకాలు చేసేందుకు రెండు దేశాలు దగ్గరగా వచ్చాయని కూడా అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. పశ్చిమాసియాలో శత్రుత్వం నిర్మూలన,హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛగా వాణిజ్య నౌకల రాకపోకలు,ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా ఆంక్షలను ఇరాన్‌పై ఎత్తివేయడం వంటి ప్రధానాంశాలపై 30 రోజులపాటు చర్చలు జరపాలని ప్రతిపాదించిన 14 అంశాలతో ఈ ఎంఓయు ముడిపడి ఉంది. ఐతే ఒక ఒప్పందం తరువాయి 8లో

## రేషన్ షాపుల ద్వారా

# జొన్న, మొక్కజొన్న

మార్కెట్ ధరకంటే తక్కువకు ప్రజల చెంతకు చేరేలా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతుల ప్రయోజనమే పరమావధిగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మద్దతు ధరకు సేకరించిన మొక్కజొన్న, జొన్న పంటలను మార్కెట్ ధర కంటే తక్కవ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా పేద ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో తరువాయి 8లో

## భారత్-వియత్నాం

# 13 ఒప్పందాలపై సంతకాలు

- ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం
- ప్రధాని మోదీ, వియత్నాం అధ్యక్షుడు టో లామ్ చర్చలు
- 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్య లక్ష్యసాధనకు నిర్ణయం



ఫొటో : ఎస్.ఎన్.సిన్హా న్యూఢిల్లీ

**న్యూఢిల్లీ :** భారత్‌-వియత్నాం దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. పెరుగుతోన్న భౌగోళిక అస్థిరతల నేపథ్యంలో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాల రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించడంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వియత్నాం అధ్యక్షుడు టోలాం బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భారత్‌-వియత్నాం దేశాలు తమ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో 2030నాటికి 25 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్య లక్ష్యాన్ని సాధించాలని నిర్దేశించుకున్నాయి. మోదీ టోలాం సమావేశం తర్వాత డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఔషధాలు, విద్య, బ్యాంకింగ్, కల్చర్ సహా తరువాయి 8లో

## 10న రాష్ట్రంలో

# మోదీ పర్యటన

- రూ.7,823 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ : రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడవసారి బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా తెలంగాణకు ఈనెల 10వ తేదీన రానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన వివరాలను మీడియాకు బుధవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. ఈ నెల 10వ తేదీన తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్నారని చెప్పారు. సుమారు రూ.7,823 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన తరువాయి 8లో

# పంటలు కొంటారా.. లేదా?

- తెలంగాణ రైతుల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయొద్దు
- చివరి గింజ కొనేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదు
- రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నయవంచన
- వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/హనుమకొండ

రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నయవంచనకు పాల్పడిందని, రైతులు పండించిన పంటలను కొంటారా లేదా? తెలంగాణ రైతన్నల చేతిలో తన్నులు తింటారా అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రైతన్నల పంటలను కొనకుంటే గ్రామ గ్రామాన తెలంగాణ రైతన్నలు నాగళ్లను మడత పెట్టి మరీ సరిహద్దుల వరకు ఉరికిస్తారని కెటిఆర్ హెచ్చరించారు. తెలంగాణ రైతన్నల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయొద్దన్నారు. తెలంగాణలో రైతన్నల పంటలు తరువాయి 8లో

# విజయారోహణలో ఉత్కంఠ?

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన తమిళగ వెట్రిగ కళగం (టివికె) పార్టీ అధ్యక్షుడు జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. సాధారణ మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలం లేదనే సాకుతో ముందుగా నిర్ణయించుకున్న ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత నెలకొన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇవాళ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరగాల్సిన ప్రమాణ స్వీకారోత్సవం వాయిదా పడింది. టివికె శాసనసభాపక్ష నాయకుడిగా ఎన్నికైన తరువాత తన పార్టీ ముఖ్య నేతలతో కలిసి విజయ్ తమిళనాడు తాత్కాలిక గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసారు. నిబంధనలకు అనుగుణంగా అత్యధిక స్థానాలు కలిగిన పార్టీగా తనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రభుత్వ ఏర్పాటు కు అవసరమైన ఎంఎల్‌ఏల జాబితాను ముందు తనకు సమర్పించాలని గవర్నర్ కోరినట్లు వార్తలు రావడం విస్మయం కలిగిస్తోంది.

తమిళనాడు శాసనసభలో 234 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎంఎల్‌ఏల మద్దతు అవసరం. తాజా ఎన్నికల్లో టివికె 108 స్థానాలలో గెలిచింది. అందులో విజయ్ గెలిచిన రెండు స్థానాలలో ఒక దానికి రాజీనామా చేయాలి. తద్వారా టివికె సంఖ్యా బలం 107కు, అసెంబ్లీలో ఎంఎల్‌ఏల సంఖ్య 233కి తగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో సాధారణ మెజారిటీకి 117 ఓట్లు అవసరం. అయితే, టివికె సభ్యుడే స్పీకర్‌గా ఉన్నట్లయితే, ప్రభుత్వ బలనిరూపణ సమయంలో సమాన ఓట్లు వస్తే తప్ప ఆయనకు ఓటు వేసే అవకాశం దక్కదు. కాబట్టి స్పీకర్‌ను పక్కనబెడితే విజయ్ పార్టీ వాస్తవ బలం 106గానే ఉంటుంది. అంటే శాసనసభలో మెజారిటీ నిరూపించుకునేందుకు టివికెకు మరొక 11 ఎంఎల్‌ఏల మద్దతు అవసరం. డిఎంకె కూటమి నుంచి వైదొలిగి ఐదుగురు సభ్యులు కలిగిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. అంటే మరో ఆరుగురు ఎంఎల్‌ఏల అవసరం మాత్రమే ఉంది. టివికె అధ్యక్షుడు విజయ్ తమకు మద్దతునివ్వాలని కోరుతూ వికెసి, సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలకు లేఖలు రాశారు. ఈ మూడు పార్టీలు ఇద్దరు చొప్పున ఆరుగురు శాసనసభ్యులు కలిగి ఉన్నాయి. తాము వామపక్షాలతో కలిసే నిర్ణయం తీసుకుంటామని వికెసి అధ్యక్షుడు తోల్ తిరుమలన్ ముందే ప్రకటించారు. ఇక సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ తమకు విజయ్ నుంచి లేఖ వచ్చిందని ధృవీకరించి, శుక్రవారం (మే 8) నాడు పిలిచిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ అత్యవసర సమావేశంలో దీనిపై చర్చిస్తామన్నారు. సిపిఐ(ఎం) కూడా ఇదే వైఖరితో ఉన్నది.

ఇక విషయానికి వస్తే రాజ్యాంగంలోని 164వ అధికరణ ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమించాల్సి ఉంటుంది. సాధారణ మెజారిటీ వస్తే సమస్య లేదు కానీ, హంగ్ అసెంబ్లీ విషయం అందులో ప్రస్తావన లేదు. అప్పుడు గవర్నర్ విచక్షణాధికారాన్ని ప్రయోగిస్తుంటారు. ఆ సందర్భాలలో ఎలా వ్యవహరించాలనేది సుప్రీంకోర్టు, సర్కారియా, పూంఛీ కమిషన్‌లు పలు మార్గదర్శకాలు చేసాయి. దానిప్రకారం ఎన్నికల పూర్వం ఏర్పడిన కూటమికి మెజారిటీ వస్తే, దానిని పరిగణలోకి తీసుకోవచ్చు. లేదంటే ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి లేదా వెలుపల నుంచి ఇచ్చే మద్దతులను కూడా ఆధారం చేసుకోవచ్చు.

లేనిపక్షంలో అత్యధిక సీట్లు గెలుపొందిన పార్టీ (సింగిల్ లార్జెస్ట్ పార్టీ) కోరినట్లయితే, శాసనసభలో నిర్ణీత గడువులోగా బలనిరూపణ చేసుకోవాలనే షరతుతో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ అనుమతించటం ఆనవాయితీ. పదకొండవ లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేని సందర్భంలో అత్యధిక మెజారిటీ కలిగిన బిజెపి అభ్యర్థన మేరకు నాటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ బలనిరూపణ షరతుతో ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయిని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయించడం దేశానికి తెలిసిందే. నాడు మద్దతు కూడగట్టుకోలేక బలనిరూపణకు ముందుగానే ఆయన రాజీనామా చేశారు. మీడియాలో వస్తున్న వార్తలే నిజమైతే, తమిళనాడు గవర్నర్ ఇవేవి పరిగణనలోకి తీసుకున్నట్లు కనపడడం లేదు. తనకు డిఎంకె, అన్నా డిఎంకెలతో రాజకీయ విరోధం, బిజెపి సైద్ధాంతిక నిరోధం అని విజయ్ గతంలో చేసిన ప్రకటనే ప్రస్తుత పరిస్థితికి కారణంగా కనపబడుతోంది.

టివికె విజయాన్ని, తమకు ఏ మాత్రం ప్రమేయం లేకుండా తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడటాన్ని జీర్ణించుకోలేని బిజెపినే పరోక్షంగా మోకాలడ్డుతున్నదన్న విషయం సామాన్యులెవరికైనా ఇట్టే అర్థమవుతూనే ఉందనడం అతిశయోక్తి కాదు.

●



## ఐప్యాక్‌తో ఇక సంబంధాలుండవ్

క్షేత్రస్థాయిలో సర్వేలు, సోషల్ మీడియా నిర్వహణ కోసం ఐప్యాక్‌ను నియమించుకున్నాను. బెంగాల్, తమిళనాడు ఫలితాల తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నా. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు వినేష్ చందేల్‌ను మనీ లాండరింగ్ కేసులో ఈడీ అరెస్ట్ చేయడం ఎస్‌పీ నాయకత్వాన్ని ఆందోళ-నకు గురిచేసింది.పార్టీకి సంబంధించిన కీలక పత్రాలు, రహస్య సమాచారం లీక్ అయ్యే ప్రమాదం ఉంది.ఇప్పటికే డిజిటల్ ప్రచారం, సోషల్ మీడియా బాధ్యతలు చూస్తున్న 'షో టైమ్' సంస్థ తన పని కొనసాగిస్తోంది.

- సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్




# నిత్య స్ఫూర్తి ప్రదాత రవీంద్రనాథ్ ఠాగూర్!

భారతదేశానికి జాతీయ గీతం అందించిన ప్రసిద్ధ కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి రవీంద్రనాథ్ ఠాగూర్. రవీంద్రుడు రచించిన గీతాంజలి కావ్యానికి 1913లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని పొందిన తొలి ఆసియా వాసిగా ఖ్యాతి చెందారు. కవి, నవలాకర్త, రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, కథా రచయిత, సంగీత కర్త, తత్వవేత్త, సంఘ సంస్కర్త, విద్యావేత్త, భాషావేత్త, వ్యాకరణ పండితుడు, చిత్రకారుడు అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ 07 మే1861 రోజు పిరలీ బ్రాహ్మణ కుటుంబంలో దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవి పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో ఇంటి నాలుగు గోడల మధ్య గడిపిన రవీంద్రనాథ్ ఠాగూర్‌కు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. పాఠశాలకు వెళ్లడం ఇష్టపడక ఇంటి వద్దనే క్రమశిక్షణతో వ్యాయామం, గణితం, చరిత్ర, భూగోళ పాఠాలు, చిత్రలేఖనం, ఆటలు, ఆంగ్లం, సంగీతం, భౌతిక శాస్త్రం, సంస్కృతి వ్యాకరణం, ఆంగ్ల సాహిత్యం చదవడం, మాతృభాషపై పట్టు సాధించడం లాంటి పలు క్రియలను ఏకకాలంలో కొనసాగించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ :**

రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లాండ్ వెళ్లి పబ్లిక్ స్కూళ్లలో చేరి ఆచార్యుల బోధనలు విని ఆంగ్ల సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. అక్కడ ఉండగానే 'భగ్న హృదయం' అనే కావ్యాన్ని రచించారు. 1883లో మృణాళిని దేవిని వివాహమాడిన రవీంద్రనాథ్ ఠాగూర్ బాల్యంలోనే పలు పద్యాలు, వ్యాసాలు, విమర్శలు రచించి ప్రచురించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లో బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాల సంపుటి గీతాంజలి అతి గొప్పది, నోబెల్ పురస్కారం పొందిన తొలి భారతీయ రచనగా నిలిచింది. 1901లో బాలల మనో వికాసం కోరిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ దిశగా ఐదుగురు విద్యార్థులతో శాంతినికేతన్ విశ్వభారతి గురుకుల విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. అదే క్రమంలో 1919లో కళా భవన్ స్థాపించి విభిన్న కళలను నేర్పించడం, తానే స్వయంగా నేర్చుకున్నారు. 'ప్రతిభ', 'ప్రకృతి వికృతి' లాంటి నాటకాలు చరించారు. అదే విధంగా 'గోరా' లాంటి ప్రఖ్యాత నవలలు రచిస్తూనే చిత్రకళ, సంగీత శాస్త్రంలో సాధన చేశారు.

**జాతీయ గీత సృష్టికర్త విశ్వకవి ఠాగూర్:**

బాల్యం నుంచే జాతీయ భావాలను పుణికిపుచ్చుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ దేశభక్తి గీతాలను ఆలాపించేందుకు ఇష్టపడే వారు. 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో తొలిసారి బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' గీతాన్ని ఠాగూర్ ఆలపించారు. 1950 జనవరి 24 రోజున నాటి భారత రాజ్యాంగ సభ కమిటీ రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'జనగణమన'ను జాతీయ గీతంగా, బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించారు. తన సుదీర్ఘ జీవితంలో 2,000లకు పైగా పాటలు రచించారు. అణగారిన వర్గాల పక్షపాతి అయిన ఠాగూర్ శాంతి, సామరస్యాల వంటి సార్వత్రిక విలువల స్థాపన కు కృషి చేశారు. 2వ ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసాలకు చలించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యారు. వ్యాధి తీవ్రత పెరగడంతో 07 ఆగష్టు 1941న తుదిశ్వాస విడిచారు.

2వ ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసాలకు చలించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యారు. వ్యాధి తీవ్రత పెరగడంతో 07 ఆగష్టు 1941న తుది శ్వాస విడిచారు. గురుదేవ్, విశ్వకవి పేర్లతో ముద్దుగా పిలుచుకునే రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీత సృష్టికర్తగా భారతీయుల మదిలో నిలిచిపోయారు. విద్య, కళ, మానవతావాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలోచనలు, జీవితంలో అర్థాన్ని, సౌందర్యాన్ని అన్వేషిస్తూ ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ దార్శనికుడికి హృదయపూర్వకంగా నివాళుల అర్పిద్దాం, ఆయన చూపిన బాటన నిలిచే ప్రయత్నాలు చేద్దాం.

## మమత, స్టాలిన్‌ల పతనంతో

# బలహీనం కానున్న సమాఖ్యవాద పోరాటం

టి.ఎన్.అశోక్

2026లో భారతదేశంలోని ఐదు అసెంబ్లీల ఎన్నికల తీర్పు, కొందరు మాత్రమే ఊహించినట్లుగా దేశ రాజకీయ పటాన్ని తిరగరాసింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో ఒక సాధారణ ఎన్నికల ప్రక్రియగా ప్రారంభమైనది. అంతకంటే చాలా ముఖ్యమైన పరిణామంగా పరిణమించింది. బిజెపి అధికారాన్ని సుస్థిరం చేయడం, అదే సమయంలో, ఒకప్పుడు భారతదేశ సమాఖ్య రాజకీయ స్వరూపాన్ని నిర్వచించిన పాతుకుపోయిన ప్రాంతీయ కంచుకోటలను విచ్ఛిన్నం చేయడం.

ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలలో 60కి పైగా స్థానాల ఫలితం తేలడంతో బిజెపి తన బలాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఆ తర్వాత ఈ పరిణామం బిజెపి చేతులను మరింత బలోపేతం చేసింది. వచ్చే ఏడాది మరో 73 స్థానాల ఫలితం తేలనుంది. కీలకమైన చట్టాలను ఆమోదించడానికి తగినంత బలాన్ని కూడగట్టుకోవడం అన్ని పార్టీలకు ఎగువ సభలో ఎప్పుడూ ఒక సవాలుగానే ఉంది. జిఎస్‌టి, యుసిసి, సిఎఎ వంటివి చర్చలు జరపడానికి కష్టంగా మారిన క్లిష్టమైన సమస్యలు.

ఈ పెను మార్పుకు కేంద్రబిందువు నరేంద్ర మోదీ. ఆయన పార్టీ పనితీరు ముఖ్యంగా బెంగాల్‌లో తక్షణ అధికార సమతుల్యతను మార్చడమే కాకుండా, ఇప్పుడు 2029 సార్వత్రిక ఎన్నికల వరకు సాగే దీర్ఘకాలిక రాజకీయ పోటీకి వేదికను సిద్ధం చేసింది.

అత్యంత నాటకీయమైన మార్పు పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. అక్కడ ఒకప్పుడు అసంభవం అనిపించినదాన్ని బిజెపి సాధించినట్లు కనిపిస్తోంది. మమతా బెనర్జీ, ఆమె నేతృత్వంలోని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టింది. సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణ, సంస్థాగత బలం, దశాబ్దన్నర కాలంగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని కూలదోయాలనే లక్ష్యంతో పదునుపెట్టిన రాజకీయ కథనం కలగలిసి న ఒక ప్రభంజనంపై బిజెపి మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గాను 206 స్థానాలను గెలుచుకుంది.

బెంగాల్‌లో జరిగిన ఈ మార్పులోని ప్రతీకాత్మకత కేవలం సీట్ల సంఖ్యకు మించినది. దశాబ్దాలుగా, ఈ రాష్ట్రం మొదట వామపక్షాల పాలనలో, ఆ తర్వాత బెనర్జీ ప్రజాకర్షక జాతీయవాద మిశ్రమ పాలనలో బిజెపి సైద్ధాంతిక విస్తరణను ప్రతిఘటించింది. దీని పతనం ఇప్పుడు మరో ప్రాంతీయ కంచుకోట క్షీణతకు నాంది పలుకుతోంది. ఇది ఒక ధోరణిని బలపరుస్తోంది. విలక్షణమైన రాజకీయ గుర్తింపులు కలిగిన శక్తివంతమైన రాష్ట్ర నాయకులు కేంద్రీకృత ఎన్నికల యంత్రాంగానికి అంతకంతకూ సులభంగా లొంగిపోతున్నారు.

బెంగాల్ ప్రతిఘటన పతనానికి ప్రతీక అయితే, తమిళనాడు భిన్నమైన రాజకీయ భూకంపం సృష్టించింది. విజయ్, ఆయన స్థాపించిన కొత్త పార్టీ అయిన తమిళగ వెట్రి కళగం (టివికె) ఆవిర్భావం, అర్ధ శతాబ్దానికి పైగా రాష్ట్రాన్ని పాలించిన ద్రావిడ ద్వయాధికారాన్ని బద్దలుకొట్టింది.

ఎం.కె.స్టాలిన్, ద్రవిడ మున్నేట్ర కళజగం ఓటమి కేవలం ఎన్నికల పరాజయాన్ని మాత్రమే కాకుండా, ఒక తరాల అంతరాన్ని కూడా సూచిస్తుంది. రాజకీయాల్లోకి మారిన గత సినీ ప్రముఖుల మాదిరిగానే, విజయ్ కూడా ఆకర్షణ, బయటి వ్యక్తిగా ఉండే ఆదరణ, వ్యవస్థ వ్యతిరేక భావనల శక్తివంతమైన మిశ్రమాన్ని అందిపుచ్చుకున్నారు. కానీ తన పూర్వీకులకు భిన్నంగా, జాతీయ ధోరణులు ప్రాంతీయ ఆకాంక్షలతో మరింత బలంగా ముడిపడి ఉన్న యుగంలో ఆయన ఈ విజయాన్ని సాధించారు.

ఎంతో లోతుగా పాతుకుపోయిన రాజకీయ సంస్కృతులు కూడా మార్పులకు అతీతం కాదని తమిళనాడు తీర్పు సంకేతాలు ఇస్తోంది. చారిత్రాత్మకంగా రాష్ట్రంలో పాగా వేయడానికి ఇబ్బంది పడుతున్న బిజెపికి, విజయ్ ఎదుగుదల ఒక అవకాశంతో పాటు ఒక సవాలును కూడా అందిస్తోంది. ద్రవిడ ఆధిపత్యాన్ని బలహీనపరిచే అవకాశం కాగా, తమ జాతీయ అజెండాతో సజావుగా మమేకం కాలేని ఒక శక్తివంతమైన కొత్త ప్రాంతీయ శక్తిని నిర్వహించడంలో సవాలు ఎదురవుతోంది.

ఇతర చోట్ల, ఈ ఫలితాలు ఇప్పటికే ఉన్న ధోరణులను బలపరిచాయి. అస్సాంలో బిజెపి నేతృత్వంలోని కూటమి తన ఆధిపత్యాన్ని మరింత విస్తరించుకుని, నిర్ణయాత్మకమైన తీర్పును దక్కించుకుంది. ఇది అస్థిత్వ ఆధారిత రాజకీయాలు, అభివృద్ధి నినాదాల ప్రభావం ఇంకా కొనసాగుతోందనడానికి నిదర్శనంగా నిలిచింది. కేరళలో, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తిరిగి పుంజుకుని, రాష్ట్రంలో అధికార మార్పిడి అనే సుపరిచితమైన పద్ధతిని పునరుద్ధరించింది. మరోవైపు, పుదుచ్చేరిలో బిజెపితో పొత్తు పెట్టుకున్న ప్రాంతీయ కూటమి ఆధ్వర్యంలో పాలన కొనసాగింపునకు వచ్చింది.

విడివిడిగా చూస్తే, ఈ ఫలితాలు సాధారణంగానే అనిపించవచ్చు. కానీ సమిష్టిగా, ఇవి ఒక విస్తృతమైన ఏకీకరణకు దోహదపడతాయి: గంగానది పరివాహక ప్రాంతం నుండి తూర్పు సముద్ర తీరం, ఈశాన్యం వరకు భారతదేశంలోని విశాలమైన ప్రాంతాలలో బిజెపి ఇప్పుడు పరిపాలనను శాసిస్తోంది లేదా ప్రభావితం చేస్తోంది.

2026 ఎన్నికలు, గత దశాబ్ద కాలంలో ప్రాభవం కోల్పోయిన రాష్ట్ర స్థాయి నాయకుల జాబితాకు అదనంగా, బెనర్జీ, స్టాలిన్ అనే ఇద్దరు





ప్రముఖ ప్రాంతీయ నాయకులను సమర్థవంతంగా బలహీనపరిచాయి. దీని సంచిత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది: ఒకప్పుడు బలమైన ప్రాంతీయ ధృవాలచే నిర్వచించబడిన భారతదేశ రాజకీయ వ్యవస్థ, క్రమంగా మరింత కేంద్రీకృత నిర్మాణం వైపు మొగ్గు చూపుతోంది.

ఈ మార్పు తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంది. చారిత్రాత్మకంగా, ప్రాంతీయ పార్టీలు జాతీయ ఆధిపత్యానికి ప్రతిఘటనగా పనిచేస్తూ, సంకీర్ణ రాజకీయాలను తీర్చిదిద్దుతూ, విధానపరమైన దిశలను మితవాదంగా మార్చాయి. వాటి క్షీణత భారతదేశ రాజకీయ వ్యవస్థ సంక్లిష్టతను తగ్గిస్తుంది, తద్వారా జాతీయ ఎన్నికలు స్థానిక అంకగణితం కంటే నాయకత్వంపై కేంద్రీకృతమయ్యేలా, వాటి స్వభావాన్ని మార్చే అవకాశం ఉంది.

మోదీకి ఈ ఎన్నికల ఫలితాలు ధృవీకరణ(పోలరైజేషన్)తో పాటు బలాన్ని కూడా అందిస్తాయి. అవి ఆయన రాజకీయ అజేయత వాదనను బలపరుస్తూ, భవిష్యత్ పోటీలకు ముందు వ్యూహాత్మక లోతును అందిస్తాయి. 75 ఏళ్ల వయసులో 2029 ఎన్నికల నాటికి 79 ఏళ్లకు చేరువవుతున్న మోదీ, బిజెపికి అత్యంత శక్తివంతమైన ఎన్నికల ఆస్తిగా మిగిలిపోయారు.

అయినప్పటికీ, ఆయన ఆధిపత్యం విస్తృత భావజాల కుటుంబంలో నెలకొన్న అంతర్గత ఉద్రిక్తతతో కూడా ముడిపడి ఉంది. బిజెపికి భావజాల మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), ఎప్పటికప్పుడు తరాల మార్పునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంకేతాలు ఇస్తూ వస్తోంది. అయితే, 2026 విజయాలు, కనీసం సమీప భవిష్యత్తులోనైనా అటువంటి ఒత్తిళ్లను ప్రతిఘటించేందుకు మోదీ స్థానాన్ని బలోపేతం చేస్తాయి.

ప్రశ్న వారసత్వం జరుగుతుందా లేదా అనేది కాదు, ఎప్పుడు మరియు ఏ పరిస్థితులలో జరుగుతుంది అనేది.

ఇప్పటి నుండి 2029 మధ్య ఒక కీలకమైన మైలురాయి ఉంది. అదే ఉత్తర ప్రదేశ్‌లో 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు. భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా మరియు పార్లమెంటరీ మెజారిటీలకు నిర్ణయాత్మక దోహదకారిగా, ఉత్తర ప్రదేశ్ జాతీయ రాజకీయాలకు ఒక పరీక్షా క్షేత్రంగా పనిచేస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్ 80 పార్లమెంటరీ సీట్లను అందిస్తుంది. వీటిలో అతిపెద్ద భాగం తరచుగా తదుపరి ప్రధానమంత్రి ఎవరు అవుతారో నిర్ణయిస్తుంది.

ఇక్కడ, ప్రతిపక్ష వ్యూహాలతో పాటు బిజెపిలోని అంతర్గత సమీకరణాలు కూడా అంతే ప్రభావవంతంగా ఉండవచ్చు. విభిన్న రాజకీయ పునాదులు కలిగిన ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులైన అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌ల మధ్య సంబంధం నిరంతర ఊహాగానాలకు కేంద్రబిందువుగా ఉంది. అభ్యర్థుల ఎంపిక, పాలనా ప్రాధాన్యతల విషయంలో ఉన్న విభేదాలను జాగ్రత్తగా నిర్వహించకపోతే, రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికలలో బిజెపి పరాజయాలకు కారణమైన ఘర్షణల వంటివి పునరావృతం కావచ్చు.

ఉత్తరప్రదేశ్‌లో చీలిపోయిన బిజెపి ప్రతిపక్ష పార్టీలకు ఒక అరుదైన అవకాశాన్ని అందిస్తుంది. దీనికి విరుద్ధంగా, ఐక్య ప్రచారం పార్టీ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసి, 2029 ఎన్నికలకు మార్గం సుగమం చేస్తుంది.

దేశీయ రాజకీయాలకు అతీతంగా, బాహ్య కారకాలు భారతదేశ ఎన్నికల స్వరూపాన్ని తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితి. ఇది భారతదేశ ఇంధన దిగుమతులకు కీలక వనరు.

చమురు సరఫరాలో ఏదైనా నిరంతర అంతరాయం లేదా ప్రాంతీయ ఉద్రిక్తతల పెరుగుదల భారతదేశ ఆర్థిక వ్యవస్థపై గొలుసుకట్టు ప్రభావాలను కలిగిస్తుంది. పెరుగుతున్న ఇంధన ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోసి, గృహ ఆదాయాలను క్షీణింపజేసి, ప్రజల అసంతృప్తిని పెంచుతాయి. ఆర్థిక నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల ఆధారంగా తన రాజకీయ ప్రతిష్టను నిర్మించుకున్న ప్రభుత్వానికి, ఇటువంటి ఒత్తిళ్లు సవాలుగా మారవచ్చు.

ఒకప్పుడు సాంకేతిక నిపుణుల ఆందోళనగా ఉన్న ఇంధన భద్రత, ఈ విధంగా ఒక రాజకీయ అంశంగా మారుతోంది. దీని ప్రభావం ప్రాంతాలవారీగా అసమానంగా పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణ, మధ్యతరగతి ఓటర్లు జీవన వ్యయ పెరుగుదల పట్ల చాలా సున్నితంగా ఉంటారు.

మొత్తంగా చూస్తే, 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బిజెపికి అనుకూలంగా ఉండే రాజకీయ గమనాన్ని సూచిస్తున్నాయి. కొత్త ప్రాంతాలకు విస్తరించగల, పాతుకుపోయిన ప్రభుత్వాలను కూల్చివేయగల, విభిన్న ఎన్నికల సందర్భాలకు అనుగుణంగా తన సందేశాన్ని మార్చుకోగల సామర్థ్యాన్ని ఆ పార్టీ ప్రదర్శించింది.

అయినప్పటికీ, 2029కి దారితీసే మార్గం ముందుగానే నిర్ణయించబడలేదు. అనేక అంశాలు ఫలితాన్ని నిర్దేశిస్తాయి. మోదీ నిరంతర ప్రాబల్యం, లేదా బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థలో తరాల మార్పుకోసం జరుగుతున్న ఒత్తిడి, ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ఫలితం, జాతీయ గమనం మీద దాని ప్రభావం. అస్థిరమైన ప్రపంచ వాతావరణంలో ద్రవ్యోల్బణం, ఉపాధి, వృద్ధి పథాలు. ప్రాంతీయ, జాతీయ పార్టీలు సమన్వయంతో కూడిన పొత్తులను ఏర్పరచుకోగల సామర్థ్యంలేదా అసమర్థత.

2026 ఎన్నికల నుండి ఆవిర్భవించేది కేవలం గెలుపు ఓటముల సమాహారం మాత్రమే కాదు, ఒక కొత్త రాజకీయ దశ రూపురేఖలు. భారతదేశం విచ్ఛిన్నమైన, సంకీర్ణఆధారిత వ్యవస్థ నుండి, ఆధిపత్య జాతీయ పార్టీ లంగరుగా ఉండే మరింత కేంద్రీకృత పాలన నమూనా వైపు పరివర్తన చెందుతున్నట్లు కనిపిస్తోంది. ఈ మార్పు నిలకడగా ఉంటుందా లేదా అనేది రాజకీయ నాయకుల నియంత్రణలో ఉన్న మరియు లేని శక్తులపై ఆధారపడి ఉంటుంది. అయితే, ప్రస్తుతానికి, పరిస్థితి నిర్ణయాత్మకంగా మారిపోయింది.



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్
9000674747

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే!

లేఖ

ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉద్యోగ, ఉపాధ్యాయుల తలరాతలు మారడం లేదు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికి ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించకపోవడం శోచనీయం. డి.ఏ. బకాయిలు, పి.ఆర్.సి, రిటైర్మెంట్ బకాయిల గురించి ఉద్యోగులు 'ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. కానీ పాలకులు మాత్రం అంకెల 'గారడి' మాటలతో మురిపిస్తున్నా రు.

పెండింగులో ఉన్న ఐదు డి.ఏ.లు, నూతన పి.ఆర్.సి. అమలు, పదవీ విరమణ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయించి వాటిని త్వరగా అందిస్తారని ఆశపెట్టుకున్న వారి ఆశలు అడియాసలైనాయి. ఈ అంశాలపై అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికమంత్రి స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా అది చేశాం, ఇది చేశాం, ఇంకెంతో చేస్తామని అస్పష్ట ప్రకటన చేస్తూ విషయాన్ని దాటవేయడం శోచనీయం. ఇంకెన్నాళ్ళు ఈ ఎదురు చూపులు. పాలకులెవరైనా, ఏ పార్టీవారైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా, సమయానుసారంగా అందించాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు ఏదో రకంగా కాలయాపన చేస్తూ గండికొట్టడం దశాబ్దాలుగా జరుపుతూనే ఉన్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటైన పి.ఆర్.సి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత అమలైంది. ఆ తరువాత 2018లో మరొక పి.ఆర్.సి. అమలు కావలసి ఉండడంతో ఎస్‌టియుటిఎస్ 2016లోనే పి.ఆర్.సి.కమిటీని నియమించాలని గళమెత్తి ప్రభుత్వానికి వరుస ప్రాతినిధ్యాలు చేస్తూ వచ్చింది. చివరకు నాటి ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొని 2018లో పి.ఆర్.సి.పై త్రిసభ్య కమిటీని నియమించింది. ఆ కమిటీ 33 నెలలు జాప్యంచేసి 2020 డిసెంబరులో తన నివేదికను సమర్పించగా దానిపై తర్జన భర్జనలు జరిగి మరికొంత కాలహరణం తరువాత పి.ఆర్.సి.ని 2018 జూలై నుండి అమలు చేస్తున్నట్లు తెలిపి, దానికి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు 2020 ఏప్రిల్ నుండి 2021 మార్చి వరకు 12 నెలల బకాయిలను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే 21 నెలల కాలానికి నాటి ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలను ఇవ్వలేదు. ఇది తెలంగాణ రాష్ట్రంలో తొలి పి.ఆర్.సి. కావడం గమనార్హం. ఆ తరువాత 2023 డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2023 అక్టోబరులో పి.ఆర్.సి. కమీషన్‌ను నియమించి 2024 ఏప్రిల్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, ఇతర పాలనాపరమైన కారణాలచేత ప్రభుత్వం ఈ గడువును దశలవారీగా పొడిగిస్తూ వచ్చింది. ప్రస్తుతం మార్చి 2026లో ఆ గడువు పూర్తి అయింది. ఇప్పటికీ ఆ సి.ఆర్.వి. కమిటీ నివేదికను ప్రభుత్వం తెప్పించుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అమలుపరచాల్సి ఉండగా దాని ఊసే ఎత్తడం లేదు.

కొంతమంది రిటైరు ఉద్యోగులు తమకు న్యాయంగా అందాల్సిన రిటైర్మెంటు బకాయిలను అందించేలా చేయమని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారు. వారికి ఆ ప్రయోజనాలను అందించమని కోర్టు ఆదేశించింది. అయినా ఆర్థికశాఖ పట్టించుకోకపోవడం న్యాయస్థానం ఆగ్రహించి ఏప్రిల్ 9 లోగా రిటైర్మెంటు బకాయిలను వారికి అందించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశిస్తూ గడువులోగా అందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించింది.

సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసిన ఉద్యోగికి న్యాయంగా వారికి ఆర్థికంగా ఆరోగ్యకరమైన, భద్రతాపూర్వకమైన విశ్రాంత జీవనాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా! ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరువచేసి వారికి అందించేది ఉద్యోగులే. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు నేడు దయనీయ పరిస్థితిని ఎదర్కోవడం బాధాకరం.

గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ విషయమై జాగుచేయక మంత్రులతో, అధికారులతో, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో వెంటనే సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాలి. లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అది ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను తమ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేవారికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఈ విషయమై స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో టిజిఇజెఎసి ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమ కార్యాచరణకు పిలుపునిచ్చింది. అప్పటికి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపనట్లయితే ఆర్టీసీ ఉద్యోగుల మాదిరి పెన్‌డౌన్, చాక్‌డౌన్ వంటి కార్యక్రమాలకు కూడా వెనకాడకుండా సమస్యలు సాధించేంతవరకు పోరాడతామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు హెచ్చరిస్తున్నారు.

## ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రధాన నినాదమైన తుమ్మిడి హెట్టి వద్ద (డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్) పాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తిరిగి చేపడుతామని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నాటి ఉద్యమకారులను, తెలంగాణ ప్రజలను సంతృప్తి పర్చే అంశమని ఆయన పేర్కొన్నారు. జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు రూ. 6వేలకోట్లు పై చిలుకు ఖర్చు చేయగా తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడ మరో రూ.5వేల కోట్లు, మొత్తం రూ.11 వేల కోట్ల పై చిలుకు నిధులను ఖర్చుచేసిందని దీనిని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే దగా పడిన అదిలాబాదుకు రెండు లక్షల ఎకరాలకు అప్పడే సాగు నీరు అందేదన్నారు.అప్పటి చీఫ్ ఇంజనీర్ శివరామ కృష్ణ అధ్యయనం చేసి గోదావరి నదికి ఎన్ని అనకట్టలు కట్టిన మంచిదేనని వర్ష కాలంలో నీరు పుష్కలంగా లభించనుండడంతో ఎత్తు ప్రాంతంలో ఉన్న తెలంగాణకు ఈ ఆనకట్టులు అవసరమని పేర్కొన్న నేపధ్యంలో కాళేశ్వరంతో పాటు ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని సిపిఐ పదే పదే కోరినా కెసిఆర్ ప్రభుత్వంపెడ చెవిన పెట్టిందని వెల్లడించారు. గత ప్రభుత్వం కాళేశ్వరంలో పాటు ప్రాణహిత – చెవేళ్ల ప్రాజెక్టును సైతం పూర్తి చేసిఉంటే తెలంగాణ సశ్యాశామలమైయేందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రాణహిత –చెవేళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఈ ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా కల్పించాలని, ఇందుకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కృషి చేయాలన్నారు. డిమాండ్ డిమాండ్ చేశారు.అదే విధంగా కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం త్వరిగతిన పూర్తి చేసి కరువు ప్రాంతాలకు సాగు నీటి అందించాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నిరుద్యోగులకు వయోపరిమితి
# 10 ఏళ్లు పెంచండి

సిఎం, డిప్యూటీ సిఎంలకు పొలిటికల్ జెఎసి చైర్మన్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇచ్చే నోటిఫికేషన్లలో వయోపరిమితిని మరో 10 ఏళ్ల పాటు సడలించాలని పొలిటికల్ జెఎసి చైర్మన్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వేర్వురుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విన్నపంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిరుద్యోగులకు సంబంధించిన ఈ సమస్య గురించి వారితో లోతుగా చర్చించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం వయోపరిమితి సడలింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పదేళ్ల పాటు ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల కాలేదని, రాష్ట్రం ఏర్పడిన అనంతరం అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం కూడా పదేళ్ల కాలంలో ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిందని ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వినతిపత్రంలో వివరించారు. ఈ సుదీర్ఘ 20 ఏళ్ల కాలంలో సరైన నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయి, అర్హత కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని వారు డిప్యూటీ సిఎం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు నష్టపోకుండా ఉండాలంటే భవిష్యత్తులో విడుదలయ్యే అన్ని నోటిఫికేషన్లలో వయోపరిమితిని పెంచాలని వారు కోరారు. తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి పొందే అవకాశం లభిస్తుందని వారు వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం త్వరలోనే తీపి కబురు అందించే అవకాశం కనిపిస్తోందని అధికారవర్గాలు తెలిపాయి.



## తెలంగాణ యువతకు విదేశీ ఉద్యోగావకాశాలు

మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలపై రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి బుధవారం ఇజ్రాయెల్ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. మాసాబ్ ట్యాంక్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నైపుణ్య యువతకు ఇజ్రాయెల్‌లో ఉద్యోగ అవకాశాల విస్తరణపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌డిసిఐ, పిఐబిఎ భాగస్వామ్యంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాల కోసం అభ్యర్థులకు శిక్షణ, ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం రీనోవేషన్ రంగంలో 1,200 మంది కార్మికుల అవసరాన్ని వెల్లడించిందని, గతంలో నిర్వహించిన ప్రీస్కిల్ పరీక్షలో 4,247 మంది పాల్గొనగా 2,059 మంది అర్హత సాధించారని తెలిపారు. ప్రస్తుతం తుది ఎంపికలో ఉన్న 1,200 మందికి మే 5 నుంచి 10 వరకు ఫైనల్ స్కిల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.



## నోష్ ల్యాబ్ క్షతగ్రాతులను పరామర్శించిన ఎంఎల్‌సి సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలిమినేడ్ గ్రామంలోని నోష్ ల్యాబ్ ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబాలకు కోటి రూపాయ చోప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఈ ఘటనలో గాయపడి హైదరాబాదులోని డిఆర్‌డిఒ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు క్షతగాత్రులను బుధవారం ఎంఎల్‌సి సత్యం, సిపిఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.శ్రావణ్ కుమార్‌లు పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నోష్ పరిశ్రమలో రియాక్టర్లు పేలి కార్మికులు మృతి చెందడం, మరి కొంతమంది గాయపడినప్పటికీ కార్మిక శాఖ మంత్రి నేటికీ స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. నోస్ ఫార్మా పరిశ్రమలో కేవలం నెలరోజులలోనే పరిశ్రమలో రెండుసార్లు రియాక్టర్లు పేలడం , యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా చౌటుప్పల్, చిట్యాల ప్రాంతాలలో ఉన్న పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన నోష్ కంపెనీపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి తక్షణమే క్షతగాత్రులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని వైద్య ఖర్చులను సంస్థ భరించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ● హనుమకొండలో సిపిఐ శిక్షణా శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/హనుమకొండ :** అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. హనుమకొండలో సిపిఐ కార్యకర్తల శిక్షణా శిబిరం బుధవారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతూ పోతున్నదని, అయినా పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజువారి ఆదాయం వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ఈ క్రమంలో దేశంలోని భూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడీపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఈ తరుణంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారత దేశంలో మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదని అన్నారు. కేంద్రంలో గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి మేలుకోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బిజెపి పాలిత రాష్ట్రాలలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. తెలంగాణ విభజన హామీలు నెరవేర్చకున్నా కేంద్ర ప్రభుత్వానికి భజన చేస్తున్న బిజెపి నాయకులు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణా శిభిర కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, నాయకులు ఏదునూరి వెంకట్రాజం , కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, యాకూబ్,తదితరులు పాల్గొన్నారు.

## సిబిఐకి కేసు అప్పగిస్తే.. ఆరు నెలలైనా ఎలాంటి పురోగతి లేదు

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ విమర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవకతవకలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని, కెటిఆర్ వ్యాఖ్యలు మాదకద్రవ్యాల ప్రభావంతో ఉన్నట్లుగా అనుమానం కలుగుతోందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ కూడా పిట్టల దొరలా మారారని, సిబిఐకి కేసు అప్పగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పి ఆరు నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదన్నారు. జాతీయ స్థాయి రాజకీయాలు, రాష్ట్ర స్థాయి రాజకీయాలు వేర్వేరని స్పష్టం చేశా రు. జాతీయ స్థాయిలో సిపిఐ(ఎం)తో సఖ్యత కొనసాగుతుందని, అయితే కేరళలో మాత్రం సిపిఐ(ఎం)తో పోరాటం ఉంటుందన్నారు. తమిళనాడులో డిఎంకెతో కలిసి ఎన్నికలకు వెళ్లినా, ఆ రాష్ట్ర పరిస్థితులను బట్టి టివికెకు మద్దతు ఇచ్చామని మహేష్ కుమార్ వెల్లడించారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి వంటి నేతలను విమర్శించే స్థాయి కెటిఆర్‌కు లేదని, పాస్‌పోర్ట్ కుంభకోణం నుంచి భూముల కుంభకోణాల వరకు కెటిఆర్ కుటుంబ సభ్యుల పేర్లు వినిపిస్తున్నాయని చెప్పుకొచ్చారు. కెటిఆర్ దొంగల బ్యాచ్‌కు నాయకత్వం వహిస్తున్నారంటూ ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కెటిఆర్ దొంగచాటుగా వచ్చి, ఉద్యమ నాయకులకు ద్రోహం చేశారని, ముఖ్యంగా కెకె.మహేందర్ రెడ్డి వంటి నాయకులను దెబ్బతీశారని విమర్శించారు. యువతను మద్యానికి అలవాటు చేసి రాష్ట్ర భవిష్యత్తును బిఆర్‌ఎస్ నాశనం చేసిందని ఆరోపించిన ఆయన, ఒకే కుటుంబానికి చెందిన వారికి పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. దళితుడిని ముఖ్యమంత్రి చేయకపోతే తలనరుక్కుంటానన్న కెసిఆర్‌కు ఇప్పుడు తల ఉందా? అంటూ మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

## కెటిఆర్ అహంకారానికి ఆ వ్యాఖ్యలే నిదర్శనం

తక్షణమే క్షమాపణ చెప్పాలి:మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై వరంగల్ సభలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి సీతక్క ఖండించారు. కెటిఆర్ తన అహంకార పూరిత ధోరణిని వీడాలని, చేసిన వ్యాఖ్యలకు గానూ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు తమ ఓటుతో బిఆర్‌ఎస్ పాలనను పాతరేశారని గుర్తు చేశారు. రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినందుకే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పారని, అయినప్పటికీ కెటిఆర్‌లో మార్పు రాలేదని విమర్శించారు. 'దొర ధోరణితో అప్రజాస్వామికంగా మాట్లాడటం కెటిఆర్‌కు తగదు' అని ఆమె హితవు పలికారు. బిఆర్‌ఎస్ హయాంలో రైతు రుణమాఫీ పేరుతో రైతులను వంచించారని సీతక్క ఆరోపించారు. గత ప్రభుత్వంలో నాలుగు విడతల పేరుతో చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని, రైతులు అప్పుల ఊబిలోనే ఉండిపోయారని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, బాధితులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మానవత్వంతో ఆ కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. పదేళ్లు కెసిఆర్ ఇవ్వని పంట బోనస్‌ను, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

### రైతు భరోసాలో జాప్యం ఎవరిది?

రైతు బంధు నిధుల విడుదలలో గత ప్రభుత్వం నెలల తరబడి జాప్యం చేసిందని మంత్రి గణాంకాలతో వివరించారు. 2018 యాసంగిలో 161 రోజులు, 2022–23లో 148 రోజుల సమయం తీసుకున్నారని, కానీ తమ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసి తన నిబద్ధతను చాటుకుందన్నారు.

### కమీషన్‌ల చరిత్ర మీదే..

సమ్మక్కసారలమ్మ ఆలయ అభివృద్ధిపై కెటిఆర్ చేస్తున్న ఆరోపణలను సీతక్క కొట్టిపారేశారు. 'కమిషన్‌ల గురించి మాట్లాడే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదు. సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ పావని గతంలో కమీషన్‌లు లేనిదే పనులు జరగడం లేదని వాపోయిన విషయం ప్రజలందరికీ తెలుసు' అని మంత్రి ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ప్రజల మధ్య ఉండి పనిచేస్తోందని, ఫామ్ హౌస్‌కో, విదేశీ పర్యటనలకో పరిమితం కాలేదని మంత్రి స్పష్టం చేశారు. ఇకనైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కెటిఆర్‌కు ఆమే హితవు పలికారు.

## ఆ 600 ఎకరాల భూమి... అటవీ శాఖదే : సుప్రీంకోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కలవల నగరం గ్రామంలోని సర్వే నం.81లో ఉన్న సుమారు 600 ఎకరాల భూ వివాదంపై సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించిందని అటవీ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భూమిని 1950 ఫిబ్రవరి 6న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రిజర్వ్ ఫారెస్ట్‌లో చేర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నిజాం కాలంలో (1931–33 ఫస్లీ) తమకు పట్టు ఇచ్చిన భూమి అని పేర్కొంటూ కొంతమంది ఫారెస్ట్ పరిధి నుంచి మినహాయించాలని కోరారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ భూములకు సంబంధించిన పత్రాలు చూపించడంలో విఫలమైనందున భూమి రికార్డుల్లో 'అడవి'గా నమోదై ఉందని నాటి ఖమ్మం జాయింట్ కలెక్టర్ 2003 మే 19న వారి అభ్యర్థనను తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని హైకోర్టులో సవాలు చేయగా, తొలుత సింగిల్ జడ్జి అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. అయితే, డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేసి ప్రభుత్వ వాదనను సమర్థించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. కేవలం ఫైసల్ పట్టి, వసూల్ బాకీ, పహాణీలు వంటి ఆదాయ రికార్డులు భూమిపై హక్కును నిర్ధారించవని, అవి గరిష్టంగా స్వాధీనంపై ఊహ మాత్రమే కలిగిస్తాయని కోర్టు స్పష్టం చేసింది. ఆ భూమి ఎప్పటినుంచో'అడవి'గా నమోదై ఉందని కూడా పేర్కొంది. అలాగే, రిట్ పిటిషన్‌లోనే భూమిపై హక్కులను ప్రకటించడం న్యాయపరంగా సాధ్యం కాదని పేర్కొంటూ, సింగిల్ జడ్జి తీర్పును తప్పుబట్టింది. డివిజన్ బెంచ్ తీర్పును సమర్థిస్తూ,నాటి ఖమ్మం జాయింట్ కలెక్టర్ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో సివిల్ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల శివధర్ రెడ్డిని మూడు సంవత్సరాల కాలానికి స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా నియమించింది. ఈ హోదాలో పోలీసింగ్, శాంతి భద్రతలు, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రత వంటి కీలక అంశాలపై ప్రభుత్వానికి మార్గదర్శకత్వం అందించనున్నారు. పోలీసు విభాగంలో దీర్ఘకాల అనుభవం కలిగిన శివధర్ రెడ్డి, ముఖ్యంగా అంతర్గత భద్రత మరియు నక్సల్ వ్యతిరేక చర్యల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. తన సేవా కాలంలో శాంతి భద్రతలు, ఇంటెలిజెన్స్, భద్రతా వ్యవస్థల బలోపేతంలో విశేష పాత్ర పోషించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌బి.సుమతి, ఐజి గజరావు భూపాల్ తదితర ఉన్నతాధికారులు శివధర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.



## 'ఎఎన్‌ఎం పోస్టుల రిక్రూట్‌మెంట్ల'కు తొలగిన అడ్డంకులు

● మరో మూడు రోజుల్లో 'ఎఎన్‌ఎం' ఫలితాలు.. ● భర్తీ ప్రక్రియను వేగవంతం చేసిన రిక్రూట్‌మెంట్ బోర్డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ (ఎఎన్‌ఎం) పోస్టులను భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సన్నద్ధమవుతోంది. కోర్టు కేసులు పరిష్కారం కావడంతో 1931 పోస్టులకు సంబంధించిన ఎఎన్‌ఎం పోస్టుల ఫలితాల విడుదలకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమవుతోంది. మరో మూడు రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని బోర్డు అధికార వర్గాలు చెబుతున్నారు.ఆరోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఎఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో బిఆర్‌ఎస్ తన 2014 ఎన్నికల మ్యాని ఫెస్టోలో హామీనిచ్చింది. కానీ ఆ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేసిందనే విమర్శలు ఉన్నాయి. ఎఎన్‌ఎంలు సమ్మెకు దిగడంతో పాటు 2023లో వారు తమ నిరసనలను తీవ్ర తరం చేశారు. దీనిపైన అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందిస్తూ గత శాసన సభ ఎన్నికలకు (2023 డిసెంబర్) మూడు నెలల ముందు ఎఎన్‌ఎం పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎఎన్ఎంలను బుజ్జగించేందుకు వారికి 30 మార్కుల వెయిటేజీ ఇస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించింది. దీనిని అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరుద్యోగ, (నాన్ సర్వీస్) ఎఎన్‌ఎంలు కోర్టుకు వెళ్లారు. 30 మార్కులు ఇవ్వడం చట్ట విరుద్ధమని, వెయిటేజీని పూర్తిగా తీసి వేయాలని ఆ పిటిషన్‌లో దాఖలు చేశారు. దీంతో రిక్రూట్‌మెంట్‌కు బ్రేకులు పడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఈ కేసు నేపథ్యంలో ఆరోగ్య శాఖలో రిక్రూట్‌మెంట్లను వేగంగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే 12,649 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. ఎఎన్‌ఎం పోస్టులకు సంబంధించి హైకోర్టు సింగిల్ బెంచ్ వద్ద ఉన్న కేసులోనూ ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. రిక్రూట్‌మెంట్‌ను ఆపొద్దని కోరిన నేపథ్యంలో కోర్టు మధ్యంతర ఉత్తర్వుల జారీ చేసింది. దీంతో 2024 డిసెంబర్‌లో ఎఎన్‌ఎం పోస్టులకు సంబంధించిన రాత పరీక్షను నిర్వహించినప్పటికీ, కోర్టులో ఈ కేసు ఉండడంతో తుది ఫలితాలను వెల్లడించలేక పోయింది. ఇటీవల ఈ కేసులో కోర్టు తుది తీర్పును వెల్లడించింది. ఈ తీర్పులో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 20 శాతానికి మించి వెయిటేజీ ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది.అలాగే గతంలో వివిధ కేసుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించింది.



ఈ తీర్పు నేపథ్యంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలా? అనే అంశంపైన రిక్రూట్‌మెంట్ బోర్డ్ రాష్ట్ర న్యాయశాఖను అభిప్రాయాన్ని కోరింది. గతంలో ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులతో పాటు ప్రస్తుత కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం 20 శాతానికి మించి వెయిటేజీ ఇస్తే, మళ్లీ న్యాయపరమైన సమస్యలు వస్తాయని, తద్వారా భర్తీ ప్రక్రియ ప్రమాదంలో పడుతుందని న్యాయశాఖ సూచించింది.ఈ క్రమంలో కోర్టు తీర్పు ప్రకారం 20 శాతం వెయిటేజీ ఇచ్చి, రిక్రూట్‌మెంట్‌ను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2024 డిసెంబర్‌లో రాత పరీక్షను నిర్వహించారు. సుమారు 25 వేల మంది ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, 20,600 మంది పరీక్షకు హాజరయ్యారు. సుమారు 3 సంవత్సరాలుగా వీరంతా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం 1931 ఎఎన్‌ఎం పోస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ సంఖ్య మొత్తంగా 14,580లకు చేరుతుంది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, పిఐయు డివిజన్, నల్లగొండ.
Lr.No.D3/Tenders/01/2026-27/DPRENLG, "షార్ట్ టెండర్ నోటీస్" తేది: 04.05.2026
దిగువ సంతకం చేసినవారు, నల్లగొండ జిల్లాలోని PIU నల్లగొండ డివిజన్ పరిధిలో గల నల్లగొండ పట్టణం మరియు ఘట్టుప్పల్ ప్రాంతాలలో, మొత్తం రూ. 89.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే (10) పనుల కోసం టెండర్లను ఆహ్వానించడమైనది. **దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ:** 11.05.2026; **టెండర్ షెడ్యూళ్ళ జారీ తేదీ:** 14.05.2026; **టెండర్ల స్వీకరణ మరియు ప్రారంభ తేదీ:** 15.05.2026. **తదుపరి వివరాల కోసం సంప్రదించాల్సిన చిరునామా:** DPRE, PIU నల్లగొండ కార్యాలయం (ZPP కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా, నల్లగొండ పట్టణం.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, P.I.U., :: నల్లగొండ.
DIPR R.O. No. : 1987-PP/CL/ADVT/2026-27, Date: 06-05-2026

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.
Short NIT No. 02/EE-II/CIRCLE-39/KHAIRATABAD ZONE/GHMC/2026-27, తేది: 06.05.2026
**NIT No.** 03/EE-II/Circle-39/KZ/GHMC/2026-27, **పని పేరు:** సివిల్ పనులు (1 నెం.లు), **అంచనా విలువ / ఇసివి:** రూ.23.00 లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం :** క్ర.సం.01 పనుల కొరకు 08.05.2026 మ.12:00గం.లకు, 11.05.2026 మ.12:00గం.ల వరకు మాత్రమే, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec39.ameerpet@gmail.com, మొబైల్ నెం. 9063836121.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 2033-PP/CL/ADVT/2026-27, Date: 06-05-2026

## అప్రమత్తంగా చెక్‌పోస్ట్‌ల వద్ద సిబ్బంది

### కలెక్టర్ హరిత ఆదేశాలు






ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సిర్పూర్-టిః** చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం సిర్పూర్ (టి) మండలం పెద్దబండ వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతున్నందున పక్క రాష్ట్రాల నుండి ధాన్యం అక్రమంగా రాకుండా చూడాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి మత్తు పదార్థాలు, ప్రభుత్వం నిషేధించిన పత్తి విత్తనాలు, గడ్డి మందుల రవాణా జరిగే అవకాశం ఉన్నందున నిశితంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. రవాణా పత్రాలను సరిచూసిన తర్వాతే వాహనాలను అనుమతించాలని పేర్కొన్నారు.

**'ప్రజాపక్షం' వార్తకు స్పందన:** సిర్పూర్ (టి) మండలంలోని చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా లోపించి అక్రమ రవాణా సాగుతోందని బుధవారం 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ తక్షణమే స్పందించారు. స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీ కేంద్రాల పనితీరును సమీక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, అక్రమాలకు తావులేకుండా నిఘా పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సాగుపై శాస్త్రవేత్తల అవగాహన



**ప్రజాపక్షం/రెబ్బెనః** రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి. రాజశేఖర్, పంటల ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ దేవా అనిల్ పాల్గొని రైతులకు సాగుపై కీలక సూచనలు చేశారు. యూరియా వినియోగం తగ్గించి సమతుల్య ఎరువులు వాడాలని, పంట వైవిధ్యం పాటించాలని సూచించారు. వరి రకాల ఎంపిక, నీటి ఆదా పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ జగదీశ్, ఏఈఓ శివకుమార్, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్ః** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన భారీ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ప్రైవేటు రంగంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, అధికారులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో సాగులో లాభాలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్ః** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం తాంసి మండలం పొన్నారి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రోన్ ద్వారా నువ్వుల విత్తే విధానం" ప్రదర్శనను ఆయన పరిశీలించారు. డ్రోన్ల వాడకం ద్వారా సమయం, శ్రమ ఆదా అవ్వడమే కాకుండా కూలీల కొరత సమస్య తీరుతుందని పేర్కొన్నారు. సాగు ఖర్చులను తగ్గించుకునేందుకు రైతులు ఇటువంటి వినూత్న ఆవిష్కరణలను అదిపుచ్చుకోవాలని సూచించారు. ఆత్మ చైర్మన్ నారాయణ, శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ, జేడీఏ శ్రీధర్ స్వామి, సర్పంచ్ భూమన్న, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## గోడౌన్లను సిద్ధం చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** వరి ధాన్యం నిల్వ చేయడానికి గోడౌన్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుదవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును తనిఖీ చేసి గోడౌన్లను పరిశీలించారు. వరిధాన్యం కొనుగోలును త్వరలోనే పూర్తి చేస్తామని ఇక్కడి ధాన్యాన్ని ఇక్కడే నిల్వచేసే ఏర్పాట్లు చేపడుతామని రైతులకు హామీ ఇచ్చారు. గోనె సంచులు, లారీల కొరత లేకుండా చూడాలని అదికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసిల్దార్ విజయ్ కాంతారావు, ఎంపిడిఓ లక్ష్మీ కాంత్, అధికారులు, పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/వాంకిడిః** వాంకిడి మండలంలోని బంబారా గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీ అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్ బెండారే కృష్ణాజి, ఈసీ మోసిన్ బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని పర్యవేక్షించి కార్మికులకు పలు సూచనలు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పని సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు అధికంగా తాగుతూ ఓఆర్ఎస్ ద్రావణం వాడాలని అవగాహన కల్పించారు. ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. నర్సరీలోని మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టిఏ ప్రభాకర్, ఉప సర్పంచ్ జాడే సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ చారి పాల్గొన్నారు.

# నిర్మల్, భైంసా హైవేపై అన్నదాతల 'మహాగర్జన'

### 400 ఎకరాల జొన్న పంట కోసం..

### 8 గంటలపాటు హైవే దిగ్బంధనం !





**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లాలో రైతన్నల ఆవేదన కట్టలు తెంచుకుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా రొడ్డెక్కి పోరాడాల్సిన దుస్థితిపై రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని గుండంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి 61పై దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్ని, రాంపూర్ గ్రామాల రైతులు కలిసి నిర్వహించిన రాస్తారోకో యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఏకంగా ఎనిమిది గంటల పాటు హైవేను దిగ్బంధించి రోడ్డుపైనే పొయ్యిలు రాజేసి వంటావార్పు చేపట్టడంతో నిర్మల్, భైంసా రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. సాధారణంగా ప్రభుత్వం గోనే సంచులను సరఫరా చేసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయిన రైతులు తమ పంట వర్షానికి తడిసిపోకూడదనే ఆవేదనతో ఒక అడుగు ముందుకేసి సాహసం చేశారు. ప్రభుత్వ సాయం కోసం వేచి చూడకుండా, తమ సొంత నిధులతో సుమారు 8000 జోరు బొంత బ్యాగులను (గోనెసంచులు) కొనుగోలు చేశారు. పండించిన జొన్నలను ఆ సంచుల్లో నింపి అమ్మకానికి సర్వం సిద్ధం చేసి కళ్ళాల్లో కుప్పలు పోసి పెట్టుకున్నారు. ప్రభుత్వం కేవలం లారీలను పంపి కాంటా వేయడమే మిగిలి ఉన్నా నెలల తరబడి తాత్సారం చేయడంపై రైతులు తీవ్రాగహం వ్యక్తం చేశారు. మేము మా సొంత డబ్బులతో సంచుకొని నింపి పెట్టినా కొనే దిక్కు లేకపోతే ఇక ప్రభుత్వం ఎందుకు ? అధికారులను నిలదీశారు.

### కళ్ళాల్లో జొన్నలు, వర్ష భయం

మార్చి నెలలోనే మొక్కజొన్న కొనుగోళ్ళు ప్రారంభిస్తామని పాలకులు, అధికారులు ప్రగల్భాలు పలికినప్పటకీ ఆచరణలో మాత్రం అది అమలు కాలేదు. మే నెల వచ్చినా కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రతినిధి రమణారెడ్డి మాట్లాడుతూ, మరో నాలుగు రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయని, ఆ లోపు కొనుగోలు చేయకపోతే 400 ఎకరాల్లో సాగు చేసిన జొన్నపంట పూర్తిగా తడిసి ముద్దవుతుందని ఆందోళన చెందారు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని, పంట చేతికొచ్చినా అమ్ముకోలేక పోతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షం పడితే గింజ మొలకెత్తి కష్టమంతా బూడిపాలవుతుందని వారువాపోయారు.

### రోడ్డుపైనే వంటావార్పు

ఉదయం ప్రారంభమైన ఈ ధర్నా మధ్యాహ్నం దాటినా కొనసాగింది. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా రైతులు జాతీయ రహదారిపైనే పొయ్యిలు రాజేసి వంటావార్పు చేపట్టారు. దీంతో నిర్మల్ భైంసా రహదారిపై ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వ్యాపారస్తులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న దిలావర్‌పూర్ తహసిల్దార్, ఆర్‌డిఓ సంఘటన స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. అయితే గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించబోమని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. ఇది ఎటువంటి రాజకీయ వేదిక కాదని, కేవలం తమ ఆకలి కేక అని, సమస్య పరిష్కారం కాకుంటే పంట దిగుబడిని నిలిపివేస్తామని హెచ్చరించారు.

### కలెక్టర్ 'ఫోన్' హామీతో ముగిసిన ఉద్రిక్తత

సుమారు 8 గంటల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ హైవే దిగ్బంధనం చివరకు జిల్లా కలెక్టర్ జోక్యంతో సుఖాంతమైంది. పరిస్థితి తీవ్రతను గమనించిన జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి అధికారుల ద్వారా ఫోన్లో రైతులతో మాట్లాడారు. కలెక్టర్ స్వయంగా భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించి తమ 8 గంటల నిసనను విరమించారు. అధికారుల్లో చల నం వచ్చి వా తావరణం మారకముందే తమ పంటను సురక్షింతంగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తారని దిలావర్‌పూర్ మండల రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మాట తప్పితే మరింత ఉధృతమైన ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తూ రైతులు రహదారిని ఖాళీ చేశారు.

## ఆర్‌ఒబిల నిర్మాణాలకు..

## కేంద్రం గ్రీన్ సిగ్నల్ : ఎంపి హర్షం

### కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ధన్యవాదాలు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** జిల్లాలో మరో రెండు ఆర్‌ఓబీల నిర్మాణాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. ఇందల్వాయి, జాన్కంపేట్ గూడ్స్ షెడ్ల వద్ద ఆర్‌ఓబీల నిర్మాణాలను చేపట్టాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపు రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రైల్వే ఉన్నతాధికారులను కలిసి పలుమార్లు విజ్ఞప్తులు అందించిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లాలో ప్రజల ధీర్ఘకాలిక రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారందిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాన్ని హర్షిస్తూ ఎంపీ అరవింద్ కేంద్ర ప్రభుత్వానికి మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని జాన్కంపేట్‌నిజామాబాద్ వద్ద ఎల్‌సీ 190ఎ, ఇందల్వాయిసిర్నాపల్లి మధ్య ఎల్‌సీ 198ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను స్పెషల్ రైల్వే ప్రాజెక్టు కింద గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం, రైల్వే చట్టం 1989 లోని సెక్షన్ 2, క్లాస్ (37ఎ) ప్రకారం లభించిన అధికారాలను వినియోగిస్తూ ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టును జాతీయ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కేంద్రం చేర్చటం ఎంతో ప్రాముఖ్యమైన నిర్ణయమని ఎంపీ అన్నారు. నిజామాబాద్ మీదుగా నడిపచే పలు రైళ్లను స్పెషల్ రైళ్ల నుంచి రెగ్యులర్ రైళ్లుగా మార్చటంతో ప్రయాణీకులకు మరింత సౌలభ్యం కలిగిందని ఆయన్నారు. దీంతో రైలు సౌకర్యాలు స్థిరపడటంతో పాటు జిల్లాకు రవాణా పరంగా మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఈ ప్రాజెక్టులను స్పెషల్ రైల్వే ప్రాజెక్టు కింద చేర్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యంగా రైల్వేశాఖకు మరోసారి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు అరవింద్ తెలిపారు.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో రైతులకు రుణాలు

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి




**ప్రజాపక్షం/నర్సాపూర్:** రైతులు బ్యాంకుల, సహకార సంఘాల ద్వారా అందించే రుణాలను సద్వినియోగ పరుచుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి అన్నారు. బుధవారం నర్సాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలు భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలో మూడవరోజు బ్యాంక్ ల దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు సహకార సంఘాల ఎప్‌పిఓ ల ద్వారా రైతులకు సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, అదనపు కలెక్టర్ మెంచు నాగేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి మాట్లాడుతూ గత దశాబ్ద కాలం తో పోల్చుకుంటే ప్రస్తుతం తెలంగాణలో వరి సాగు పెరిగిందని, వాడకం రెట్టింపు అయిందని అ న్నారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చే యించుకొని దాని ద్వారా వచ్చే పరీక్షలను బట్టి ఎ రువులను మోతాదులో వాడాలని కోరారు. రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వ్యవసా య శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడి వచ్చే పంటల ను సాగు చేయాలని అన్నారు .అనంతరం అదన పు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి దేవ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మి, పిఏసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, వ్యవసాయ శాఖ ఏడిఏ సంధ్యారాణి, ఏవో దీపిక, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## బీడి కార్మికుల వేతన పోరు..

### నేడు యాజమాన్యాలతో కీలక చర్చలు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది బీడి కార్మికుల భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన వేతన చర్చలు నేడు హైదరాబాద్‌లో జరగనున్నాయి. బీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ప్యాకర్స్, శేఖర్స్, నెలసరి ఉద్యోగులు, బట్టీవాలా, చెన్నివాల వంటి అన్ని విభాగాలకు చెందిన కార్మికుల పాత వేతన ఒ ప్పందం గత ఏప్రిల్ 30వ తేదీతో ముగిసింది ఈ నేపథ్యంలో 2026 మే 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చేలా నూతన వేతన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని తెలంగాణ ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తోంది. యూనియన్ ఇప్పటికే యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు అందజేయగా నేడు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ వేదికగా యాజమాన్య ప్రతినిధులతో చర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడి కార్మికుల యూనియన్ పక్షాన గట్టి వాదన వినిపించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం అందుతున్న వేతనాలపై 50 శాతం మేర కూలీ రేటును పెంచాలని ప్రభుత్వ జీఓ ప్రకారం 1000 బీడిలకు రూ. 450 కూలీని చెల్లించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా కార్మికుల ప్రసూతి సెలవులకు సంబంధించి వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేయాలనే అం శాన్ని కూడా మేనేజ్‌మెంట్ ముందు ఉంచనున్నా రు. యాజమాన్యాలు మొండివైఖరి వీడి కార్మికుల న్యాయమైన కోర్కెలను గుర్తించి సానుకూలమైన ఒ ప్పందాన్ని కుదుర్చుకోవాలని యూనియన్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. నేడు జరిగే ఈ చర్చల ఫలితంపై ఉత్తర తెలంగాణలోని బీడి కార్మిక కుటుంబాలు, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## నానో యూరియాతో అధిక దిగుబడి

### రైతులకు..

### అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో వ్యవసాయ అధికారి సచిన్ ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాస్త్రవేత్త బేబీ ఆకుల సైంటిస్ట్, ప్రొఫసర్ హెడ్ త్రివేణి లు హాజరై రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు సాధారణ యూరియా తోపాటు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడడం వల్ల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందన్నారు. లిక్విడ్ రూపంలో ఉండే నానో యూరియాలోను యూరియాతో సమానమైన నత్రజని ఉంటుందని, పైగా దీని రవాణా, నిలువ, వినియోగం కూడా సులభంగా ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ యూరియా వాడకం,అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, పంటల మార్పిడిని పాటించడం, మార్కెట్లో ఎక్కువ గిరాకీ ఉన్న వరి రకాలను పండించడం వల్ల అధిక లాభాలు వస్తాయన్నారు. సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం రైతులు వారికి ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులు,వరి,ఇతర విత్తనాలు సబ్సిడీలో సీజన్ మొదట్లోనే అందే విధంగా కార్యచరణ చేయాలని రైతులు కోరారు.ప్రపంచ మద్దూరి నవ్య నాగరాజు గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కు మార్ ముదిరాజ్, పంచాయతీ సెక్రెటరీ ప్రి యాంక, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సెంటర్ తెరిస్తేనే వరి కోయండి..

## లేదంటే మీ ఇష్టం !

### రైతుల గోడు పట్టించుకోని ఏపిఎం దుర్గయ్య

**ప్రజాపక్షం / రెబ్బెనః** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో ఐకెపి అధికారుల మొండి వైఖరి వరి సాగు చేసిన రైతులను అయోమయంలో పడేస్తోంది. ఒకవైపు ఆకాశం మేఘావృతమై అకాల వర్షాల భయం వెంటాడుతుంటే, మరోవైపు ఐకెపి సెంటర్ తెరిచే వరకు కోతలు కోయవద్దని ఏపిఎం దుర్గయ్య హుకుం జారీ చేయడంపై రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పంట చేతికొచ్చే తరుణంలో వర్షాలు కురిస్తే తాము సర్వస్వం కోల్పోతామని, అందుకే కోతలు కోసి ధాన్యం నిల్వ చేసుకుంటామ్మని రైతులు విన్నవించగా ఏపిఎం బాధ్యతారాహిత్యంగా సమాధానమిచ్చారు. సెంటర్ ఓపెన్ అయితేనే" నా బాధ్యత.. వర్షం వస్తే నేనేం చేస్తాను? వర్షం ఏమైనా చెప్పి వస్తుందా? అంటూ రైతులపై ఎదురుదాడికి దిగడం గమనార్హం. దీనివల్ల రైతులకు అదనంగా ట్రాక్టర్ రవాణా ఖర్చులు సుమారు 700 రూపాయల వరకు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. తక్షణమే ఐకెపి సెంటర్లను ప్రారంభించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

# హిరాపూర్ ఇసుక రీచ్ అక్రమార్కులకు వరప్రసాదం

### బుకింగ్స్ లెక్కల్లోనే, రవాణా అంతా చీకట్లోనే

### నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇసుక దందా

### పట్టించుకోని అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం / సిర్పూర్ టిః** సిర్పూర్ టి మండల పరిధిలోని హిరాపూర్ ఇసుక రీచ్ అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సామాన్య ప్రజలకు తక్కువ ధరకే ఇసుకను అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ రీచ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. అధికారిక లెక్కల్లో బుకింగ్స్ కనిపిస్తున్నా, వాస్తవానికి రీచ్ నుండి ఒక్క ట్రాక్టర్ ఇసుక కూడా నిబంధనల ప్రకారం బయటకు వెళ్లడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

### రాత్రి వేళల్లో జోరుగా రవాణా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రీచ్ నుండి ఇసుకను తరలించాల్సి ఉండగా, కొందరు అక్రమ వ్యాపారులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. పగలు నిశ్శబ్దంగా కనిపిస్తున్న ఈ ప్రాంతం, రాత్రి కాగానే ఇసుక రవాణాతో హోరెత్తుతోంది. అర్ధరాత్రి నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని ఈ దందా సాగిస్తున్నట్లు సమాచారం.

### ప్రభుత్వ ఆదాయానికి గండి

హిరాపూర్ రీచ్ ఆశించిన రీతిలో పనిచేయకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. అధికారికంగా బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక అందడం లేదని, మరోవైపు అక్రమార్కులు మాత్రం ఇసుకను తోడేస్తూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కళ్లముందే ఇంత జరుగుతున్నా వారు మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రీచ్ నిర్వహణపై అధికారుల నియంత్రణ పూర్తిగా లోపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు కొన్ని బుకింగ్స్ మాత్రమే నమోదయ్యాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ బుకింగ్స్ ప్రకారం ఇసుక పంపిణీ జరగకపోవడం గమనార్హం. కేవలం రికార్డుల కోసం మాత్రమే రీచ్‌ను నిర్వహిస్తున్నట్లుగా ఉందని, వాస్తవానికి అక్రమ రవాణాదారులే ఇక్కడ చక్రం తిప్పుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

### తక్షణ చర్యలు తీసుకోవాలి

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి హిరాపూర్ ఇసుక రీచ్‌పై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టాలని, నిబంధనల ప్రకారం అధికారికం గా ఇసుక పంపిణీ జరిగేలా చూడాలని డిమాండ్ చే స్తున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుందని హెచ్చరిస్తున్నారు.



## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్‌లోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు, అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సెంటర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు ఆదేశించారు. అదేవిధంగా ట్యాబ్ ఎంట్రీల నమోదు విధానాన్ని పరిశీలించి, రైతుల వివరాలు ధాన్యం నమోదును సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, తహసీల్దార్, ఏపీఎం, కమిటీ సభ్యులు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన మొక్కజొన్న రైతులు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల బీట్‌లో మొక్కజొన్న కొనుగోలు సాగడం లేదని బుధవారం అన్నదాతలు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. రైతుల ఆందోళనతో జగిత్యాల పట్టణంలోని బీట్ చౌరస్తా నిజామాబాద్ జగిత్యాల రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. గత 20 రోజుల క్రితం మొక్కజొన్న పంటను విక్రయించేందుకు జగిత్యాల బీట్ కు తరలించిన ఇంకా కొనుగోళ్లు చేయటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా రైతుల ఆందోళనతో రహదారి స్తంభించిన విషయాన్ని తెలుసుకున్న జగిత్యాల పట్టణ సిఐ కరుణాకర్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించగా నిరసనను విరమించారు.

## విగ్రహప్రతిష్ఠాపనలో ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/చందుర్తి :** మండలం లోని కట్ట లింగంపేట గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగాదేవి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎఎంసి చైర్మన్ రాములు గౌడ్

**ప్రజాపక్షం/పెగడపల్లి :** రైతుల ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రైతును రాజుగా చూడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగ్గంగా వ్యవస్థాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రైతు వారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ సాగుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు ఆదర్శ రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిజాముద్దీన్, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్, ఏఈఓ రజిత పాల్గొన్నారు. అలాగే సర్పంచులు ఓరుగల అరుణ, మోకినపెల్లి గోపాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఓరుగల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సభ్యులు చాట్ల భాస్కర్, దేశెట్టి లక్ష్మి రాజం, శ్రీరాం అంజయ్య, మ్యాకల మల్లయ్య, లింగంపల్లి మహేష్, భోగ భూమయ్య, ఐలేని వంశీధర్ రావు, ఐకేపీ సిబ్బంది తిరుపతి మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బాలసదనం విద్యార్థినులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. తిమ్మాపూర్ కేజీబీవీ చదువుతున్న కే.సాధన 536 మార్కులు సాధించి, స్కూల్లో ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఇదే స్కూల్లో చదువుతున్న ఎం.హారిని 516 మార్కులు సాధించింది. ఆరేపల్లి జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో చదువుతున్న కే హారిని 298 మార్కులు సాధించింది. ఈ ముగ్గురు విద్యార్థినులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అభినందించారు. ఉన్నత చదువులు చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థినిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి యం.సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) దుర్దాన పర్వీన్, శాంత, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా..

# మెగా జాబ్ మేళా



ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్లు ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రోజు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని, అయితే 1500 మంది మాత్రమే షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. గోల్డ్ మెడలిస్టలు అయినా సరే సాఫ్ట్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ లేకపోతే పరిశ్రమలకు పనికిరావని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ… తెలంగాణ ఏర్పడిన తర్వాత నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం పెద్దపల్లిలో టాస్క్ (TASK) ఏర్పా టు చేసినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది యువత ప్రస్తుతం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళాను పరిశ్రమల శాఖ, టాస్క్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో 1200 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్ కావడం జరిగిందని, 647 మల్టీ యువతకు అపాయింట్మెంట్ ఆర్డర్లు సిద్ధం చేశామని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. యువత సంక్షేమంతోనే "తెలంగాణ రైజింగ్" సాధ్యమవుతుందని, యువతకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అనేక కంపెనీలను తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో కొనుగోలు

**ప్రజాపక్షం/మంథని :** ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మంథని ఆర్డిఓ సురేష్,సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కలెక్టర్ బి.సత్యప్రసాద్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు. బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండలంలోని గోదూరు, తిమ్మాపూర్ తాండ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, తూకం, నిల్వ,రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు తగినంతగా అందుబాటులో ఉంచాలని, ధాన్యం పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మిల్లుల వద్ద వేగంగా అన్‌లోడింగ్ జరిగేలా సమన్వయం చేయాలని చెప్పారు. వర్షాల సమయంలో రైతులు చెట్లు, కరెంటు స్థంభాల వద్ద నిలవకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, ఏవో ఆకు రాజ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రం తీరుతో ధాన్యం కొనుగోలు ఆలస్యం



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధనలు కొనుగోలులో జాప్యం జరుగుతోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లాలో కురిసిన ఆకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ బుధవారం ఉదయం పరిశీలించారు. ధర్మపురి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్నలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చింది అని అన్‌లైన్‌లో ట్రక్‌షీట్‌తో పాటు ధాన్యం తరలిస్తున్న వాహనాలకు జిపిఆర్ఎస్ వంటి సాంకేతిక సమస్యలతో కొనుగోలు 15 రోజులు ఆలస్యంగా ప్రారంభమైనట్లు మంత్రి వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలతో రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో నిబంధనలను సడలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత పద్ధతిలో ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేయడంతో కొనుగోలు ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. వారం పది రోజుల్లో మార్కెట్ యార్డుల్లో ఉన్న ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన పడవద్దని పండించిన చివరి గింజ కొనుగోలు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి తెలిపారు. అధికారులు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మంత్రి సందర్భంగా సూచించారు. రైతులకు ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, నాయకులు చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, సొల్ల నరేష్, చీపురుశెట్టి రాజేష్ ఉన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి




ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని ప్రభుత్వ విప్, పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నరని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు వంటి పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రైసుమిల్లర్లను, అధికారులను ఒప్పించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కిలో కటింగ్ కూడా లేకుండా కొనుగోళ్లు జరిపిస్తున్నామన్నారు. తాను రైతు పక్షపాతినని, రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తనకు నేరుగా తెలియజేస్తే పరిష్కారం చేయడం జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు మరియు పెద్దపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు,తదితరులు పాల్గొన్నారు.



## పెద్దచెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.2.86 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధి పనులకు అమృత్ 2.0 గ్రాంట్ నిధుల నుంచి రూ.2 కోట్ల 86 లక్షలతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను గురువారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ మెట్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సహకారంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కౌన్సిలర్ల సహకారంతో పట్టణ సమగ్రాభివృద్ధికి పాలకమండలి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలు ఇంటి పన్ను వసూళ్లలో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచాయని తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద మంజూరైన రూ.2.86 కోట్లతో పెద్దచెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు రేబ్బస్ మహేష్, బత్తుల నరేష్, పందిరి రమేష్,అంగడి పురుషోత్తం, కాజా అజీముద్దీన్, మాసుల ప్రవీణ్, బోడ్ల ఆనంద్, గుడికందుల అజయ్, మునుగొండ నరేష్, కోఆప్షన్ సభ్యుడు మాధవరెడ్డి, ధర్మపురి వేణుగోపాల్, బంగారుకాళ్ల కిషోర్, జావిద్, డీఈ నాగేశ్వరరావు, ఏఈ దీపక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ముజీబ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దరిపల్లి చంద్రం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్, టిపిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రంను వరించింది. తెలుగుదేశం నుండి సిఎం రేవంత్‌రెడ్డి వెంట దరిపల్లి చంద్రం నడిచారు. సిఎం రేవంత్‌రెడ్డితో కలసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అలాగే భవన నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి వరించటంతో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రభుత్వ సహాయం అందేలా చూస్తా

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వేంపల్లి గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గ్రామానికి చెందిన గుమ్ముల లత మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధం అవ్వగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి మహిళా రైతులతకు ధైర్యాన్ని కల్పించారు. పెట్టుబడి పెట్టి ఎకరం 20 గుంటల భూమిలో కష్టపడి పండించిన మొక్కజొన్న పంట కళ్ళ ముందే కాలి బూడిద అయిందని మహిళా రైతు రోదించింది. దీంతో ఎమ్మెల్యే సంజయ్ అధైర్య పడొద్దు అండగా ఉంటానని , సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి జరిగిన నష్టంపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుండి సాయం అందేలా చర్యలు తీసుకుంటారని బాధితురాలకు భరోసా కల్పించి హామీ ఇచ్చారు. తలవంతు సాయంగా ఎమ్మెల్యే రూ.5000 నగదును బాధితురాలు లతకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్, మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, నాయకులు న్యామతాబాద్ రాజు, బైరి రవికుమార్, మచ్చర్ల శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, తోట శ్రీను, బైరి రాకేష్, రవి, వివిధ గ్రామాల నాయకులు,తదితరులున్నారు.

## ఘనంగా రైతు వారోత్సవాలు



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాల కార్యక్రమం కాటన్ మార్కెట్ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, రైతులకు కావాలసిన అన్ని సౌకర్యా సదుపాయాలు మార్కెట్‌లో కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన తమ పంటలకు మంచి గిట్టుబాటు ధరలు రావాలంటే నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకొని వచ్చి తమ సరుకులను విక్రయించాలన్నారు. మార్కెట్‌లో అమ్ముకొని ఇంటికి వెళుతున్న క్రమంలో ఏదైనా ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగి రైతు చనిపోతే రూ.లక్ష, లేదా శాశ్వత అంగవైకల్యం అయితే రూ.75 వేల లేదా తాత్కాలిక అంగవైకల్యం జరిగినట్లయితే రూ.25 వేల భీమా సౌకర్యం మార్కెట్ కమిటి ద్వారా అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఎన్.రాజా వైస్ ఛైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి సభ్యులు శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వర రావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్ కేడిసిసి బ్యాంక్ సిబ్బంది, ప్యాక్స్ సిబ్బంది, సహకార బ్యాంక్ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, వ్యాపారస్తులు, హమాలీ, దాడువై కార్మికులు, ఆడకూలీలు, రైతు ప్రతినిధులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదర్శ రైతులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్, వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశారు.

## అకాల వర్షం... అన్నదాత ఆగమాగం

కొనుగోలు ప్రారంభించాలని రైతుల నిరసన



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఆరుగాలం రైతు కష్టం నేల పాలు.. చేతికందిన పంటనూర్పిడి పూర్తి చేసుకోని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం కుప్పలు ఉండటంతో మంగళవారం కుర్సిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం మరాడించి కొనుగోలుకు సిద్ధం చేసిన రైతులకు అకాల వర్షం తీవ్రంగా నష్టం చేసింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప, తిగుల్, చాట్లపల్లి, మాందాపూర్, దౌలాపూర్, పీర్లపల్లి, ఇటిక్యాల తదితర గ్రామాలలో గత పదిరోజుల క్రితం ఐకేపి, పిఎసిఎస్ సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన గింజ కూడ సేకరణ చేయకపోవడంతో టన్నుల కొద్ది వరి ధాన్యం కల్లాలోనే నిలిచి పోయింది. దింతో రైతులు ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని చాట్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రొడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ధాన్యం కొనుగోల్లపై సంబంధిత అధికారులను విచారించగా హమాలీల కొరత మూలంగా ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందని పేర్కొంటున్నారు. ఏది ఏమైన వరి ధాన్యం కొనుగోలులో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# అధికారుల చేతుల్లోకి కార్పొరేషన్ పాలన

### ముగిసిన పాలక వర్గ పదవీ కాలం
### ఎన్నికలకు మరి కొంత సమయం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్ పాలన పూర్తిగా అధికారుల చేతుల మీదుగా సాగనుంది. కార్పొరేషన్ పాలక వర్గ పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఖమ్మం మున్సిపాలిటీ నుండి నగరంగా రూపాంతరం చెందిన తర్వాత రెండు వర్గాలు పని చేశాయి. తొలి మేయర్‌గా డా॥ పాపాలాల్ పని చేయగా రెండవ దఫా పునుకొల్లు నీరజ మేయర్‌గా ఎన్నికై ఐదేండ్లు పాలన సాగించారు. ప్రస్తుత పాలక వర్గంపై అవినీతి ఆరోపణలు రాలేదు కానీ అధికార యంత్రాంగంపై ఒక స్థాయిలో ఆరోపణలు వచ్చాయి. ఐదేండ్ల కాలంలో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వేగంగా కొన్ని పూర్తి చేయగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పాలక వర్గం కాలంలో ఖమ్మం నియోజక వర్గం నుంచి శాసన సభ్యులుగా ఎన్నికైన వారు మంత్రులుగా ఉండటం సానుకూల అంశంగా మారింది. 2021 మే 7న బాధ్యతలు స్వీకరించిన సమయంలో అప్పటి శాసన సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్రంలో రవాణా శాఖ మంత్రిగా ఉండి కార్పొరేషన్ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఐటి హబ్, తీగల వంతెన, మున్నేరు రిటైనింగ్ వాల్ సహా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అంతర్గత రోడ్ల నిర్మాణం నగరంలోని ప్రధాన రహదారుల స్వరూపం మారింది. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో అజయ్‌కుమార్ ఓడిపోయి ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు గెలవటం, రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం విధితమే. తుమ్మల హయాంలో కూడా కార్పొరేషన్ అభివృద్ధి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించారు. ఇద్దరు మంత్రులుగా పనిచేయటం కార్పొరేషన్ పాలక వర్గానికి కలిసి వచ్చింది. పాలేరు నియోజక వర్గం పరిధిలో కొన్ని డివిజన్లు ఉండగా పాలేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా మంత్రి వర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా ఉండటం కూడా ఆ డివిజన్లలో అభివృద్ధి పనులు జరిగేందుకు దోహదపడింది. కార్పొరేటర్లు, మేయర్ విషయంలో ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకపోయినా అధికార యంత్రాంగంలోని కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించారు. పలు సందర్బాల్లో కొందరు అధికారులు తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఎదుర్కొన్నారు. పాలక వర్గ పదవీ కాలం ముగియటంతో ఇప్పుడు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించే ప్రమాదం ఉందన్న ఆందోళన కార్పొరేషన్ పరిధి ప్రజల్లో నెలకొంది. కమిషనర్‌గా పని చేస్తున్న అభిషేక్ అగస్త్య సమర్థవంతమైన అధికారిగా పేరొందిన ఇప్పుడు పూర్తి బాధ్యతల్లోకి రావడంతో అధికార యంత్రాంగంపై పూర్తి పట్టు సాధించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

## దెందుకూరు పిఏసిఎస్ చైర్మన్‌గా కోట వెంకటకృష్ణ బాధ్యతలు



**ప్రజాపక్షం/ మధిర :** దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కోట వెంకటకృష్ణ తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పిఏసిఎస్) గత పాలవకర్గాలకే తిరిగి బాధ్యతలు అప్పగించాలని హైకోర్టు తీర్పు వెల్లడించడంతో పలువురు మాజీ చైర్మన్లతో పాటు ఆయా పాలకవర్గ డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది ఫిబ్రవరి 14తో పిఏసిఎస్‌లో పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం డిసెంబర్ 19వ తేదీ వరకు గడవును పొడిగించింది. ఆతర్వాత ప్రభుత్వం పిఏస్ఎస్‌లకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రాథమిక సహకార సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదందటూ పలు పిఏసిఎస్ మాజీ చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పుతో బుధవారం తిరిగి కోట వెంకటకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పరుచూరి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఖమ్మం జిల్లాకు చెందిన పరుచూరి మురళీ కృష్ణ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు సంస్థల కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించింది. కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బండి రమేష్, వైస్ చైర్మన్‌గా పరుచూరి మురళీకృష్ణను నియమించింది. మురళీకృష్ణ బోనకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన మురళీకృష్ణ కాంగ్రెస్ అధి నాయకత్వానికి అత్యంత సన్నిహితులు. బోనకల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ముఖ్యంగా నారాయణపురం పరిసర ప్రాంతాల్లో పార్టీ అభివృద్ధికి మురళీకృష్ణ చేసిన కృషికి పార్టీ ఈ గుర్తింపునిచ్చింది. మురళీకృష్ణ ఎంపిక పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

## బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వెంటనే వేయించుకోవాలి: డా.పృథ్వీరాజ్‌నాయక్



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో పారామెడికల్ బృందం, పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ వ్యాధి సోకకుండా హ్యూమన్ పాపి లోమావైరస్(హెచ్‌పివి) నివారణ వ్యాక్సిన్ ముందుగా జాగ్రత్తగా 14 నుండి 15సంవత్సరాల లోపు బాలికలు వెంటనే మధిర 100పడకల ఆసుపత్రి నందు ఆశా వర్కర్లను సంప్రదించి వెంటనే టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## త్రిపుల్ ఎస్ఇవి బైక్ షోరూం ప్రారంభం



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల కేంద్రం లోని ఆళ్లపాడు రోడ్డులో సొసైటీ కాంప్లెక్స్ నందు త్రిపుల్ ఎస్ఇవి బైక్ షోరూంను బుధవారం పొన్నం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొల్యూషన్ రహిత వాహనాలు వాతావరణానికి ఎంతో మేలు చేస్తాయని, ఈ వాహనాలకి శబ్ధకాలుష్యం కూడా ఉండదని తెలిపారు. సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వలన చాలా తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చని, ఇప్పుడున్న పెట్రోల్, డీజిల్ సంక్షోభంలో ఈ వాహనాలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, చెడే వెంకటేశ్వరరావు, గుండపనేని సుధాకర్‌రావు, తేళ్లూరి రమేష్, కిలారు సురేష్, గుగులోతు నరేష్, గంగుల నాగయ్య, గుగులోతు నాగేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి గుగులోతు రమేష్, గంగుల శ్రీనివాసరావు, నందమూరి సత్యనారాయణ, షోరూం నిర్వాహకులు షేక్.షీలాక్, ఉప్పర శ్రీను, తెల్లాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న అశ్వారావుపేట పోలీసులు



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** పోలీసులంటే కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాదు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ప్రాణదాతలు అని అశ్వారావుపేట పోలీసులు నిరూపించారు. అశ్వారావుపేట మూడవ కిలో మీటర్ రాయి వద్ద జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ యయాతి రాజు వారి సిబ్బందిని నిమిషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి పంపించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బాధితుడిని రక్షించేందుకు శరవేగంగా ప్రయత్నాలు ప్రారంభించారు. క్షతగాత్రుడికి ప్రాథమిక సాయం అందిస్తూ సకాలంలో ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఆపదలో ఉన్న వ్యక్తి పట్ల వారు చూపిన చొరవ అక్కడ ఉన్న స్థానికుల మనసును గెలుచుకుంది. సమయానికి చేరుకుని ఒక నిండు ప్రాణాన్ని కాపాడేందుకు కృషి చేసిన ఎస్సై యయాతి రాజు, పోలీస్ సిబ్బందికి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానత్వానికి నిలువుటద్దంలా నిలిచిన పోలీసులకు ధన్యవాదాలు అంటూ ప్రజలు వారిని అభినందిస్తున్నారు.

## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల కేంద్రంలోని తల్లాడ బస్టాండ్‌లో నిత్యం ఒక వారం నుంచి మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. అయితే బుధవారం మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ ధుపాటి భద్రరాజు వారి అమ్మ నాన్న ధుపాటి వెంకటరాజు, తులశమ్మ జ్ఞాపకార్థం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ దాతగా సహకరించడం జరిగింది. ఈ సందర్భంగా ధూపాటి భద్రరాజు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా మంచి కార్యక్రమం అని, తల్లాడ బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయాలని తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రత్యేకంగా అభినందించారు.

# రూ. 100 కోట్లతో 15వ డివిజన్ అభివృద్ధి

### మోడల్‌గా డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానం
### టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణం
### మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కరుణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో రూ. 100 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు తెలిపారు. ఇతర దేశాలకే పరిమితమైన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని మొట్ట మొదటి సారిగా దేశంలోనే ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో మోడల్‌గా రూపొందించినట్లు వారు తెలిపారు. బుధవారం 15వ డివిజన్ అల్లిపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని తెలిపారు. విలీన ప్రాంతమైన 15వ డివిజన్ అల్లిపురంలో కార్పొరేషన్ నిధులతో పాటు ఇతర నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇతర దేశాలకే పరిమితమైన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని మొట్ట మొదటి సారిగా అల్లిపురం డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా నేరుగా శుద్ధి చేసిన నీటిని ఇంట్లోని ప్రతి ట్యాప్‌కు 24 గంటలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మూడేళ్ల కాలంలో రూ. 100 కోట్ల అభివృద్ధి పనులు డివిజన్‌లో చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని కొత్తగూడెం, అల్లిపురం, పుట్టకోట, రుద్రమ్మకోట, జిఆర్ఆర్ శ్రీనివాసం, కాకతీయ హిల్స్ తదితర ప్రాంతాల్లో సిసి రహదారులు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో బిటి రోడ్ల నిర్మాణంతో పాటు అల్లిపురంలో వైకుంఠ ధామం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూర్చినట్లు తెలిపారు. ముఖ్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మంకు ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా అల్లిపురం ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి 20 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ఏఐ సెన్సార్లతో నీటి సరఫరా, లీకేజీలు, ఎంత మేర సరఫరా అవుతుందో కూడా తెలుసుకోవచ్చునని తెలిపారు. ఇంట్లో మూడవ అంతస్తుకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. డివిజన్ అభివృద్ధితో పాటు టిటిడి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ఈ సందర్భంగా డివిజన్ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, సంక్రాంతి నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ గుండె ఆదినారాయణ, రావూరి చిన్నరామయ్య, సామినేని సైదులు, ప్రత్తిపాటి ఉపేందర్, సామినేని బాబు, చల్లగుండ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నేత కర్ణకు మాతృవియోగం

### నివాళులర్పించిన బాగం, దండి, పలువురు నాయకులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామానికి చెందిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్‌కు మాతృ వియోగం జరిగింది. ఆయన తల్లి సిద్ధినేని హేమలత(68) గుండెపోటుతో ఇంటి వద్ద బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పార్టీ తరుపు నుంచి ప్రగాఢ సానుభూతిని కుటుంబానికి తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. నివాళుర్పించిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రబాబు, సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యుడు మదుపల్లి లక్ష్మణ్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాల్లు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవికమలాకర్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బూర మనోజ్, సిపిఐ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మికులు ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని రఘునాథపాలెంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తూ హక్కుల స్థానే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు తమకు ఉన్న హక్కులను కోల్పోతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్పోరేట్ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. ఇప్పటికే పని గంటల విధానంలో మార్పు వచ్చిందని 10 నుంచి 12 గంటల వరకు పని చేస్తున్నారన్నారు. కార్మికుల హక్కుల కోసం మరోమారు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్.కె. జానిమియా, కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, తాటి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, కురువెళ్ల వెంకయ్య, పల్లెలపాటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలి
### రెవెన్యూ శాఖపై కలెక్టర్ సమీక్ష




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెవెన్యూ శాఖలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు సమయానికి సేవలు అందేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి సంబంధిత అధికారులతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మీ సేవా, భూ భారతి, సాదాబైనామా, ప్రభుత్వ భూములు, పెండింగ్ సర్వేలు, ఇసుక, ఎస్ఐఆర్ వంటి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాదాబైనామా అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్ ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఎన్ని ఫీల్డ్ ఎంక్వైరీలు నిర్వహించారు. ఎంత మంది అర్హులను గుర్తించారు, ఎన్ని దరఖాస్తులను ఆర్‌డిఒకు పంపించారో నివేదికలో స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. జిల్లాలో సాదాబైనామాకి సంబంధించి తహసీల్దార్ల మార్గదర్శకాల ప్రకారం అన్ని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2014 జూన్ రెండుకు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యతనివ్వాలని, దరఖాస్తుదారులు భూమి స్వాధీనంలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా రెగ్యులరైజ్ చేయరాదని, సరైన ఆధారాలు లేకుండా భూమి యాజమాన్యం మారకూడదని హెచ్చరించారు. ఆమోదించిన దరఖాస్తులను పంచనామా తప్పనిసరి కాగా తిరస్కరణాలకు కారణాలు, ఎన్క్వైరీ నివేదిక సరిపోతుందని తెలిపారు. భూమి స్థితిగతులపై పొరుగు పట్టాదారుల అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. భూ భారతి పెండింగ్ ప్లాట్లపై సమీక్షిస్తూ రిజిస్ట్రేషన్ జరగని ప్రతి ప్లాట్‌కు కారణాలు నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయని వారి ప్లాట్లు రద్దు అవుతాయని ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భూ భారతి క్లియరెన్స్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ ప్రతి రోజు మూడు మండలాల నుండి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి తుది ఆమోదం కోసం పంపించాలని తెలిపారు. జిల్లా స్థాయి ఆపరేటర్ మండల అధికారులతో సమన్వయం చేస్తూ పంపిన ప్రతి ఫైల్‌కు భౌతిక ప్రతులు తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి చేరేలా చూడాలని సూచించారు. మీ సేవా దరఖాస్తులను తహసీల్దార్లు సమయానికి క్లియర్ చేయాలని, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తుల్లో పెండెన్సీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూముల వివరాలు, విస్తీర్ణం, అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలతపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, కలెక్టరేట్ వివిధ సెక్షన్‌ల సూపరింటెండెంట్లు, ఆర్ఐలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమ్మె విరమించిన కల్లూరు మున్సిపల్ కార్మికులు

### నెల రోజుల్లో పూర్తి వేతనాలు చెల్లిస్తామని చైర్మన్, కమిషనర్ హామీ



**ప్రజాపక్షం/కల్లూరు :** తమ తొమ్మిది నెలల జీతాలు విడుదల చేయాలని ఈనెల రెండవ తేదీ నుండి ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కల్లూరు మున్సిపల్ కార్మికులు చైర్మన్, కమిషనర్ హామీతో బుధవారం సమ్మె విరమించారు. చైర్మన్, కమిషనర్, మేనేజర్, కొంతమంది కౌన్సిలర్లతో కలిసి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికులు వారి ఇబ్బందుల గురించి, కడుపు ఆకలి గురించి సమ్మె చేశారే తప్ప ఏ రాజకీయ దురుద్దేశంతో చేయలేదన్నారు. కమిషనర్, చైర్మన్ల సమక్షంలో జరిగిన చర్చల్లో భాగంగా రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలను చెల్లించడంతోపాటు మరో నెల రోజుల్లో పెండింగ్ వేతనాల మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చారని వారు తెలియజేశారు. జీతాలతో పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలతో పాటు మూడు జతల యూనిఫాం, చెప్పులు, ఇతర అవసరాలను తీర్చాల్సిన బాధ్యత చైర్మన్, కమిషనర్లపై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**నెల రోజుల్లో పూర్తి వేతనాలు చెల్లిస్తాం: చైర్మన్, కమిషనర్**

రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలతో పాటు నెల రోజుల్లో పెండింగ్‌లో ఉన్న పూర్తి వేతనాలను చెల్లించటానికి సన్నాహాలు చేసినట్లు చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ రాజశేఖర్ లు కార్మికులకు హామీ ఇచ్చారు . సమ్మె శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా కార్మిక నాయకులు తెలియజేసిన మూడు జతల యూనిఫామ్, చెప్పులు, నాలుగు రోజుల వేతనంతో పాటు మిగిలిన అన్ని బకాయిలను చెల్లిస్తామని వారు హామీ ఇచ్చారు.

**నెల రోజుల్లో చెల్లించకపోతే మరలా సమ్మె: ఎఐటియుసి నాయకుల హెచ్చరిక**

నెల రోజుల్లో పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లిస్తామని కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌లు సంయుక్తంగా ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నామని మరో నెల రోజుల్లో మాకు ఇచ్చిన హామీ నెరవేర్చని యెడల మరలా నిరవధిక సమ్మెను చేస్తామని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్లూరు మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓడల కృష్ణమూర్తి, సయ్యద్ వజీర్ మియాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాం బాబు, జిల్లా నాయకులు తడికమళ్ల యోసు కుమార్, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కౌ న్సిలర్లు ఉబ్బన రాంబాబు, దాసరి సుధారాణి, భూక్య రాంబాయి, గుండ్ల పుల్లారావు, యూనియన్ నాయకులు, ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీను, గొల్లమండల యశోద, కే అంజలి, సహాయ కార్యదర్శులు మణిరాజ్, చిన్న, సుధాకర్, కోశాధికారి కంభంపాటి ప్రకాష్, కట్ట నరసింహారావు, బాబుగౌడ్, ప్రవీణ్, రాంబాబు, లక్ష్మి, జగతి, కే మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు మెరుగుపరచాలి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారురు. వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈసందర్భంగా హోమియో డాక్టర్ అందుబాటులో లేరని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆ ఖాళీ పోస్టును త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాము, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరచాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం




**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయటంతో పాటు విపరీతంగా పెంచిన గ్యాసు ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సిపిఐ పాల్వంచ పట్టణ, మండల సమితుల ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం పెట్రోల్, డీజిల్, గ్యాసు కొరతను నివారించాలని పార్టీ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్ నుండి ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొన్నారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్య ప్రజలపై విపరీతంగా ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇందన ధరలను నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. దీనితో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజల బతుకు భారంగా మారుతోందని వాపోయారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పాలన చేస్తూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ ఒక్కరు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు 44వ, డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, జకరయ్య, గొర్లె నరేష్, పునుకుల సర్పంచ్ వజ్జా క్రిష్ణవేణి, నాగారం కాలని సర్పంచ్ తేజావత్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకార ఖర్చు పార్టీదే

## విజయ్ సంచలన నిర్ణయం



**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయకముందే టివికె అధినేత విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా సిఎంల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అయ్యే ఖర్చు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచే వస్తుంది. కానీ ఈసారి ప్రభుత్వ ఖజానాకు గండి పడకుండా... మొత్తం ఖర్చు పార్టీ నిధుల నుంచే భరించాలని విజయ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దేశంలోనే ఈ తరహా నిర్ణయం ఇదే తొలిసారి. విజయ్ త్వరలో తమిళనాడు సిఎంగా ప్రమాణం చేసే అవకాశం కనిపిస్తోంది. ఐదు వేల మంది హాజరయ్యేలా నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు చేయాలని టివికె భావిస్తోంది. ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ప్రభుత్వం కాకుండా టీవీకే పార్టీ స్వయంగా నిర్వహిస్తోందని లోక్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి. సిఎం ప్రమాణ స్వీకార వేడుక ఓ ప్రజాస్వామ్య కార్యక్రమం.

కొత్తగా ఎన్నికైన ముఖ్యమంత్రి ప్రజల ముందు రాజ్యాంగానికి విధేయతగా ప్రమాణం చేస్తారు. గవర్నర్ సమక్షంలో ఈ వేడుక జరగుతుంది. కాబట్టి పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్మునే ఖర్చు చేస్తారు. సాధారణ పరిపాలన శాఖ ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుంది. టెంట్‌లు, వేదిక, సౌండ్ సిస్టమ్, లైటింగ్, అతిథుల స్వాగతం వంటి అన్ని అంశాలకు ఖర్చు లెక్కలు ఈ శాఖే చూసుకుంటుంది. సాదాసీదా ప్రమాణ స్వీకారం లోక్‌భవన్‌లో జరిగితే ఖర్చు తక్కువగా ఉంటుంది. కానీ భారీ సభలు స్టేడియం లేదంటే పెద్ద మైదానంలో నిర్వహిస్తే ఖర్చు కోట్లలోకి వెళుతుంది. భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం కల్పిస్తే ఖర్చు మరింత పెరుగుతుంది. వీటికి తోడు.. ఈ కార్యక్రమంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కీలకం. వేలాది పోలీసు సిబ్బంది, ఇతర దళాలు నియమించబడతాయి.

వాళ్ల ప్రయాణం, భోజనం, లాజిస్టిక్స్ అన్నీ ప్రభుత్వ నిధుల నుంచే వస్తాయి. గవర్నర్, ప్రధాని, ఇతర రాష్ట్రాల సిఎంలు, ప్రముఖులు... ముఖ్య అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే ఆ ఖర్చు మరింత పెరిగిపోతుంది. అధికారిక ప్రభుత్వ కార్యక్రమం కావడంతో... ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ప్రజల పన్నుల ద్వారా సమకూరిన నిధులు ఈ వేడుకకు వినియోగించబడతాయి. అయితే విజయ్ మాత్రం ప్రభుత్వ ఖర్చు లేకుండా... టివికె పార్టీ నిధులతోనే ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు గవర్నర్ కూడా అంగీకరించినట్లు లోక్‌భవన్ వర్గాలు చెబుతున్నాయి

# మీకు 'మ్యాజిక్ ఫిగర్' ఏదీ?

టివికె చీఫ్ విజయ్ చూపిన సంఖ్యాబలంపై
గవర్నర్ అసంతృప్తి
సరిపోను సంఖ్యాబలం ఉన్నప్పుడే కలవండని
ఆయనకు హితబోధ

**చెన్నై :** ఇటీవల జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి పదవి ఎవరికి దక్కుతుందనే విషయంలో ఇంకా సందిగ్ధం నెలకొంటోంది. గవర్నర్ ఆహ్వానం మేరకు తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పిలవాలని తమిళగ వెట్రిగ కళగం (టివికె) అధినేత విజయ్ బుధవారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నదని, ఆ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతినివ్వాలంటూ గవర్నర్‌ను విజయ్ అభ్యర్థించారు. కాగా విజయ్ చూపించిన సంఖ్యాబలానికి గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయకపోవడంతో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకునే విషయంలో చిక్కుముడిపడింది. టివికెకు తగినంత సంఖ్యాబలం లేదని గవర్నర్ ఆర్లేకర్ చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై విజయ్, గవర్నర్ ఇరువురి మధ్య చాలాసేపు చర్చ జరిగిందని, టివికె పార్టీకి మ్యాజిక్ ఫిగర్ 118 సంఖ్యాబలం సమకూరినప్పుడే తనను కలిసేందుకు రావాలని గవర్నర్ టివికె అధినేత విజయ్‌కు సూచించినట్లు సమాచారం. తమిళనాడు శాసనసభలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 234 ఉన్నాయి. అయితే టివికె పార్టీ కేవలం 108 స్థానాలను మాత్రమే దక్కించుకుంది. టివికె అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించినప్పటికీ విజయ్ గెలిచిన రెండు స్థానాలలో ఒకటి వదులుకుంటే కాంగ్రెస్ గెలుచుకున్న 5 సీట్లను కలిపితే టివికె పార్టీ సంఖ్యాబలం 112 అవుతుంది. ఈ నేపథ్యంలో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఇంకా ఆరుగురు సభ్యుల అవసరం ఉంది. విజయ్ టివికె పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), వామపక్షాలైన సిపిఐ, సిపిఐ(ఎం)లు ఇంకా నిర్ణయం తీసుకోలేదు, ఐయుఎంఎల్‌కి ఇద్దరు, సిపిఐకి ఇద్దరు, సిపిఐ(ఎం)కి ఇద్దరు ఎన్నికైన శాసనసభ్యులు ఉన్నారు. వామపక్షాలైన సిపిఐ, సిపిఐ(ఎం)లు డిఎంకె కూటమికి చెందినవారు. ఐయుఎంఎల్ సహా సిపిఐ, సిపిఐ(ఎం) సంఖ్యాబలం ఆరుకాగా వీరి నుంచి విజయ్‌కు ఇంకా మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. డిఎంకె కూటమికి చెందిన విసికె పార్టీకి కూడా 2స్థానాలు ఉన్నప్పటికీ ఆ పార్టీ నుంచి కూడా ఇంకా స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే అన్నాడిఎంకె సభ్యులు కొందరు విజయ్‌తో జత కట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నప్పటికీ ఆ విషయంపై కూడా ఇంకా సందిగ్ధత వీడలేదు. ఈలోగా గవర్నర్ ఆహ్వానం అందిందన్న హడావుడిలో తనకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నదని విజయ్ గవర్నర్ ఆర్లేకర్‌ను కలవడం, ఆయన మ్యాజిక్ ఫిగర్ ఏది? అని ప్రశ్నించడం విజయ్ రాజకీయ పరిణతిని ప్రశ్నిస్తోంది. మరో వైపు ప్రభుత్వ ఏర్పాటు మద్దతు కోసం విజయ్ అన్నాడిఎంకె చీఫ్ పళనిస్వామి ఇంటికి వెళ్లి చర్చిస్తున్నారని వచ్చిన వార్తలను టివికె ఖండించింది, ఏకకాలంలో అన్నాడిఎంకె, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలతో చర్చలు జరుపుతున్నారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టివికె కొట్టిపారేసింది.



# సిపిఐ మద్దతు కోరిన విజయ్

**చెన్నై:** తమిళగా వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు సి.జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించారు. 108 స్థానాల్లో గెలిచారు. దీంతో టీవీకే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పూర్తి మెజారిటీ రానందున కాంగ్రెస్ సహా వామపక్షాల మద్దతు కోరింది. విజయ్ తమ మద్దతు కోరినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్ వెల్లడించారు. మంగళవారం రాత్రి విజయ్ నుంచి తమకు లేఖ అందిందని ఆయన బుధవారం విలేకరులతో చెప్పారు. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు పార్టీ కార్యవర్గ కమిటీ శుక్రవారం భేటీ కానున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆ తదుపరి రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి, టివికె విజ్ఞప్తిపై నిర్ణయిస్తామని వీరపాండియన్ వెల్లడించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం చెరో రెండు స్థానాలలో గెలిచాయి. కాంగ్రెస్ ఐదు సీట్లు పొందింది. విజయ్... పెరంబూర్, తిరుచీ ఈస్ట్ నుంచి ఎన్నికయ్యారు.

ఆయన ఏదో ఒక స్థానాన్ని వదులుకోక తప్పదు. అంటే ఆ పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్య 107కు తగ్గుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మెజారిటీ కావాలి. 117 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి. దీనిని బట్టి విజయ్ పార్టీకి మరో 10 మంది అవసరం ఉంది. ఇదే క్రమంలో కాంగ్రెస్‌తో పాటు సిపిఐ, సిపిఎం మద్దతు తీసుకోవాలని ఆయన భావించారు. విజయ్‌కు మద్దతివ్వాలని కాంగ్రెస్ అంతర్గతంగా నిర్ణయించుకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకుగాను డీఎంకే, ఎఐఎడిఎంకె మిత్రపక్షాను టివికె ఆశ్రయిస్తోంది. అన్నివిధాలా మద్దతు కూడకట్టుకునేందుకు ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోవడంలేదు.

# రాష్ట్ర రాజకీయానికి పెద్ద ముప్పు

3 స్థానాల్లో బిజెపి గెలుపుపై
బినోయ్ విశ్వం



**తిరువనంతపురం:** కేరళ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. మలయాళీ రాష్ట్రంలో బిజెపి మూడు స్థానాలను గెలుచుకుంది. ఈ పరిణామంతో రాష్ట్ర రాజకీయం పెద్ద ప్రమాదంలో పడినట్లు అయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్‌విశ్వం బుధవారం తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. దీనిని లౌకిక పార్టీ తీవ్రంగా పరిగణించడం అవసరమన్నారు. 'బిజెపి మూడు స్థానాల్లో విజయం సాధించింది, మరో ఆరు చోట్ల రెండవ స్థానంలో నిలిచింది. ఇది ఎంత మాత్రం తేలికగా తీసుకునే విషయం కాదు. లౌకిక పార్టీలు దీనిపై దృష్టి పెట్టాలి. తీవ్రమైన అతివాదం రాజకీయంగా పట్టు సాధిస్తే దాని ప్రభావం కేరళలోనే కాదు మొత్తం దేశంలో కనిపించింది' అని బినోయ్‌విశ్వం అన్నారు. ఈ పరిణామాలపై వామపక్షాలు, లౌకిక శక్తులన్నీ నిశితంగా అధ్యయనం చేయాలి. ఈ ముప్పును తప్పించేందుకు కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. ఎల్‌డిఎఫ్ ఓటమికి గల కారణాలను అధ్యయనం చేయాలని సూచించారు. వామపక్ష సంఘటనకు సంబంధించిన ఓట్లు యుడిఎఫ్‌కు మళ్లాయని, ఇది ఎలా సాధ్యమైనదో అన్వేషించాలన్నారు. ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకునేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి సమావేశాలు జరుగుతాయని, అవసరమైన మార్పులుదిద్దుబాట్లు ఉంటాయని కూడా ఆయన చెప్పారు. 'లోపాలను నిశితంగా అధ్యయనం చేస్తాం. వైఫల్యాలకు కారణాలను అన్వేషిస్తాం. అవసరమైన మార్పులు, చేర్పులు, దిద్దుబాట్లు చేసుకుంటాం' అని బినోయ్‌విశ్వం వెల్లడించారు. మొత్తం 140 స్థానాల ఫలితాలను అధ్యయనం చేస్తామన్నారు. ఓడిపోయినంత మాత్రానా రాష్ట్ర రాజకీయాల నుంచి ఎల్‌డిఎఫ్‌గానీ సిపిఐగానీ తప్పుకోబోవని, ఎల్లప్పుడు శ్రామిక వర్గం వెన్నంటే ఉంటాయని బినోయ్‌విశ్వం వెల్లడించారు. కేరళ అసెంబ్లీలో 102 స్థానాలను యూడీఎఫ్ గెలుచుకోగా, ఎల్‌డిఎఫ్ 35 స్థానాలకు పరిమితమైంది. మూడు స్థానాల్లో కమలం వికసించింది.

# బిజెపి విజయాల వెనుక 'ఓటు చోరీ'

రాహుల్ గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం బిజెపిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ పార్టీకి చెందిన లోక్‌సభ ఎంపిలలో గణనీయమైన సంఖ్యలో 'ఓటు దొంగతనం' ద్వారా సీట్లు గెలుచుకున్నారని ఆరోపిస్తూ, వారి తీర్పుకు చెందిన చట్టబద్ధతను ఆయన ప్రశ్నించారు. ప్రతి 'ఆరో బిజెపి ఎంపి' ఎన్నికల అవకతవకల ద్వారానే విజయం సాధించారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. అటువంటి నాయకులను బిజెపి సొంత పరిభాషను ఉపయోగించి పిలవాలా వద్దా అనే విషయంపై ఆయన ప్రశ్నను లేవనెత్తారు. 'ఓట్ల దొంగతనం ద్వారా కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లను దొంగిలిస్తే, మరికొన్నిసార్లు ఏకంగా ప్రభుత్వాన్నే దొంగిలిస్తారు. లోక్‌సభలోని 240 మంది బిజెపి ఎంపిలలో దాదాపు ప్రతి ఆరో ఎంపి ఓట్ల దొంగతనం ద్వారానే సీటు దక్కించుకున్నారు' అని రాహుల్ 'ఎక్స్'లో హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. తన విమర్శలను మరింత తీవ్రతరం చేస్తూ, 'వారిని గుర్తించడం కష్టమేమీ కాదు. వారి సొంత భాషలోనే మనం వారిని 'ఘుస్‌పేఠియా' (చొరబాటుదారులు) అని పిలవాలా? మరి హర్యానా సంగతేంటి? అక్కడ ఏకంగా ప్రభుత్వమే ఒక 'చొరబాటుదారు'. వారు తమ గుప్పిట్లో పెట్టుకున్న సంస్థలే... ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమకు అనుకూలంగా మలచుకునేవే. వాస్తవానికి స్వయంగా 'రిమోట్ కంట్రోల్' ద్వారా నడపబడుతున్నాయి. నిజాయితీగా ఎన్నికలు జరిగితే బిజెపి ఎన్నికల బలం గణనీయంగా బలహీనపడుతుందని ఆయన ఇంకా నొక్కి చెప్పారు. 'వారి అసలు భయం సత్యమే. ఎందుకంటే నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే వారు ఈ రోజు 140 సీట్లు కూడా గెలుచుకోలేరు' అని ఆయన అన్నారు. కాగా రాహుల్ గాంధీ మంగళవారం పశ్చిమ బెంగాల్, అసోంలో బిజెపి సాధించిన ఇటీవలి ఎన్నికల విజయాలను విమర్శించారు. వాటిని ప్రజా తీర్పును 'దొంగిలించడం' గా అభివర్ణిస్తూ, ప్రజాస్వామ్యంపై దీని విస్తత పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. 'కాంగ్రెస్‌లోని కొందరు, ఇంకా ఇతరులు టిఎంసి ఓటమిపై సంబరపడుతున్నారు. వారు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనే తన లక్ష్యంలో భాగంగా అసోం, బెంగాల్ తీర్పును దొంగిలించడం బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగు' అని ఆయన 'ఎక్స్' లో మరో పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పంజాబ్‌లో జంట పేలుళ్లు



**అమృత్‌సర్ :** వరుస పేలుళ్లతో పంజాబ్ దద్దరిల్లింది. రెండు గంటల్లో రెండు చోట్ల పేలుళ్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ రెండు ఘటనలు ఆర్మీ నిట్‌లకు సమీపంలోనే జరగడం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జలంధర్‌లోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌పీ) ప్రధాన కార్యాలయం సమీపంలో పేలుడు చోటుచేసుకుంది. కార్యాలయం బయట పార్క్ చేసి ఉన్న ఒక స్కూటర్ పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలం సమీపంలో ఉన్న కొన్ని వాహనాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. కిలోమీటరు వరకు పేలుడు శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. ఈ పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత... అమత్‌సర్‌లో మరో పేలుడు చోటుచేసుకుంది. అటారీ రోడ్డులోని ఆర్మీ ఖాసా కంటోన్మెంట్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రదేశంలో రేకును పోలిన శకలాలు దొరికాయని, దీంతో ఎవరో పేలుడు పదార్థం విసరడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, దాడి చేసి, ఆ తర్వాత పారిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. కాగా, జలంధర్‌లో చోటుచేసుకున్న ఈఐడీ పేలుడు తమ పనేనని ఖాలిస్థానీ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. ఫిబ్రవరిలో గురుదాస్‌పూర్ జిల్లాలో పంజాబ్ పోలీసుల చేతిలో హతమైన ఉగ్రవాది రంజిత్ సింగ్ మతికి ప్రతీకారంగానే ఈ పేలుడు జరిపినట్లు ఓ ప్రకటనలో కేఎల్‌ఏ పేర్కొంది. ఈ పేలుడులో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు మరణించగా... మరో ముగ్గురు గాయపడ్డారని తెలిపింది. అయితే, మరణ వార్తలను పోలీసు అధికారులు ఖండించారు.

# అన్నాడిఎంకెలో ముసలం

విజయ్‌కు మద్దతివ్వాలని
ఓ వర్గం ఒత్తిడి

**చెన్నై :** ప్రస్తుతం తమిళనాడు రాజకీయాలపైనే దేశం దృష్టి నిలిచింది. అందుకుతగ్గట్టే అక్కడి పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మెజార్టీ మార్క్‌కు 10 అడుగుల దూరంలో ఉన్న టివికెకు ఎవరి నుంచి మద్దతు లభిస్తుందనేది ఆసక్తిగా మారింది. అయితే, అన్నాడీఎంకేలో ముసలం ఏర్పడింది. పార్టీలోని ఓ వర్గం టివికెకు మద్దతివ్వాలని పట్టుబడుతుండగా... మరో వర్గం వద్దని వాదిస్తోంది. అన్నాడిఎంకెకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలిచేందుకు సిద్ధపడుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదేసమయంలో అన్నాడిఎంకె నేత, మాజీ సిఎం పళనిస్వామితో టీవీకే నేత ఒకరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. టివికె అధినేత విజయ్ దెబ్బకు అన్నాడిఎంకెలో ముసలం పుట్టినట్లు తెలుస్తోంది. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు అన్నాడిఎంకె నేత, రాజ్యసభ ఎంపి షణ్ముగం కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. చెన్నైలో జరిగిన ఈ సమావేశంలో భాగంగా టివికెతో పొత్తు గురించి ఆలోచించమని ఎడప్పాడి కె.పళనిస్వామిని వారు కోరినట్లు తెలుస్తోంది. ఈ భేటీ జరిగిన కాసేపటికే టివికె నేత ఆనంద్... పళనిస్వామిని కలవడం గమనార్హం. విజయ్‌కు మద్దతు ఇవ్వడంపై అడిగిన ప్రశ్నకు ఎఐఎడిఎంకె అధికార ప్రతినిధి కొవై సత్యన్ స్పందిస్తూ... 'బంతి విజయ్ కోర్టులోనే ఉంది' అని బదులిచ్చారు. తమిళనాడులో అసెంబ్లీ స్థానాల సంఖ్య 234 కాగా... 108 చోట్ల గెలిచి టివికె అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్య 118. అటు కాంగ్రెస్‌కు ఐదు స్థానాలు రాగా... ఏఐఏడీఎంకెకు 47 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చినా టివికె ప్రభుత్వ ఏర్పాటుకు ఆ బలం సరిపోదు. ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడిఎంకె ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలాఉంటే... ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ విజయ్... విసికె అధ్యక్షుడికి లేఖ రాశారు.

# ఎవరి ఇష్టం వారిది

టివికెతో కాంగ్రెస్ పొత్తుపై కనిమొళి



**చెన్నై :** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొత్త పొత్తులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ సారథ్యంలో టివికె తాజాగా ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతుండటంతో ఆ పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఎన్నికలకు ముందు డీఎంకేతో పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసి ఐదు స్థానాల్లో గెలిచింది. ఎన్నికల అనంతరం టివికెతో జత కట్టింది. తాజా పరిణామాలపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. తమ భాగస్వామ్య పార్టీలకు ఎవరితో కలిసి వెళ్లాలో నిర్ణయించుకునే హక్కు ఉందని అన్నారు. 'మేము (కాంగ్రెస్ డిఎంకె) చాలా ఎన్నికలు కలిసి పనిచేశాం. ఇవాళ కూడా ఎన్నికల్లో కలిసి పోటీ చేసి ఓటమి చవిచూశాం. ప్రతి పార్టీ తమకు ఏదైతే సరైనదని అనిపిస్తుందో అది చేసే హక్కు ఉంటుంది. ఇతరుల గురించి నేను చెప్పేదేమీ లేదు. మేము మాత్రం మా పోరాటం కొనసాగిస్తాం' అని మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కనిమొళి తెలిపారు. భాగస్వాములు ఎప్పుడూ కలిసి ఉండేందుకు డిఎంకె అధినేత స్టాలిన్ ప్రాధాన్యం ఇస్తుంటారని కనిమొళి చెప్పారు. తమది సైద్ధాంతిక కూటమి అని చెప్పారు. టివికె సెక్యులర్ పార్టీగా చెప్పుకోవడంపై అడిగినప్పుడు తమిళనాడు రాజకీయాల్లో మరో సెక్యులర్ పార్టీ వస్తే తమకు ఎలాంటి భయం లేదన్నారు. డిఎంకె ఓటమిపై మాట్లాడుతూ ఫలితాలపై తప్పనిసరిగా డీఎంకే విశ్లేషించుకుంటుందని అన్నారు. ఓటమికి కారణాలు ఇప్పుడే చెప్పలేమని, అయితే వీటిపై విశ్లేషణ చేసుకోవడం చాలా కీలకమని అన్నారు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని, విజయ్‌కు తమ అభినందనలని చెప్పారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అలాంటి ప్రభుత్వాన్ని టివికె అందిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. డీఎంకే చాలా ఎన్నికలు చూసిందని, ఎన్నో విజయాలు, మరెన్నో పరాజయాలు చూసిందని, ముందుకు ఎలా వెళ్లాలనేది పార్టీకి బాగా తెలుసునని చెప్పారు.

# హిమంత బిశ్వ శర్మ రాజీనామా



**దిస్‌పూర్ :** అసోం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ... తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్‌భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త సీఎంని ఎంపిక చేస్తారని శర్మ తెలిపారు.

# రేపు బిజెపి శాసనసభాపక్షం భేటీ

సువేందు అధికారి వైపే మొగ్గు

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అందరికన్నా ముందు వరసలో సువేందు అధికారి పేరు వినిస్తోంది. 2021, 2026లో వరసగా మమతా బెనర్జీని ఓడించి ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపుగా సువేందు అధికారే సీఎం అవుతారనేది బలంగా వినిపిస్తున్న వాదన. కాగా, ముఖ్యమంత్రి ఎన్నిక, ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియపై చర్చించేందుకు శుక్రవారం కోల్‌కతాలో బీజేపీ శాసనసభ పక్ష సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలోనే సువేందు అధికారిని తమ నాయకుడిగా ఎన్నుకుంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

# యూపీలో కామాంధుడి ఎన్‌కౌంటర్

**లక్నో :** ఓ కామాంధుడిని ఉత్తర ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. మెహనూర్ ఏకంగా పోలీసులపై కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్‌ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా... మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్‌పీ అశోక్ కుమార్ తెలిపారు. అతని మతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు.

# ప్రజాప్రతినిధుల పేర్ల ముందు గౌరవ పదాలు తప్పనిసరి

అలహాబాద్ హైకోర్టు

**న్యూఢిల్లీ :** ఎంపీలు, కేంద్ర మాజీ మంత్రుల పేర్ల ముందు గౌరవప్రదమైన పదాలను తప్పనిసరిగా చేర్చాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేవలం సంబోధనల్లోనే కాకుండా ఎఫ్‌ఐఆర్‌లలో 'గౌరవనీయులైన' అనే పదాన్ని వాడాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధుల పేర్ల ముందు తగిన గౌరవ సూచక పదాలు లేకుండా ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేయడంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులపై కనీస గౌరవం, మర్యాద పాటించడం అవసరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. చట్టసభల సభ్యులు, మాజీ మంత్రుల విషయంలో ఈ నిబంధనను కచ్చితంగా పాటించాలని అధికారులకు న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. కేంద్ర మాజీ మంత్రులు, ఎంపీలకు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

# 'సుప్రీం' సుమోటోగా స్వీకరించాలి

బెంగాల్ ఎన్నికల ప్రక్రియపై
అఖిలేశ్ డిమాండ్

**లక్నో :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించాలని, ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగ్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బుధవారం డిమాండ్ చేశారు. 'కోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం అవుతున్నప్పుడు ఓట్ల లెక్కింపు ఎందుకు ప్రత్యక్ష ప్రసారం కాదు?' అని ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రశ్నించారు. 'సీసీటీవీ ఎందుకు ప్రత్యక్ష ప్రసారం కావడం లేదు? దానికి ఎందుకంత భయపడుతున్నారు? పశ్చిమ బెంగాల్ ఎన్నికలను సుప్రీం కోర్టు తక్షణమే సుమోటోగా స్వీకరించి, లెక్కింపు వీడియోను దేశ ప్రజల ముందు ఉంచాలన్నదే మా డిమాండ్' అని అన్నారు. ఆరోపించబడిన అవకతవకలను ప్రస్తావిస్తూ, ఇటీవలి సంవత్సరాలలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన కొన్ని ఎన్నికలు, ఉప ఎన్నికలను ఉదాహరణగా చూపారు. లెక్కింపు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని అఖిలేశ్ ఆరోపించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తర ప్రదేశ్‌లో పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలు మరింత పెద్ద ఎత్తున పునరావతం కావచ్చని యూపీ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'బెంగాల్‌లో ఏమి జరిగిందో, దానిని వారు ఉత్తర ప్రదేశ్‌లో మరింత పెద్ద ఎత్తున చేస్తారు. బహుళ అంచెల ఎన్నికల మాఫియా కలిసికట్టుగా పని చేస్తుంది, మరింత పరిశోధన చేసి ఉత్తర ప్రదేశ్‌లో (2027 ఎన్నికలలో) కార్యకలాపాలు నిర్వహిస్తుంది' అని ఆయన ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్‌లో వీరు ఏమి చేశారో, ఎన్నికలను ప్రభావితం చేసి వాతావరణాన్ని మార్చిన తీరు ఇప్పుడు బయటపడింది' అని అన్నారు. మమతా బెనర్జీ నేతత్వంలోని తణవల్ కాంగ్రెస్‌ను ఓడించి పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ భారీ మెజారిటీ సాధించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఐసిస్ జీవ ఉగ్రవాద కుట్ర

డాక్టర్, మరో ఇద్దరిపై ఎన్ఐఎ ఛార్జిషీట్

**న్యూఢిల్లీ :** ప్రజా ప్రదేశాలలో అత్యంత విషపూరితమైన జీవ కారకాన్ని ఉపయోగించి సావహిక విషప్రయోగం జరిపేందుకు ఐసిస్ సంబంధిత కుట్రలో పాల్గొన్నారనే ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తో సహా ముగ్గురిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ఛార్జిషీట్ దాఖలు చేసింది. మంగళవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం నిందితులు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌తో పాటు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆజాద్, మహమ్మద్ సుహెల్‌పై గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ ముగ్గురూ ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధం ఉన్న విదేశీ హ్యాండ్లర్ల మార్గదర్శకత్వంలో పని చేస్తున్నారని, బలహీనమైన, తీవ్రవాద భావజాలం వైపు మొగ్గుచూపే యువతను నియమించుకోవడానికి సమన్వయంతో పని చేశారని ఎన్ఐఏ తెలిపింది. నిషేధిత ఆయుధాలు, జీవ ఉగ్రవాద పద్ధతులను ఉపయోగించి జిహాద్‌కు మద్దతు ఇవ్వడం, భయోత్పాతం సష్టించడం వారి లక్ష్యం.

'ఐసిస్ దుష్ట అజెండాను అమలు చేయడానికి ఆముదం గింజల నుంచి లభించే రసాయన ఆయుధాల ఒప్పందానికి చెందిన షెడ్యూల్ కింద వర్గీకరించబడిన అత్యంత విషపూరితమైన పదార్థమైన 'రైసిన్'ను ఉపయోగించాలని నిందితులు కుట్రకు ప్రణాళిక చేశారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

## వివాద పరిష్కారానికి నేడు పోప్‌తో రుబియో భేటీ



**వాటికన్‌సిటీ:** ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పోప్ లియో మధ్య తలెత్తిన వివాద పరిష్కారానికి అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో ఏడో తేదీ గురువారం వాటికన్ సిటీలో ఆ సర్వోన్నత మతగురువుతో భేటీ కానున్నారు. ఐతే తాజాగా తలెత్తిన సమస్యలతో ఈ భేటీని ముడిపెట్టేందుకు పోప్ లియో సుముఖంగా లేరు. నియమావళి ప్రకారం పోప్‌తో రుబియో సంభాషణల తర్వాత విదేశీమంత్రిత్వశాఖ కార్యాలయంలో కూడా సంభాషణలు జరుగుతాయి. ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు, నిష్కపటంగా ఉండేందుకు, ఈ చర్చలు దోహదం చేస్తాయని పోప్ ఆశించారు. పోప్ లియో–14 క్యాథలిక్కుల ప్రాణాలను అపాయంలో పడేస్తున్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటాన్ని ఆయన సమర్థిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు. అధికారం ఉన్నవారు యుద్ధాన్ని కాకుండా శాంతిని ఎంచుకోవాలని ట్రంప్‌పై పోప్ అంతకుముందు పరోక్ష విమర్శలు చేశారు. ఇరాన్‌లో యుద్ధంపై పోప్ పదే పదే ప్రకటనలు చేస్తూ అమెరికా హింసను ఖండించారు. ఇటీవలివారాల్లో పోప్‌లియో చాలా బలంగా యుద్ధ వ్యతిరేక ప్రసంగాలు చేశారు. పశ్చిమాసియాలో అమెరికా దాడులను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో పోప్ లియోపై ట్రంప్ తీవ్రం విమర్శలు గుప్పించారు. తాను అధ్యక్ష పదవిలో ఉన్నాను గనుకనే ఒక అమెరికన్ పౌరుడు వాటికన్‌సిటీలో పోప్‌స్థానంలో ఉన్నారని, లేకపోతే ఆయన పోప్ బాధ్యతలలో ఉండేవారే కాదని ట్రంప్ విమర్శించారు. ట్రంప్ తనను తాను జీసస్‌గా కృత్రిమ మేధ ద్వారా చిత్రీకరించుకున్న చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి ప్రపంచవ్యాప్తంగా అపఖ్యాతిపాలయ్యారు. ఆ తర్వాత ఆ చిత్రాలను సోషల్ మీడియా నుండి తొలగించారు. ఈ చిత్రాల్లో ట్రంప్ దేవదూత దుస్తుల్లో ఒక రోగికి చికిత్స చేస్తున్నట్లుగా ఉంది.

# త్వరగా యుద్ధం ముగించి జలసంధి తెరవాలి

### అబ్బాస్‌తో సమావేశంలో చైనామంత్రి విజ్ఞప్తి

**బీజింగ్:** ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి చైనా పర్యటనకు వెళ్ళారు. అక్కడి మంత్రులతో సంభాషణలు జరిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటనకు వారం రోజుల ముందుగా (మే14, 15) ఇరాన్ మంత్రి చైనా పర్యటనతో ఈ ఘటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్ మంత్రి చైనా పర్యటన ఇదే మొదటిసారి. చైనా రాజధాని బీజింగ్‌లో ఆ దేశ విదేశీమంత్రి వాంగ్ యీతో అబ్బాస్ అరాఘ్చి బృందం సమావేశం నిర్వహించింది. ఇరాన్‌కు చైనా ఎంతో సన్నిహిత మిత్రదేశమని అబ్బాస్ అరాఘ్చి ఈ సందర్భంగా అన్నారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సహకార బంధం ప్రస్తుత తరుణంలో మరింత బలపడాలని కోరుకుంటున్నామన్నారు. అమెరికాతో సమగ్రమైన, న్యాయబద్ధమైన ఒప్పందాన్ని ఇరాన్ కోరుకుంటోందని ఆయన చెప్పారు. అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు



కొనసాగుతున్న సమయంలో ఈ సమావేశం జరిగింది. ఉద్రిక్తతలకు స్వస్తి చెప్పాలని, నౌకల రాకపోకలకోసం జలసంధిని తెరవాలని ఈ సందర్భంగా వాంగ్ యీ ఇరాన్–అమెరికాలకు విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా యుద్ధం ముగించాలని, తిరిగి శత్రుత్వాలను,యుద్ధాన్ని ప్రారంభించడం ఎంతమాత్రం క్షంతవ్యంకాదని అన్నారు. యుద్ధం మొదలైన తర్వాత అబ్బాస్ అరాఘ్చి చైనా మంత్రి వాంగ్ యీతో దాదాపు మూడుసార్లు టెలిఫోన్ సంభాషణలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులను చుట్టుముట్టిన అమెరికా కొత్త హెచ్చరిక చేసిన తరుణంలో ఆయన పర్యటన జరుగుతోంది. ఇరాన్‌లో యుద్ధం ముగిసిందని, తాము సాధించాల్సిన లక్ష్యాలు పూర్తయ్యాయని అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు పురోగతిలో ఉన్నాయని కూడా అమెరికా యంత్రాంగం ప్రకటించింది. ఇక ఇటీవలికాలంలో అబ్బాస్ అరాఘ్చి రష్యాలో పర్యటించి అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం జరిపారు. అంతకుముందు ఒమన్ రాజుతో కూడా హోర్ముజ్ నిర్వహణపై ఆయన సంప్రదింపులు చేశారు. ఇరాన్ ఇంధన అవసరాలకోసం శాంతియుత పౌర ప్రయోజనాలకోసం అణు కార్యక్రమం చేపట్టడాన్ని ఈ సందర్భంగా చైనా పూర్తిగా సమర్థించింది. శాంతియుత ప్రయోజనాలకోసమే యురేనియంను ఉపయోగించుకుంటామని ఇరాన్ పునరుద్ఘాటించింది.

# గాజాలో 262 మంది జర్నలిస్టులు మృతి

### 420 మందికి గాయాలు : ముగ్గురు గల్లంతు
### అంతర్జాతీయస్థాయి రక్షణ చర్యలకు విజ్ఞప్తి

**గాజా:** గాజాలో యుద్ధం మొదలైనప్పటినుండీ ఇప్పటి వరకూ 262 మంది జర్నలిస్టులు మరణించారు. ప్రతి సంవత్సరం మే మూడో తేదీన ప్రపంచ పత్రికాదినోత్సవం సందర్భంగా పాలస్తినా ప్రభుత్వ మీడియా కేంద్రం ఈ ప్రకటన చేసింది.పాలస్తినా మీడియా 'అరబ్–48' చెప్పిన సమాచారం ప్రకారం, 2023 అక్టోబరు ఏడో తేదీన యుద్ధం మొదలైనప్పటినుండీ 262 మంది పాత్రికేయులు మరణించడంతోపాటు మరో 420 మంది పాత్రికేయులు తీవ్రంగా గాయపడ్డారని, ముగ్గురు పాత్రికేయుల ఆచూకీ ఇప్పటివరకూ తెలియలేదని తెలిపింది.



మునుపు ఎన్నడూలేనంత విపత్కర పరిస్థితుల్లో గాజా పాత్రికేయులు దినదిన గండంగా వృత్తి జీవితాలు గడుపుతున్నారని తెలిపింది. మరణం,ప్రత్యక్ష లక్ష్యం ఈ రెండే మీడియాకు ప్రధానాంశాలుగా మారాయని తెలిపింది. ఈ రెండూ వారికి ప్రమాదంతో కూడిన కర్తవ్యాలుగా మారాయని ప్రకటించింది. చాలామంది గాయపడిన పాత్రికేయులకు అవయవాలు కూడా తొలగించారని, దాదాపు 50 మంది పాత్రికేయులను అరెస్టు చేశారని, వారు అత్యంత కఠిన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపింది. ఈ చర్యలన్నీ మానవతా చట్టాల ఉల్లంఘనే కాకుండా అంతర్జాతీయ నేరాలకిందకు వస్తాయని పేర్కొంది. పాలస్తినా పాత్రికేయులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేసి, వారికి రక్షణ ఇవ్వడానికి అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘాలకు,అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయెల్ చర్యలపట్ల మౌనం వహిస్తే, అంతర్జాతీయ న్యాయం,చట్టం బలహీనపడుతుందని హెచ్చరించింది.

## ఉక్రేన్ నగరాలపై రష్యాదాడులు

### 28 మంది మృతి



**కీవ్:** రాత్రికిరాత్రే ఉక్రేన్‌వ్యాప్తంగా అనేక నగరాలపై రష్యా డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 28 మంది తమ దేశ పౌరులు మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. దాదాపు 100కు పైగా డ్రోన్లను రష్యా ప్రయోగించిందని చెప్పారు. ఇటీవలిరోజుల్లో రష్యా లోలో తుల్లోకి చొచ్చుకువెళ్ళి చమురు కేంద్రాలు,విద్యుత్ కేంద్రాలపై బలమైన క్షిపణులతో ఉక్రేన్ దాడులు చేసి తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఈ దాడులతో ఉక్రేన్ ఆయుధశక్తిపరంగా బాగా బలం సంపాదించుకుందన్న వార్తలు వెలువడ్డాయి. కాల్పుల విరమణ పాటించాలని జెలెన్స్కీ ఏకపక్షంగా ఇచ్చిన పిలుపు తర్వాత రాత్రికి రాత్రే రష్యా ఈ దాడులు చేసింది. డోనెట్స్క్, ద్నీప్రో,పోల్టోవా వంటి రద్దీగా ఉండే ప్రాంతాలలో రష్యా బాంబుదాడులకు పాల్పడిందని ఉక్రేన్ ఆరోపించింది. సుమీ, జెపోరిఝియా, ఖార్కివ్ వంటి ప్రాంతాలలో కూడా డ్రోన్ దాడులు జరిగాయని, తాజా దాడులతో రష్యా శాంతిని తిరస్కరించిందని ఉక్రేన్ విదేశీవ్యవహారాలమంత్రి ఆండ్రీ సిబిగా విమర్శించారు. పుతిన్‌కు సైనిక కవాతులే తప్ప మానవ ప్రాణాలంటే విలువ లేదని అన్నారు. మంగళవారం ఉక్రేన్‌లో రష్యా చేసిన దాడులు ఇటీవలి వారాలలో ఎన్నడూ చేయలేదని విమర్శించారు. ఐతే రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవాల సందర్భంగా మే 9,10 తేదీలలో యుద్ధ విరామం ప్రకటిస్తామని ఇంతకుముందు రష్యా ప్రకటించింది. దీనిపై జెలెన్స్కీ విమర్శలు గుప్పించారు. ఈ విజయోత్సవాలకు రెండు రోజులు ముందుగా రష్యా భారీ దాడులు చేపట్టింది. మాస్కోలోని రెడ్‌స్క్వేర్‌లో జరిగిన వార్షిక సైనిక కవాతు కార్యక్రమం సందర్భంగా కాల్పుల విరమణను కోరుకుంటున్నట్లు రష్యా చెప్పడంతో జెలెన్స్కీ కూడా ఒక ప్రకటన చేశారు. ఐతే బుధవారం రాత్రి వరకూ ప్రకటించిన కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే తాము కూడా ప్రతిస్పందిస్తామని జెలెన్స్కీ ముందే ప్రకటించారు. కాగా రష్యా రక్షణమంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, గత రాత్రి దాడుల్లో 52 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది.

## ఆమోదం తెలపండి (మొదటి పేజీ తరువాయి)

చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి సిఎం రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్‌జిఐ ఎయిర్‌పోర్ట్ – భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్3గా చేపట్టాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్3కి సంబంధించిన డిపిఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సిఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణ) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తారని రాంచందర్ రావు తెలిపారు. 2.30 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై పలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం హైటెక్‌సిటీలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. హెలికాప్టర్ ద్వారా మళ్లి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు 4:40 గంటలకు ప్రధాని చేరుకుంటారని, 5:30 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ సభా ప్రాంగణానికి ప్రధాని మోదీ చేరుకుంటారని రాంచందర్ రావు చెప్పారు. సభ పూర్తయిన అనంతరం తిరిగి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి జామ్ నగర్‌కు ప్రధాని వెళ్లుతారని చెప్పారు. అధికారిక కార్యక్రమాలు వేరు, రాజకీయాలు వేరని రాంచందర్ రావు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అధికారిక కార్యక్రమాలలో కూడా ప్రధాని మోదీ పాల్గొంటారని తెలిపారు. మూడవ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా తెలంగాణకు వస్తున్న సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో పార్టీ తరపున నిర్వహించనున్న సభను ప్రతిష్ఠాత్మకంగా భావించి, భారీ ఎత్తున జరిపేందుకు చర్యలు చేపట్టామన్నారు. సుమారు రెండు లక్షలమంది జనసమీకరణ చేయనున్నట్లు రాంచందర్ రావు తెలిపారు. ఇప్పటికే పార్టీ యంత్రాంగానికి ఎవరికి వారికి బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిలు డి.కె. అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, అరవింద్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు, ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగానే ముగ్గురు రైతుల మృతి**

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ముగ్గురు రైతులు దుర్మరణం చెందారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం వ్యక్తం చేసి, మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే బాధ్యత వహించాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధాన్యం కల్లాల వద్ద జరిగిన ఈ విషాదంలో గుండారపు వెంకటేశ్, తనుగుల అభిరాం, లచ్చన్న అనే రైతులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు.

## ఆందోళన చెందొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులే తిప్పి కొడుతారన్నారు. భారతదేశ చరిత్రలోనే వరిసాగు, ఉత్పత్తి, ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రమే మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని తెలిపారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ రబీ సీజన్ లో 67 లక్షల ఎకరాలలో వరి సాగు చేయగా, 141 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందన అంచనా ఉండగా ఉందులో రూ.21 వేల కోట్లు పై చిలుకు విలువ గల 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు సన్నద్ధం చేసిందని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు ప్రభుత్వం 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటికే రైతులకు రూ.2310 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని, అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు గాను 2.63 లక్షల టార్పాలిన్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ ఏడాది రైతుల సమయం వృధా కాకుండా టో0కెన్ విధానాన్ని ప్రవేశపెట్టామని, వాటి ప్రకారం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. అదేవిధంగా 18.75 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఇప్పటికే అందుబాటులో ఉండగా, అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించామని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు గాను 6,200 వాహనాల ఏర్పాటు చేశామని చెప్పారు.

**2023–24 రబీ సీజన్‌తో పోల్చితే రెట్టింపు ధాన్యం కొనుగోలు**

కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత 202324 రబీ సీజన్‌లో 7178 కొనుగోలు కేంద్రాల ద్వారా 7.62లక్షల మంది రైతుల నుండి రూ.10,549 కోట్లు విలువైన 47.97లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అదే 2025–26 ఈ రబీ సీజన్‌లో ఏకంగా రూ.21వేల కోట్లు పై చిలుకు విలువైన 90 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించనున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇది గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో పోల్చితే రెట్టింపు అని మంత్రి వెల్లడించారు.తమ ప్రభుత్వంపై విపక్షాలు బురద జల్లుతూ తప్పుడు సమాచారంతో రైతాంగాన్ని గందరగోళంలోకి నెట్టిందని హితవు పలికారు.

## ప్రజలను రోడ్లపై నిలపొద్దు

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ముఖ్యమంత్రి వాహనాలు వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా ఆపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిజిపికి ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో డిజిపి సివి ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే మాట్లాడాల్సి రావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందని, క్షేత్రస్థాయి అధికారులు దీనిని గంభీరంగా పరిగణించాలని డిజిపి సివి ఆనంద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్ఠం చేసేందుకు అడిషనల్ డిజిపి ఆధ్వర్యంలో త్వరలోనే 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నామని ప్రస్తుతం విధివిధానాలను రూపొందిస్తున్నామని డిజిపి సివి ఆనంద్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ అధికారు లు క్షేత్రస్థాయిలో ఉండి సత్వర నిర్ణయాలు తీసుకోవాలని, సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని డిజిపి సివి ఆనంద్ సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ లేకుండా చూడాలని, ఐఎస్ డబ్ల్యూ, సీఎస్ డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతల విభాగం అధికారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ మే విసి సజ్జనార్, సైబరాబాద్ సిపి ఎం. రమేష్, మల్కాజిగిరి సిపి బి. సుమతి, ఫ్యూచర్ సిటీ జాయింట్ సిపి చందనా దీప్తి, రైల్వేలు, రోడ్డు సేఫ్టీ ఐజిపి రమేష్ నాయుడు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

## 13 ఒప్పందాలపై సంతకాలు

(మొదటి పేజీ తరువాయి)

13 ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. మోదీ టోలామ్‌లు ఇండియా–పసిఫిక్ ప్రాంతంలోని పరిస్థితి, ఆ ప్రాంతంలో చైనా పెరుగుతున్న ఆధిపత్య ధోరణిపై కూడా చర్చించి, కొనసాగించడానికి అంగీకరించారు. చట్టబద్ధమైన పాలన, శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదం చేస్తాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనా తన పెరుగుతున్న సైనికబలాన్ని ప్రదర్శించడం కూడా ఇరుదేశాల మధ్య జరిగిన ప్రతినిధి బృందాల స్థాయి చర్చలలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈనెల ప్రారంభంలో వియత్నాం అధ్యక్షుడుగా ఎన్నికైన టోలాం మూడు రోజులపాటు తన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. మంగళవారం భారతదేశంలో తన మొదటి పర్యటనను ప్రారంభించారు.

ఒక దశాబ్దం క్రితం వియ త్నాం ఏసియన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం)లో భారతదేశానికి మొట్టమొదటి సమగ్ర భాగస్వామిగా అవతరించిందని అప్పటి నుండి సంబంధాలు సమగ్రంగా, వేగంగా పురోగమించాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విడుదల చేసిన ఒక మీడియా ప్రకటనలో తెలిపారు. ఈ పటిష్ఠమైన పునాదిపై ఈ రోజు మనం మెరుగైన, సమగ్ర వ్యూహాత్మక భాగాస్వామ్యానికి ఎదుగుతున్నామని మోదీ తెలిపారు.

సాంస్కృతిక అనుసంధానం, సామర్థ్య నిర్మాణం, అలాగే భద్రత, సుస్థిరత. సరఫరా గొలుసు, స్థితి స్థాపకత వంటి ప్రతీ రంగంలోనూ మన సహకారం కొత్త శిఖరాలకు చేరుకుంటుందని మోదీ చెప్పారు.గత దశాబ్దంలో భారత్–వియత్నాం మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 16బిలియన్ డాలర్లకు చేరుకుందని, 2030 నాటికి దానిని 25 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యమని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఆర్థిక సంబంధాలు గణనీయంగా పుంజుకుంటాయని నొక్కిచెప్పడానికి మోదీ ఇరు దేశాల మధ్య కుదిరిన అనేక ఒప్పందాలను ఉదహరించారు. ఈ ఏడాది చివరినాటికి భారత్–ఆసియన్ వాణిజ్యాన్ని నవీకరించడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి.

పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండ గా నిలిచినందుకు వియత్నాంకు భారతదేశం కృతజ్ఞతలు తెలియజేస్తున్నదని మోదీ ఈ సందర్భంగా అన్నారు.' ప్రపంచ సంక్షోభం, ఆర్థిక సవాళ్లు నెలకొన్న ఈ కాలంలో వారి ప్రతిభ, సుపరిపాలన, ఆర్థిక సంస్కరణల ఫలితంగా భారతదేశం – వియత్నాం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా ఆవిర్భవిస్తున్నాయి' అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య రాజకీయ విశ్వాసాన్ని మరింత పెంచుకోవడానికి, భద్రతా సహకారాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ఇరుపక్షాలు అంగీకరించాయని వియ త్నాం అధ్యక్షుడు టోలాం పేర్కొన్నారు.

## పలు కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను, వైస్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 17 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా సూదిని రామిరెడ్డి, సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసావేణు గోపాల్ యాదవ్ నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**కార్పొరేషన్ల చైర్మన్లు:** బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బస్వరాజ్ శ్రీనివాస్, వాషర్ మెన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌దాసరి రాజు అజయ్ కుమార్, గీత కార్మికుల కార్పొరేషన్ చైర్మన్ మొతుకూరి చంద్రశేఖర్ గౌడ్, పెరిక సాహకార కార్పొరేషన్ చైర్మన్ డొంగరి వెంకటేశ్వర్లు, మేర కార్పొరేషన్‌చైర్మన్ సంగ వెంకటరాజమ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మున్నురుకాపు చైర్మన్ బొమ్మశ్రీరామ్. యాదవ కో ఆపరటవ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణ. తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దుడెం వెంకటరమణ, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్. పద్మశాలి కార్పొరేషన్‌చైర్మన్ గూడూరు శ్రీనివాస్, భట్రాజ్ కో ఆపరేటీవ్ సొసైటీ చైర్మన్ సిహెచ్ బాల్‌రాజ్. వెలమ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్.

## జొన్న, మొక్కజొన్న

(మొదటి పేజీ తరువాయి)



రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తద్వారా మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు ఈ పౌష్టికాహారాన్ని అందిం చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పౌల్ట్రీ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వంఆలోచనలో ఉంది.

## ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

కుదిరేవరకూ ఇరాన్ ఓడరేవులపై హోర్ముజ్‌లో ఆంక్షలు కొనసాగుతాయని రుబియో ప్రకటించారు. ఈసారి చర్చలు ఇస్లామాబాద్‌లో లేదా జెనీవాలో జరిగే అవకాశం ఉంది. ఒకవేళ చర్చలు విఫలమైతే అమెరికా దిగ్బంధనం,సైనిక దాడులు కొనసాగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

వైట్‌హౌస్‌లో బుధవారం రుబియో మీడియాతో మాట్లాడుతూ, ఇరాన్ నుండి శుద్ధి చేసిన యురేనియంను ఇంకా తీసుకోలేకపోయినప్పటికీ, యుద్ధ లక్ష్యాలు సాధించామన్నారు. ''మేం లక్ష్యాలు సాధించాం, మేం శాంతి మార్గాన్నే ఇష్టపడతాం,మరో సమస్య తలెత్తాలని మేం కోరుకోవడంలేదు,ఇరాన్‌పై దాడులు చేయడం కంటే ఒక ఒప్పందం చేసుకోవడానికే ట్రంప్ ప్రాధాన్యత ఇస్తున్నారు, ఇకమీదట పూర్తిగా హోర్ముజ్ జలసంధిపైనే సంపూర్ణంగా దృష్టి కేంద్రీకరిస్తాం'' అని చెప్పారు. ఒప్పందం కుదిరేవరకూ హోర్ముజ్‌లో ఇరాన్‌పై ఆంక్షలు కొనసాగుతాయని, ఇకమీదట దౌత్యచర్యలు–ఆంక్షలపైనే పూర్తి దృష్టి పెడతామన్నారు.

''పరిస్థితుల్లో ఉన్న వాస్తవికతను అంగీకరించి, చర్చల బల్ల వద్దకు వచ్చి అంతిమంగా ప్రపంచానికి మేలు చేసే షరతులను ఇరాన్ అంగీకరించాలి, మేం ఎప్పుడూ ఒకే మార్గంలో ప్రయాణించబోం,నిజమైన దౌత్యమార్గం ఉంటే మేం దానికోసం అన్వేషిస్తాం, స్టీవ్‌విట్‌కాఫ్, జారెడ్ కుష్నేర్ ఎంతో కష్టపడుతూ దౌత్య మార్గంలో మాత్రమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు,నిజమైన దౌత్యమార్గంలోకి వస్తే, అది వారిని పునర్మిర్మాణంవైపు నడిపిస్తుంది,శ్రేయస్సు,స్థిరత్వంవైపు,ప్రపంచానికి ముప్పుగా ఉండనివైపు నడిపిస్తుంది'' అన్నారు. ఇరాన్ ఇందుకు ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకుంటే, ఆ మార్గం ఇరాన్‌ను ఒంటరితనంవైపు, ఆర్థిక పతనంవైపు,అంతిమంగా సంపూర్ణ ఓటమివైపు నడిపిస్తుం ది, ఏది సరైన నిర్ణయమో ఇరాన్‌కు తెలుసు, అక్కడ నిర్ణయాలు తీసుకుంటున్నవారికి ఏది సరైన నిర్ణయమో తెలుసు'' అని హెచ్చరించారు.

''ప్రాజెక్ట్ ఫ్రీడమ్''ను సోమవారం ఉదయం ఈ ప్రాజెక్టును అమెరికా సైన్యం సెంట్‌కామ్ ప్రారంభించింది. హోర్ముజ్ జలసంధిలో 1,550 వాణిజ్య నౌక, వివిధ దేశాలకు చెందిన 22,500 మంది నావికులు స్తంభించిపోయారని వారిని సురక్షితంగా జలసంధి దాటిస్తామని తొలుత అమెరికా సైన్యాధిపతి డాన్ కైన్ చెప్పారు. తర్వాత కొద్ది గంటలకే దీనిని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు దౌత్యపరమైన మార్గం కనుగొనేందుకు అధ్యక్షుడి ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నేర్ సహా అమెరికా అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారని రుబియో చెప్పారు.

టాస్ వార్తాసంస్థ కూడా 'ఆక్సియోస్' నివేదికను ఉటంకిస్తూ, యుద్ధం ముగించడానికి, ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్యలు కొనసాగించేందుకు నిబంధనల చట్రాన్ని రూపొందించే దిశగా ''సింగిల్‌పేజీలో ఒక అవగాహన' కుదుర్చుకునేందుకు రంగం సిద్ధమవుతోందని తెలియజేసింది. రెండు దేశాలమధ్యా ఒక అవగాహన పత్రం (ఎంఒయు) కుదరడానికి దాదాపుగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఎంఒయుకు రెండు దేశాలూ చేరువ అవుతున్నాయని పేర్కొంది. ఇద్దరు అమెరికా అధికారులతోపాటు ఈ విషయంపై పూర్తి అవగాహన ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను కూడా ఉటంకిస్తూ ఆక్సియోస్ నివేదిక ఇచ్చినట్టు టాస్ సంస్థ పేర్కొంది. రాబోయే 48 గంటల్లో ఇరాన్ నుండి సానుకూల ప్రతిస్పందన వస్తుందని అమెరికా ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆక్సియోస్ ప్రకటించింది.

**ఇరాన్‌ను బెదిరించి లొంగదీయలేరు**

తమ దేశాన్ని ఎవరూ బలవంతంగా లొంగదీసుకోలేరని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ హెచ్చరించారు. యుద్ధం ముగించేందుకు చర్చల్లో అమెరికాకు రాయితీలు ఇవ్వాలని, లేకపోతే యుద్ధాన్ని ఎదుర్కోవాలని ట్రంప్ చేసిన హెచ్చరికపై సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ, షియా ముస్లిం దేశాన్ని బెదిరింపులతో ఎవ్వరూ లొంగదీసుకోలేరన్నారు. తాను ఇరాక్ ప్రధానమంత్రితో మాట్లాడానని, పశ్చిమాసియాలో సైనిక బెదిరింపులు కట్టిపెట్టాలని కోరారని పేర్కొన్నారు. కాగా పశ్చిమాసియాలో ఇరాన్‌పై ఫిబ్రవరి 28న ప్రారంభించిన ''ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'' ముగిసిందని అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి మార్కో రుబియో ప్రకటించారు. ఐతే దీనిపై ఇరాన్ స్పందిస్తూ, తాత్కాలికంగా సంధి ద్వారా యుద్ధం ముగిసినప్పటికీ బెదిరింపులు మాత్రం కొనసాగుతున్నాయని పేర్కొంది.

## పంటలు కొంటారా.. లేదా?

(మొదటి పేజీ తరువాయి)

అన్ని చివరి గింజ దాకా కొనేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టేదే లేదని కెటిఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ఇచ్చి సరిగ్గా నాలుగు సంవత్సరాలైనా ఒక్క హామీని నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వరంగల్ లో ఏర్పాటు చేసిన రైతు సంగ్రామ సదస్సు సభలో కెటిఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేస్తున్న తీరుపైన విరుచుకుపడ్డారు.రైతన్నలు ఆందోళన చెందవద్దని, ఆత్మహత్యల గురించి ఆలోచించవద్దని కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కాలర్ పట్టుకొని కాంగ్రెస్ పార్టీని నిలదీద్దామని, గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను తన్ని తరిముదాము, కానీ ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. గత 48 గంటల్లో దాదాపు ఎనిమిది మంది రైతన్నలు రాష్ట్రంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేసిన కెటిఆర్ ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణమన్నారు. రాహుల్ గాంధీ రైతు హామీలు ఇచ్చి డిక్లరేషన్ పేరిట ఓట్లు దోచుకొని ఢిల్లీకి పారిపోయారని, తెలంగాణ రైతన్నలు ఆత్మహత్యల పాలవుతుంటే, అవస్థలకు గురవుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని కెటిఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్ లో ప్రెస్ క్లబ్ లో సమావేశం పెట్టి మరి రైతులకు రుణమాఫీ అంశంలో చర్చకు రావాలని రేవంత్ రెడ్డిని సవాలు చేస్తే పారిపోయిన పిరికిపంద అని కెటిఆర్ అన్నారు.ఒకప్పుడు కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు అడ్రస్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రం, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. వ్యవసాయ సంక్షేమ పథకాలు అన్నింటిని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరి మూడేళ్ల లోపే మూడు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయల అప్పు తెచ్చి ఎవరికి దోచి పెట్టిందని కెటిఆర్ ప్రశ్నించాడు. రాష్ట్రంలో ఇంత వ్యవసాయ సంక్షోభ పరిస్థితులు ఉన్నా రైతు మరణాలు కొనసాగుతున్న ఇప్పటిదాకా ఒక్క సమీక్షా సమావేశాన్ని కూడా నిర్వహించిన పాపాన పోలేదన్నారు. బిజెపి కూడా నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతుల నిరసనతో వెనక్కి తగ్గిందని స్వయంగా ప్రధాన మంత్రి క్షమాపణ కోరిన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా రైతన్నల పంటలను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, ఆత్మహత్యలకు సంతాపం ప్రకటించి రైతు మరణాల పాలైన రైతన్నలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమలు చేయాలని, రైతుల రుణమాఫీని సంపూర్ణంగా పూర్తి చేయడంతో పాటు రైతు భరోసా బకాయిలు చెల్లించాలని తీర్మానాలు చేశారు.ఈ సదస్సుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మ య్య, ఎర్రబెల్లి దయాకర్ రావు, రెడ్యానాయక్, వేముల ప్రశాంత్ రెడ్డి,సత్యవతి రాథోడ్, మాజీ ఎంపి మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి,శంకర్ నాయక్, సతీష్ కుమార్, నన్నపనేని నరేందర్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# ఢిల్లీపై చెన్నై సూపర్ కింగ్స్ విజయం



ప్లే ఆఫ్స్ రేసు ఉత్కంఠ రేపుతుండగా చెన్నై సూపర్ కింగ్స్ కీలక విజయంతో రేసులో కొచ్చింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన సీఎస్కే అలవోకగా ఢిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించింది. 156 పరుగులు ఛేదనలో సంజూ శాంసన్(87 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. కార్తిక్ శర్మ(41 నాటౌట్) మెరుపులతో జయభేరి మోగించింది. ఐదో విజయంతో నాకౌట్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది చెన్నై. దాంతో, సొంతగడ్డపై గెలిచి పది పాయింట్లు సాధించాలనుకున్న ఢిల్లీకి చుక్కెదురైంది. ఐపిఎల్ 19 లీగ్ దశలో ఆలస్యంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్ మరో విజయం నమోదు చేసింది.

మంగళవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత బౌలర్ల కృషితో ఆతిథ్య జట్టును పరిమితం చేసిన సీఎస్కే.. ఛేదనలో త్వరగానే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వలేదు. శాంసన్(87 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీకి, కార్తిక్ శర్మ(41 నాటౌట్) సహకారం తోడవ్వగా వికెట్ల తేడాతో సీఎస్కే గెలుపొందింది. ఛేదనలో ఫామ్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్(6)ను ఎంగిడి ఔట్ చేసి షాకిచ్చినా.. ఉర్విల్ పటేల్(17) రెండు సిక్సర్లతో ప్రమాదకరంగా కనిపించాడు. కానీ, అతడిని అక్షర్ వెనక్కి పంపగా సంజూ శాంసన్ (87), కార్తిక్ శర్మ(41 నాటౌట్)లు నింపాదిగా ఆడుతూ.. పదో ఓవర్ నుంచి గేర్ మార్చారు. కుల్దీప్ వేసిన 12వ ఓవర్లో 6, 6, 4 బాదిన సంజూ 32 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. అనంతరం స్టార్క్‌ను ఉతికేస్తూ రెండు ఫోర్లు కొట్టడంతో చెన్నై స్కోర్ వంద దాటింది. హాఫ్ సెంచరీ తర్వాత మరింత రెచ్చిపోయిన సంజూ .. నటరాజన్ ఓవర్లో వరుసగా 6, 6, 4 తో విజయాన్ని మరింత తేలిక చేశాడు. 18వ ఓవర్లో కార్తిక్ వరసగా సిక్స్, ఫోర్ కొట్టడంతో చెన్నై 8 వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించింది.

**ఆదుకున్న రిజ్వీ, స్టబ్స్...** ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు మరోసారి తడబడ్డారు. ఆర్సీబీపై 75 పరుగులకే ఆలౌట్ నుంచి పాఠాలు నేర్వకపోవడం ఆ జట్టును ఆదిలోనే కష్టాల్లో పడేసింది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 69 పరుగులకే ఐదు వికెట్లు పడిన వేళ ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(40 నాటౌట్), స్టబ్స్(38) ఆదుకున్నారు. ఆఖర్లో అశుతోష్ శర్మ(14) రెండు సిక్సర్లతో స్కోర్ దాటించాడు. చివరి బంతికి రిజ్వీ సిక్సర్ బాదగా ఢిల్లీ ప్రత్యర్థికి 156 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## డోప్ టెస్టు మిస్..
## వినేశ్‌కు ఐటిఏ నోటీసులు



**న్యూఢిల్లీ:** నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌తో తిరిగి మ్యాచ్‌కు వచ్చేందుకు సిద్ధమవుతున్న భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటిఏ) షాకిచ్చింది. గతేడాది చివర్లో అవుట్ ఆఫ్‌కాంపిటీషన్ డోపింగ్ పరీక్షకు అందుబాటులో ఉండనందుకు గానూ ఆమెకు నోటీసులు జారీ చేసింది. గత డిసెంబర్ 18న హర్యానా అసెంబ్లీ శీతాకాల సమావేశాల నిమిత్తం వినేశ్ చండీగఢ్ వెళ్లింది. కానీ, ఆ సమాచారాన్ని ఆమె సకాలంలో అప్డేట్ చేయకపోవడం వల్ల డోపింగ్ నియంత్రణ అధికారికి అందుబాటులో లేకుండా పోయింది. దీనిపై ఆమె ఇచ్చిన వివరణను తోసిపుచ్చిన ఐటీఏ వినేశ్ డోప్ టెస్టుకు గైర్హాజరైందని అధికారికంగా నమోదు చేసింది. గత 12 నెలల కాలంలో ఫొగాట్ తొలిసారి తన లొకేషన్ వివరాలు తెలపడంలో (వేర్ అబౌట్స్) విఫలమైంది. ఏడాదిలో ఇలాంటి మూడు వేర్ అబౌట్స్ వైఫల్యాలు నమోదైతేనే దానిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి గరిష్ఠంగా రెండేళ్ల వరకు నిషేధం విధిస్తారు. అయితే, ఈ నోటీసు డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదని, హెచ్చరిక మాత్రమేనని ఐటిఏ తెలిపింది.



## అర్చరీ మెయిన్ రౌండ్‌కు కాంపౌండ్ జట్లు

**షాంఘై:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్2లో భారత పురుషుల, మహిళల కాంపౌండ్ జట్లు మెయిన్ రౌండ్‌కు అర్హత సాధించాయి. మంగళవారం జరిగిన పురుషుల క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఓజస్ ప్రవీణ్, సాహిల్ జాదవ్, కుశాల్ దలాల్తో కూడిన భారత త్రయం.. 2,130 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం సాధించింది. మహిళల విభాగంలో భారత్ ఐదో స్థానం అందుకుంది. తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, ప్రగతి, అదితితో కూడిన త్రయం 2,092 పాయింట్లతో మెరిసింది.

# ఆధ్యాత్మిక నిర్మాణం.. మానవత్వ కోణం..






ఈజిప్ట్‌లోని ప్రసిద్ధ 'డెండెరా' దేవాలయాన్ని, గ్రేకో–రోమన్ పాలనా కాలానికి చెందిన మహత్తర ఆధ్యాత్మిక నిర్మాణంగా పేర్కొంటారు. చరిత్రకారుల అంచనా ప్రకారం ఈ దేవాలయం నిర్మాణం క్రీ.పూ.మొదటి శతాబ్దం నుంచి క్రీ.శ.మొదటి శతాబ్దం మధ్య కాలంలో పూర్తయింది. ఈ ఆలయం ప్రధానంగా ప్రేమ, సంగీతం, ఆనందం, మాతృత్వానికి ప్రతీకగా పూజించే హాథోర్ దేవతకు అంకితం చేయబడింది. ప్రాచీన ఈజిప్టు మతపరమైన జీవన విధానంలో హాథోర్ ప్రత్యేక స్థానం కలిగిన దేవతగా కొలిచేవారు. డెండెరా దేవాలయ గోడలు అత్యంత విశిష్టమైన చిత్రకళతో అలంకృతమైంది. ఎరుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ వంటి ప్రకాశవంతమైన రంగులతో రూపొందించిన ఈ చిత్రాలు దేవతలు, ఫరావోలు, మతపరమైన ఆచారాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. శతాబ్దాల కాలప్రవాహం, వర్షాలు, ఎడారి గాలులు వీటి మీద ప్రభావం చూపినప్పటికీ, చిత్రాలలోని ఆకృతులు ఇప్పటికీ జీవంగా కనిపిస్తాయి. గోడలపై కనిపించే ప్రతి చీలిక, ప్రతి మసకబారిన రంగు కాలం సాగిన కథను చెప్పే చారిత్రక గుర్తులుగా నిలుస్తాయి. సాంస్కృతికంగా ఈ దేవాలయం నైల్ నది వరదలు, ఎడారి వాతావరణం మధ్య అభివృద్ధి చెందిన ఈజిప్షియన్ నాగరికత యొక్క సమతుల్యతను తెలియజేస్తుంది. ఇక్కడ నిర్వహించిన ఆధ్యాత్మిక క్రతువులు, ప్రార్థనలు, సంగీత వేడుకలు సమాజ జీవితంలో మతం ఎంత ముఖ్యమో సూచిస్తాయి. దేవాలయం అంతర్భాగంలో నిలబడినప్పుడు దీపాల వెలుగు, ధూపాల సువాసన, మంత్రోచ్చారణల ప్రతిధ్వని ఇంకా గాలిలో తేలుతున్నట్లుగా అనిపిస్తుంది. ఆ అనుభూతి భక్తి, ఆధ్యాత్మికతను లోతుగా స్పృశిస్తుంది. తాత్విక దృష్టితో చూస్తే, ఈ గోడలు మానవ జ్ఞానం, విశ్వాసం, అస్తిత్వం మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతిబింబిస్తాయి. దేవతల చిత్రాలు కేవలం మతపరమైన చిహ్నాలు మాత్రమే కాకుండా, జీవితం యొక్క అర్థాన్ని తెలుసుకోవాలనే మానవ ప్రయత్నాన్ని సూచిస్తాయి. ప్రకృతి, సమయం మరియు ఆధ్యాత్మికత మధ్య సమన్వయం ఎలా సాధించాలో ఈ నిర్మాణం మౌనంగా బోధిస్తుంది. డెండెరా దేవాలయం కేవలం ఒక చారిత్రక కట్టడం కాదు. అది మానవ నాగరికత ఆలోచనల నిల్వ. గతాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తు వైపు సాగాల్సిన మార్గాన్ని సూచించే జ్ఞాన వేదికగా నిలుస్తుంది. మానవుడు సృష్టించిన కళ, భక్తి, శాశ్వత అర్థాన్వేషణకు సజీవ సాక్ష్యంగా ప్రపంచ చరిత్రలో ప్రత్యేకస్థానాన్ని సంపాదించింది.

## కొండ చెరియల్లో సమాధులు..

ప్రాచీన నిర్మాణ కళ, అప్పటి ఇంజనీరింగ్ ప్రతిభ ఎన్నో సందర్భాల్లో అబ్బురపరుస్తుంటాయి. అలాంటి నిర్మాణాలను చైనా దేశంలోని లోయెస్ ప్లేటో ప్రాంతంలో కూడా చూడవచ్చు. అక్కడ కొండ చెరియలపై కట్టిన సమాధులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సైతం సవాళ్లు విసురుతుంటాయి. ఈ సమాధులు ప్రాచీన హాన్ రాజవంశ కాలానికి (క్రీ.పూ. 206 – క్రీ.శ. 220) చెందినవిగా భావిస్తున్నారు. మృదువైనవే యినప్పటికీ, స్థిరమైన లోయెస్ మట్టిలో వీటిని ఎంతో జాగ్రత్తగా నిర్మించారు. సహజ శిలా నిర్మాణాలను వినియోగిస్తూ రూపొందించిన ఈ సమాధులు ఆ కాలంలోని నిర్మాణ నైపుణ్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. గాలి, వర్షాల ప్రభావంతో గోడలపై ఏర్పడిన గీతలు కాలం ముద్రలుగా కనిపిస్తూ, శతాబ్దాల చరిత్రను నిశ్శబ్దంగా తెలియజేస్తాయి. ఈ గుట్టచరఇలు ప్రాచీన చైనా ప్రజల సంప్రదాయాలు, అంత్యక్రియల విధానాలు, మరణానంతర జీవితం పట్ల ఉన్న విశ్వాసాలను అర్థం చేసుకునే ముఖ్య ఆధారాలుగా నిలుస్తాయి. 'మరణం అంతం కాదు, మరో ప్రపంచానికి మార్పు మాత్రమే' అనే భావన వారి సంస్కృతిలో ఎంత లోతుగా ఉందో ఈ నిర్మాణాలు సూచిస్తాయి. అందువల్ల ఇవి కేవలం సమాధులు కాకుండా ఆధ్యాత్మిక ఆలోచనల ప్రతీకలుగా కూడా గోచరిస్తాయి. తాత్వికంగా చూస్తే, లోయెస్ ప్లేటో మధ్యలో నిలిచిన ఈ నిర్మాణాలు ప్రకృతి సృష్టి, మానవ కృషి మధ్య ఉన్న సమన్వయాన్ని ప్రతిబింబిస్తాయి. నిశ్శబ్దంగా నిలిచిన ఈ గుహలు జీవితం, నాగరికతల మార్పు, మానవ ఆత్మ యొక్క శాశ్వతత గురించి కాలాతీత సందేశాన్ని ప్రసారం చేస్తూ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాయి.



## పురాతన రోమన్ నగరం వోలుబిలిస్

మొరాక్కో దేశంలోని వోలుబిలిస్ ప్రాచీన నగరం ఉత్తర ఆఫ్రికాలోని ముఖ్యమైన రోమన్ పురావస్తు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు సంపాదించింది. క్రీ.పూ. మూడవ శతాబ్దంలో ఏర్పడిన ఈ నగరం, మౌరెటానియా రాజ్య కాలంలో రాజధానిగా అభివృద్ధి చెందింది. తరువాత రోమన్ సామ్రాజ్య ప్రభావంలో ఇది వాణిజ్య, పరిపాలనా, సాంస్కృతిక కేంద్రంగా మారింది. నేటికీ అక్కడ కనిపించే శిథిలాలు ఆ నగరపు వైభవాన్ని, సంపన్నమైన చరిత్రను స్పష్టంగా తెలియజేస్తాయి. వోలుబిలిస్ నిర్మాణాలలో ముఖ్యంగా కనిపించేవి కొరింథియన్ శైలిలో నిర్మించిన స్తంభాలు. కాలప్రవాహం వల్ల కొంత భాగం ధ్వంసమైనప్పటికీ, అవి ఇంకా ఉత్తర ఆఫ్రికా సూర్యకిరణాల మధ్య నిలిచి గత మహిమను గుర్తు చేస్తాయి. స్తంభాలపై పెరిగిన లైకెన్ అనే సహజ మొక్కలు ప్రకృతి మళ్లీ తన ఆధిపత్యాన్ని స్థాపిస్తున్న సంకేతాలుగా కనిపిస్తాయి. తవ్వకాల ద్వారా బయటపడిన వీధుల ఆకృతి, గృహ నిర్మాణాలు, ప్రజాస్థలాల అవశేషాలు నగర ప్రణాళిక ఎంతసమగ్రంగా ఉండేదో తెలియజేస్తాయి. ఇవి అప్పటి పౌరజీవనం, వాణిజ్యం, సామాజిక వ్యవస్థపై విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. చరిత్రాత్మకంగా వోలుబిలిస్ మానవ ఆశయాలు, కాలం కలిగించే మార్పుల మధ్య జరుగుతున్న మౌన సంభాషణలా అనిపిస్తుంది. ఒకప్పుడు శక్తివంతమైన నగరంగా వెలిగిన ఈ ప్రదేశం, క్రమంగా ప్రకృతిలో కలిసిపోవడం నాగరికతల నశ్వరత్వాన్ని గుర్తుచేస్తుంది. ప్రతిరాయి ఒక సామ్రాజ్యం ఎదుగుదల, దాని స్థిరత్వం, చివరకు జరిగిన మార్పుల కథ చెబుతుంది. వోలుబిలిస్ మనకు నాగరికతల ఎదుగుదలపతనాల సహజ చక్రాన్ని ఆలోచించమని ఆహ్వానిస్తుంది.



# 'అగ్లీ స్టోరీ' ట్రైలర్ విడుదల



ప్రేమలోని చీకటి కోణాన్ని ధైర్యంగా చూపించే 'అగ్లీ స్టోరీ' ట్రైలర్ ఆకట్టుకునే విధంగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'భీమ్లా నాయక్' డైరెక్టర్ సాగర్ కె చంద్ర చేతులు మీదుగా ట్రైలర్ విడుదల అయ్యింది. నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంగీత దర్శకుడు శ్రావణ్ భరద్వాజ్ మ్యూజిక్ ట్రైలర్‌ను మరింత ఆకర్షణీయం చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ బుధవారం హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో నందు మాట్లాడుతూ ఈ పాత్ర నాకు కొత్త ఛాలెంజ్. ఆసక్తికరమైన థ్రిల్లింగ్ సీన్స్‌తో నిండిన స్టోరీ ఇది. అవికా మంచి ఎమోషనల్ డెప్త్ ఇచ్చింది. డైరెక్టర్ ప్రణవ ఈ సినిమాని చాలా బాగా తీశారు. ప్రొడ్యూసర్‌లు సుభాషిణి, లక్ష్మణ్ అద్భుతమైన నిర్మాణ విలువలు అందించారు. ప్రేక్షకులు ఈ సినిమాని కచ్చితంగా ఆస్వాదిస్తారు అని అన్నారు. హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ ఈ చిత్రం ద్వారా ప్రేమ వాస్తవాలను చూపించాలనుకున్నాం. ట్రైలర్ చూశాక చాలా ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన సినిమాలో అవకాశం రావడం నా అదృష్టం. మే 22న థియేటర్‌లలో కలుద్దాం అని అన్నారు. డైరెక్టర్ ప్రణవ స్వరూప్ మాట్లాడుతూ, 'ప్రతి ప్రేమకు ఓ చీకటి వైపు ఉంటుంది. ఆ సత్యాన్ని బలంగా చెప్పడమే మా లక్ష్యం. నందు, అవికా నటన ఈ చిత్రానికి బలం చేకూర్చింది. మా ప్రొడ్యూసర్‌లు సుభాషిణి, లక్ష్మణ్ ఈ సినిమా క్వాలిటీ విషయంలో నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. కచ్చితంగా ఈ సినిమా చూసి, ప్రేక్షకులు థియేటర్‌లలో మంచి అనుభవం పొందుతారు' అని తెలిపారు. అలాగే ట్రైలర్ లాంచ్ చేసిన సాగర్ కె చంద్ర కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్మాతలు సుభాషిణి, లక్ష్మణ్, నిర్మాత బెక్కం వేణు గోపాల్, సాగర్ కె చంద్ర మాట్లాడారుమాట్లాడారు.

# విలన్ ఎవరో చెబితే రూ.లక్ష బహుమతి

### ఎం4ఎం మూవీ హీరోయిన్ జో శర్మ



మోంటల్ కృష్ణ లాంటి సినిమాలను నిర్మించిన నిర్మాత మోహన్ వడ్లపట్ల ఇప్పుడు దర్శకుడిగా మారి నిర్మించిన చిత్రం ఎం4ఎం (మోటివ్ 4 మర్డర్). క్రైం, సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ మూవీలో హీరోయిన్‌గా నటించిన అమెరికన్ నటి జో శర్మ మీడియా బుధవారం మీడియాతో చిట్ చాట్ చేశారు. నా పేరు జో శర్మ. నేను శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా) నుంచి వచ్చాను. అయితే నేను పుట్టింది హైదరాబాద్ లోనే. కానీ పెరిగింది నాగ్‌పూర్, ముంబైలో. అందుకే నాకు తెలుగుతో పాటు మరాఠీ, హిందీ బాగా వస్తాయి. మా అమ్మానాన్నలది విజయవాడ, గుంటూరు ప్రాంతాలు. ఇది నా తొలి చిత్రం ఎం4ఎం (మోటివ్ ఫర్ మర్డర్)'. ఈ సినిమా తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదలవుతోంది. మోహన్ వడ్లపట్ల ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'రాధ', నేను ఒక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా కనిపిస్తాను. నేను అమెరికాలో థియేటర్ ఆర్టిస్ట్‌ని, నాకంటూ ఒక థియేటర్ ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉంది. మోహన్ దగ్గర మూడేళ్లు శిక్షణ తీసుకున్నాను. ఈ సినిమాకి మోహన్ , రాహుల్ అడవలతో కలిసి నేను కో–రైటర్‌గా కూడా పనిచేశాను. కథా చర్చల్లో పాల్గొనడం వల్ల నా పాత్రను చాలా బలంగా డిజైన్ చేసుకున్నాను. ఈ సినిమా ఇంకా రిలీజ్ కాకముందే మాకు 15 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి. లాస్ ఏంజెల్స్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ ఫిలిం, లండన్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ డైరెక్టర్, న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ యాక్ట్రెస్, హాలీవుడ్ శాంటా మోనికా తదితర ఫిలిం ఫెస్టివల్స్‌లో ఉత్తమ నటిగా నాకు, ఉత్తమ దర్శకుడిగా మోహన్ గారికి అవార్డులు వచ్చాయి. ముఖ్యంగా ప్రతిష్టాత్మక 'కేన్స్' ఫిల్మ్ ఫెస్టివల్‌లో మా సినిమా గ్లోబల్ ప్రీమియర్ వేశారు. అక్కడ తెలుగు సినిమాను సబ్‌టైటిల్స్‌తో చూసిన విదేశీయులు కూడా ఆశ్చర్యపోయి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. అది మాకు దక్కిన చాలా గొప్ప గౌరవం. అక్కడ మా సినిమాకు వచ్చిన స్పందన ఎంతో ఆత్మవిశ్వాసం కలిగించింది. సీన్ చాలా గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా సాగుతుంది. సినిమాలో హీరోగా ఏసీపీ కృష్ణ పాత్ర ఉంటుంది. విడుదల రోజు ఈ సినిమాలో విలన్ ఎవరో చెబితే లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించాము. ఈ చిత్రాన్ని మోహన్ మీడియా క్రియేషన్స్, మెక్ క్వీన్ గ్రూప్ అమెరికా వారు సంయుక్తంగా నిర్మించారు. షూటింగ్ అంతా దాదాపు హైదరాబాద్‌లోనే జరిగింది. సంగీతం చెన్నైకి చెందిన వసంత్ ఇసైపట్టాయ్ అందించారు.ఈ హత్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి అనేది అసలు పాయింట్. ఈ టైటిల్‌కే అందరూ కనెక్ట్ అవుతున్నారు. ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. బ్యూటీ విత్ బ్రెయిన్స్ అనిపించుకోవడమే నా లక్ష్యం. తెలుగులో కంటిన్యూగా సినిమాలు చెయ్యాలని ఉంది.



## నితిన్ హీరోగా ... త్వరలోనే కొత్త సినిమా షూటింగ్



నితిన్ హీరోగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కొత్త సినిమా ప్రారంభమైంది. దర్శకులు నారి సిరిసవాడ, సోమశేఖర్ టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నితిన్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కార్యాలయంలో పూజ కార్యక్రమాలతో ప్రారంభమైంది. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా అనిత్ మదాడి, కళా దర్శకుడిగా జానీ షేక్ వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మే రెండో వారం నుండి ప్రారంభం కానుంది. చిత్ర యూనిట్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, షూటింగ్ మొదలు పెట్టడానికి సన్నద్ధమవుతోంది.ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సహ నిర్మాతలు: ఉప్పుటూరి వెంకట్, వీఎంఆర్.



## 'వీరభద్రుడు'కు యూ/ఏ సర్టిఫికెట్

తమిళ నటుడు సూర్య తాజాగా నటించిన మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. దర్శకుడు ఆర్జే బాలాజీ ఈ సినిమాకాలు దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది.తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్ఠాత్మకగా తెరకెక్కిస్తోంది.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫర్ గా పని చేశారు.
14న ఈ చిత్రాన్నిచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
ఈ చిత్రానికి యాక్షన్ అన్బరివ్ విక్రమ్ మోర్, ఎడిటర్ ఆర్.కళైవానన్,, నిర్మాతలు: ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు.

## ప్రతిరోజూ షూటింగ్... తర్వాత హాస్పిటల్‌కు వెళ్లేదానిని

### సతీ లీలావతి హీరోయిన్ లావణ్య త్రిపాఠి కొణిదెల



హీరోయిన్ లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య ఈ మూవీకి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 8న రిలీజ్ అవుతున్న సందర్భంగా బుధవారం హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 'సతీ లీలావతి' మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో చూడాలి. ఈ మూవీ షూటింగ్ టైంలోనే నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. కానీ టీం ఇచ్చిన సపోర్ట్‌తో షూటింగ్ సాఫీగా చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ అయిన తరువాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. చిత్రీకరణలో చిన్న చిన్న గాయాలు అవ్వడం అనేది కామన్ కదా. అయితే ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కి చెప్పాను. అప్పుడు నాకు ప్రెగ్నెంట్ అని తెలీదు, ఎలాంటి సింప్టమ్స్ కూడా లేవు. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను. నేను ఈ చిత్రంలో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. నేను, నా మేనేజర్ సినిమా చూస్తూ ఫుల్లుగా నవ్వుకున్నాం. 'సతీ లీలావతి'లో చూపించినట్టుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి కూడా ఏ మహిళకీ రాకూడదు. నాకు రియల్ లైఫ్‌లో వరుణ్ లాంటి మంచి భర్త దొరికారు. ప్రస్తుతం నేను నా భర్త, కొడుకుతో హ్యాపీగా ఉన్నాను. రామ్ చరణ్ మాకు ఎప్పుడూ సపోర్టివ్ గానే ఉంటారు. మా కోసం ఆయన ట్రైలర్ రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించింది. రామ్ చరణ్ రిలీజ్ చేయడంతో మాకు మరింత రీచ్ వచ్చింది. దేవ్ మోహన్ అద్భుతమైన నటుడు. ఈ మూవీ కోసం డబ్బింగ్ కూడా చెప్పారు. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకోవడం ఆనందంగా ఉంటుంది. చిరంజీవి మా అందరినీ ఎంతో ఎంకరేజ్ చేస్తుంటారు. ప్రస్తుతం నేను సినిమాల్ని ఒప్పుకోవడం లేదు. వరుణ్‌తో కలిసి నటించాలని నాకు కూడా ఉంది. ఈ మధ్యే ఓ కథ కూడా వచ్చింది. కానీ మేం రియల్ లైఫ్‌లో కలిసే ఉన్నాం. తెరపైనా అలానే కనిపించాలంటే కథ కాస్త కొత్తగా, డిఫరెంట్‌గా ఉండాలి. భవిష్యత్తులో అలాంటి కథ వచ్చినప్పుడు ఆలోచిస్తాం.



## చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/గుండాల:** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం గుండాల మండల పరిధిలోని పెద్దపడిశాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలలో ఉన్న రైతుల వద్దకు వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రైతులు ఎటువంటి అధైర్య పడవద్దని రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం కేంద్రంలోని అధికారులతో మాట్లాడుతూ ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రాల్లో సరిపడా గన్ని బ్యాగు, లారీలను ఎర్పాటు చేసి ఎప్పటికప్పుడు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తడిన చర్యలు తీసుకుంటుందని రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని, తేమ శాతం లేకుండా చూసుకోని ధాన్యాన్ని అమ్ముకోవాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని అమ్మిన రెండు రోజుల్లోనే డబ్బులు వారి ఖాతాలలో జమ చేయడం జర్గుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## గాయపడిన వారికి నష్టపరిహారం ప్రకటించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం బొంగోనిచెరువు గ్రామ పరిధిలోని నోష్ ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన రియాక్టర్ పేలుడు సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులకు యాజమాన్యం వెంటనే నష్టపరిహారం ప్రకటించి అందజేయాలని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో జరిగిన సంఘటన చాలా నిర్లక్ష్య పూరితమైనదని విమర్శించారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం కారణంగా కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. గాయపడిన ప్రతి కార్మికుడికి రూ. 1 కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి భాద్యులైన పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వెంటనే క్షతగాత్రులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాయపడిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు సిపిఐ వారి వెంట నిలబడుతుందని క్షతగాత్రుల కుటుంబాలకు సత్యం హామీ ఇచ్చారు.

## 20న ఆలేరులో ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఆలేరు పట్టణంలో ఈ నెల 20న జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి (టిపిఎన్ఎం)జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే కళా ఉద్యమాలకు ప్రజా నాట్యమండలి ఎప్పటికప్పుడు ముందుంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి కళాకారులు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు నాటకాలు ప్రజా చైతన్య గీతాలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణలు నిర్ణయించేందుకు ఈ మహాసభలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్, సీపీఐ నారాయణపురం మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, పాల్గొన్నారు.

## రామారావు...నీ డ్రామాలు ఆపాలి

కెటిఆర్‌పై ప్రభుత్వ విప్ వీరేశం ఫైర్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారం పోయినా కేటీఆర్‌లో అహంకారం తగ్గలేదని, ప్రజలు తిరస్కరించినా దొర ధోరణితో మాట్లాడుతున్నారని విమర్శించారు.మంగళవారం నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మాజీ మంత్రికి తగదన్నారు. వరంగల్‌లో శృతి ఎన్‌కౌంటర్, వరి వేస్తే ఉరి' వ్యాఖ్యలు, రుణమాఫీ హామీలతో బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు.బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం డ్రగ్స్‌కు కేంద్రంగా మారిందని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆరోపించారు. కేసీఆర్ ఒక్కరోజైనా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడలేదని ప్రశ్నించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేటీఆర్ మంత్రి అయ్యేవాడా అని నిలదీశారు. దొర అహంకారానికి ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పారని, రామారావు డ్రామాలు మానుకుని వాస్తవాలు మాట్లాడాలని సూచించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, చౌగోని శ్రీనివాస్,లింగాల వెంకన్న,నంద్యాల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

11కెవి వైరు తెగి దగ్ధమైన బోరు మోటర్లు, గడ్డివాములు

రూ.50లక్షల ఆస్తినష్టం





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజక వర్గంలోని చివ్వెంల మండలం గుంజలూరు గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. 11కెవి విద్యుత్ వైరు తెగి పంట పొలాల్లో పడడంతో బోరు మోటర్లు కాలి దగ్ధమయ్యాయి. 5 ఎకరాల మేరకు చేతికి వచ్చిన వరి పైరుతోపాటు, పంట నూర్పిడి చేసిన తరువాత పొలాల్లో పోగుచేసిన గడ్డికట్టలు దగ్ధమయ్యాయి. దీంతో 40 మంది రైతులకు దాదాపు రూ.50లక్షల నష్టం వాటిల్లింది. బాధితులు సుంకరి ఉపేందర్, కొప్పు శ్రీనివాస్‌తో పాటు పలువురు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో 11కెవి విద్యుత్ వైరు తెగి పంట పొలాల్లో పడడంతో మంటలు వ్యాపించాయని దాదాపు 100 ఎకరాలలో వరి కొయ్యలు తగలపడగా, చేతికి వచ్చిన 3 ఎకరాల వరి పంట పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితోపాటు రైతులకు సంబంధించిన 40 విద్యుత్ మోటర్లు, స్టార్టర్లు కాలి బూడిద కావడంతో దాదాపు రూ.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. 11కెవి విద్యుత్ వైర్ తెగిపడిన సమయంలో 5 సార్లు ట్రిప్ కావడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. అధికారులు విద్యుత్‌ను ఆన్‌చేయకుంటే ఇంత పెద్దఎత్తున ప్రమాదం జరిగేది కాదని వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల గ్రామంలోని పెరకబజారులో ట్రాన్స్‌ఫార్మర్ లోపం వల్ల ఇండ్లలోని గోడలకు విద్యుత్ సరఫరా అయ్యి ఒక వృద్ధ మహిళ మృతి చెందిన విషయాన్ని వారు గుర్తు చేశారు. గ్రామంలో తలెత్తుతున్న విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలపై ఏఇ, లైన్‌ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌కు చెప్పినా ఏ మాత్రం స్పందించడంలేదన్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు సమాచారం అందించి 24 గంటలు అవుతున్నా ఎవరు కూడా ఇటు కన్నెత్తి చూడలేదన్నారు.

**ప్రతి పనికి డబ్బులు ఇస్తేనే...**

మండలంలోని విద్యుత్ అధికారులతోపాటు లైన్‌ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడినప్పుడు తాము వారి దృష్టికి తీసుకవెళ్తే ప్రతి పనికి డబ్బులు ఇస్తేనే మరమ్మత్తులు చేయడం జరుగుతుందని రైతులు ఆరోపించారు. కరెంట్ స్తంబం ఎక్కినా, దిగినా రూ.500లు ఇవ్వాల్సిందేనని ఇవ్వకుంటే రోజుల తరబడి పని చేయకుండా కాళ్ళు అరిగేలా వారి చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే కొంత మంది విద్యుత్ సిబ్బంది నిత్యం మద్యం మత్తులో మునిగి తేలుతూ తమ విధులను విస్మరిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వం తమను ఆదుకోవడంతోపాటు

**బాధ్యులైన విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలి...**

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ ఏఇ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమకు ప్రతిసారి నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఇండ్లలోని గోడలకు విద్యుత్ సరఫరా అయ్యి షార్ట్‌సర్క్యూట్‌తో తరచూ ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టివిలు, మిక్సీలు, బోరు మోటార్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని ఈ విషయం వారి దృష్టికి అనేకమార్లు తెచ్చిన నెలల తరబడి నుండి పట్టించుకోని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిర్లక్ష్యపు డ్రైవింగ్,అధిక వేగం,అలసటతో వాహనం నడపడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని,డ్రైవర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు.బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, డ్రైవర్లతో ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధిక వేగం,అలసట,మద్యం సేవించి వాహనం నడపడం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి డ్రైవర్ డిఫన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. అడిషనల్ ఎస్‌పి రమేష్,ఎస్‌బీసీఐ ఆదిరెడ్డి,ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య, మిర్యాలగూడ లారీఅసోసియేషన్ ప్రెసిడెంట్ చాంద్ పాషా,సెక్రటరీ రవీందర్ రావు, డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం పాల్గొన్నారు.

# ఒకే పంటపై ఆధారపడొద్దు...

మారుతున్న వ్యవసాయానికి రైతులు సిద్ధం కావాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు

ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తామని హామీ



**ప్రజాపక్షం/నల్లగొండ :** రైతులు డిమాండ్ ఉన్న పంటలు పండించాలని, ప్రత్యేకించి ఆయా భూములకు అనుకూలంగా ఉండే పంటలు పండిస్తే అధిక దిగుబడులతోపాటు, అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ప్రజా పాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 4 నుండి నిర్వహిస్తున్న రైతు వారోత్సవం లో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడవ రోజైన బుధవారం జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ రైతు వేదికలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించిందని,ఆయా గ్రామాలలోని భూములకు అనుగుణంగా పంటలు వేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున అవసరమైతే ఒక డ్రైవ్ లా భూముల సారవంతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పండిన పంటకు పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని,మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలకు ఎలాంటి పాస్ పుస్తకాలు లేకుండా ఆన్లైన్లో భూభారతి వివరాల ఆధారంగా లోన్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సి ఈ ఓ ను ఆదేశించారు. జిల్లా సహకార అధికారి పత్యా నాయక్ అధ్యక్షత వహించిన అవగాహన సదస్సులో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,పిఎసిఎస్ అధ్యక్షులు నాగరత్నరాజు,సహదేవరెడ్డి,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి,ఎల్‌డిఎం శ్రామిక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు.



## గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి సత్యనారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరను భారీగా పెంచడంతో సామాన్య ప్రజలపై పెను భారం మోపినారని, 19 కిలోల కమర్షియల్ సిలిండర్ల ధరను ఒకేసారిగా 993 వరకు పెంచడం అన్యాయమని 30 నుండి 35% పెరుగుదలతో హోటల్‌లు రెస్టారెంట్లు వివిధ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మల్లేష్, పల్లె శీను, శ్రీధర్, నరసయ్య, యాదగిరి పాల్గొన్నారు.

### గ్యాస్ బండలతో నిరసన, తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలకు నిరసనగా సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు మండల సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ బండలతో నిరసన వ్యక్తంచేసి, అనంతరం తహసిల్దార్ స్రవంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, సిపిఐ నాయకులు యడ్ల అంజిరెడ్డి, చేవా వెంకన్న, కుందూరు వెంకటరెడ్డి, షేక్ నబీసాహెబ్, కొత్తపల్లి నర్సయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

### గ్యాస్ ధరలు తగ్గించాలని ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచిందని మండిపడ్డారు. గ్యాస్ కొరత లేదంటూనే బ్లాక్ మార్కెట్లో వాణిజ్య సిలిండర్ ఆరువేలకు, వంట గ్యాస్ సిలిండర్ 1600 కు అమ్ముతున్న మాట బిజేపి పెద్దలకు తెలియదా అని ప్రశ్నించారు. గ్యాస్ కొరత ఉంటే బ్లాక్‌లో ఎలా దొరుకుతుందని, బ్లాక్ చేస్తున్నది ఎవరు అమ్మించేది ఎవరని మండపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కత్తి శ్రీనివాసరెడ్డి, చిలకరాజు శ్రీను, లక్ష్మి, ఊదర వెంకన్న, కొమ్రాజు వెంకట్, బత్తిని శ్రీనివాసగౌడ్, పడిశాల బిక్షం పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్కెటింగ్, అనుబంధ శాఖలు ఉద్యాన పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో మూడవ రోజు రైతులకు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు సాగు పెట్టుబడి కోసం రైతు బరోసా, అకాల మరణం సంభవిస్తే కుటుంబానికి అండగా రైతుభీమా పథకాలను ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించడంతోపాటు సన్న బియ్యం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. సూర్యాపేటలో నూతనంగా భూపరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా ఏ భూమిలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో వ్యవసాయ అధికారులు సూచిస్తారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఖర్చు తగ్గింపులో భాగంగా నానో యూరియా వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. సూర్యాపేట మార్కెట్‌లో మొక్కజొన్న పంట అమ్మకాలు చేసుకునేలా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో వరితోపాటు రైతులకు లాభసాటి తెచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని, ఆయిల్ ఫామ్, కూరగాయల సాగుపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సూర్యాపేట మార్కెట్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేస్తున్నారని త్వరలోనే పేట మార్కెట్‌లో మామిడి మార్కెట్ ప్రారంభం కాబోతున్నట్లు వెల్లడించారు. సూర్యాపేటలో రూ.33 కోట్లతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూరగాయల రైతుల కోసం రూ.31లక్షలతో మరమ్మత్తులు పూర్తి చేసి త్వరలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తం

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** క్యుములోనింబస్ మేఘాల ప్రభావం వల్ల రానున్న మూడురోజులపాటు ఉరుములు, మెరుపులు, వడగల్లతో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. బుధవారం మండలంలోని పిన్నాయిపాలెం గ్రామ శివారులో ధాన్యం ఆరబోసిన రైతులతో ఆయన మాట్లాడి జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. క్యుములోనింబస్ మేఘాలు కొద్ది సమయంలోనే ఉరుములు, మెరుపులు, గాలి దుమారం, వడగళ్ళతో కూడిన భారీ వర్షాలను కురిపిస్తాయని చెప్పారు. రైతులు ఆరబోసిన ధాన్యం వర్షంలో తడవకుండా జాగ్రత్తలుపడాలని సూచించారు. పంట తడవకుండా టార్ఫలిన్ కవర్లు, పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఎండ వేడివల్ల వడదెబ్బకు గురికాకుండా రైతున్నలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ధాన్యం నీటిలో తడిస్తే నాణ్యత తగ్గుతుందని రైతులు నష్టాలబారిన పడే అవకాశం ఉందని ముందస్తుగానే ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు, మార్కెట్లకు తరలించి అమ్ముకోవడం మంచిదని సూచించారు.



## ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వంలో సంపూర్ణంగా విలీనం చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి అన్నారు. బుధవారం ఆ యూనియన్ ఆత్మీయ సమ్మేళనం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూన్ 2 వరకు ఒప్పుకున్న తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఆర్‌టిసి కార్మికుల కుటుంబాలలో వెలుగు నింపాలన్నారు. అంతకు ముందు మృతి చెందిన ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులకు ప్రగాఢంగా నివాళులర్పించారు. సూర్యాపేట డిపో నూతన కమిటి ఎన్నిక సందర్భంగా డిపో చైర్మన్‌గా గని, ట్రెజరర్ బాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, సెక్రటరీ భాస్కర్, అడిషనల్ సెక్రటరీ సావిత్రి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శంకర్, రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి గోపనబోయిన శ్రీనివాస్, గని, భాను, రవి, రమేష్, వెంకటేశ్వర్లు, సావిత్రి, భాస్కర్ పాల్గొన్నారు.



## మే 12లోగా దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** 2026/27 విద్యా సంవత్సరానికి గాను కార్పోరేట్ కళాశాలల పథకం కింద కొత్తగా రెప్యూటెడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు వి.వెంకట క్రిష్ణ తెలిపారు.రెసిడెన్షియల్ వసతి కలిగి, ఉన్నత విద్యా ప్రమాణాలు పాటిస్తూ కాంపిటేటివ్ పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత శాతం కలిగిన కళాశాలలు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.గత ఐదు సంవత్సరాల అకాడమిక్ ప్రొఫైల్‌తో పాటు సంబంధిత ధృవపత్రాల హార్డ్‌కాపీని మే 12 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలి. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు.ఈ పథకం కింద ఎంపికైన కళాశాలల్లో ప్రవేశం పొందిన ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రూ.35,000, పాకెట్ మనీ కింద రూ.3,000 చెల్లించనున్నట్లు తెలిపారు.

## కెటిఆర్‌పై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షుడు ఇనగాల



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సిం గ్‌ను బుధ వారం వరంగల్ పశ్చి మ నియోజకవర్గ శాస న సభ్యుడు నా యిని రాజేందర్ రెడ్డి, వర్ధన్న పేట నియోజకవర్గ శాసన సభ్యుడు కెఆర్ నాగరాజు, హనుమ కొండ,వరంగల్ జిల్లాల డిసిసి అధ్యక్షుడుఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఆయూబ్ కలిసి కెటిఆర్‌పై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు హం టర్ రోడ్డులో నిర్వ హించిన సభలో పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రా హుల్ గాంధీపై, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.ప్రజాప్రతినిధిగా బాధ్యతారాహిత్యం గా, అసభ్యక రంగా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్పష్టం చేస్తూ, చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సంబంధించి న అన్ని సెక్షన్ల కింద వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



**ప్రజాపక్షం/రాయపర్తి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలా ంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యా రాణి అన్నారు . బుధవారం పిఏసిఎస్, పేరికేడు గ్రామంలోని ఐకెపి ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లా డుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో కాంటా లు నిర్వహించాలని అన్నారు. ప్రతిరోజూ కనీసం రెండు లారీల చొప్పున ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా టా ర్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదని అన్నారు. మిల్లర్లు ధాన్యం తీసుకోవ డంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే, ఆ ధాన్యాన్ని ఇతర మిల్లులకు కేటాయిస్తామ ని స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే మిల్లర్లపై కఠి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎ స్ఒ కిష్టయ్య,జిల్లా పౌరసంబంధాల అధికారి ,పౌరసరఫరాల డిటి మధు సూదన్, తహసీల్దార్ శ్రీనివాస్,ఆర్ఐ చంద్రమోహన్, సర్పంచ్ సహింద్ర బిక్షపతి, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, సిసియాదగిరిపాల్గొన్నారు.

## తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం : కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/మహాదేవపూర్;** అకాల వర్షానికి తడిసిన ప్రతి గింజను కొ నుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.బుధవారం మ హాదేవపూర్ మండలంలో పర్యటించి సూరారం గ్రామంలోని ధాన్యం కొ నుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా తడిసిన ధాన్యం ప రిస్థితిని స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు.రైతులు ఆందోళన చెందవద్దని తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అన్నారు.తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్‌మిల్‌కు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగో లు,రవాణా,దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్ష ణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నుండి మిల్లులకు వేంటనే తరలించాలని డిఎంకు సూచించారు.కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్,పౌర సరఫరాల సంస్థ ఎండి రాములు,ఎంపిడిఒ రవిం దర్,పిఏసిఎస్ ,చైర్మెన్ తిరుపతి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## డ్యూటీ సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలి



**ప్రజాపక్షం/నర్సింహులపేట:** పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పి డాక్టర్ శబ రీష్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పలు రిజిస్టర్లు,రికార్డులు పరిశీలించి మాట్లాడారు..డ్యూటీ సమయంలో సిబ్బంది పోలీసు స్టేష న్‌లో అందుబాటులో ఉండాలని పెండింగ్ కేసులను త్వరితగతిన విచా రణ చేయలని చెప్పారు.బీట్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామా ల్లో నేర నివారణ చర్యలను బలోపేతం చేయాలని ,సిసిటివి కెమెరాల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సాంకేతిక వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళలను,పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐబానోతు వెంకన్న,పోలీసు సిబ్బంది ఉన్నారు.

## గూడూరులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ శాసన సభ్యుడు డాక్టర్ మురళి నాయక్ చొరవతో గూడూరు గ్రామపంచాయతీ పరిదిలోని రాచర్ల భవాని రామకృష్ణకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్య క్రమానికి గూడూరు మేజర్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలునా యక్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సునీత కొమ్మాలునా యక్ మాట్లాడుతూ గ్రామభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథ కాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పేదలకు సొంతిల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈకార్యక్ర మంలో ఉపసర్పంచ్ చంటి స్వామి వార్డు సభ్యులు ఇనుముల ఏకాం బరం చీరబోయిన కుమార్ గార్లపాటి శీరిష ఎండి రసూల్ సునీల్ చాంద్ పాషా వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే
# కాంగ్రెస్ ప్రభుత్వలక్ష్యం

### దనసరి సీతక్క





**ప్రజాపక్షం/గోవిందరావుపేట/ములుగు:** రైతులను రాజులు చేయాలనే లక్ష్యం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శి శు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నా రు. బుధ వారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్ర గతి ప్రణాళిక లో భాగమైన రైతు వారం కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవ రావుతో కలిసి పాల్గొన్నారు ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్ర ధాన లక్ష్య మని తెలిపారు రైతులకు ఎన్నడూ లేని విధంగా రు ణ మాఫీ చేపట్టామని వ్యవసాయ పెట్టుబడులకు రైతుభరోసా అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ యం త్రాల కొనుగో లుకు ప్రత్యేక సబ్సిడీలు అందిస్తు న్నట్లు వివరించారు హనుమకొండ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు వా రోత్సవాల్లో భాగంగా వ్యవసాయ యంత్రాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు ఒకే పంటపై ఆధార పడకుండా భౌగోళిక పరిస్థితులు మార్కెట్ డిమాండ్‌ను బట్టి ప ంటలను మార్చుకోవాలని సూచించారు. వరి, పప్పు ధాన్యా లు, పత్తి ,పామాయిల్ ,కందులు, జొన్నలు వంటి విభిన్న త క్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చే పంటలు పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పిం చాలని ఆదేశించారు .ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్ మా ర్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి పిఏసిఎస్ మాజీ చైర్మన్ ప న్నాల ఎ ల్లారెడ్డిస్థానికప్రజాప్రతినిధులుఅధికారులుపాల్గొన్నా రు.

**రూ.41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు**

ములుగు జిల్లా వ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా కో సం రూ.41 కోట్ల నిధులతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ను ఏర్పాటు చేస్తున్నట్లు సీతక్క తెలిపారు 99 రోజుల ప్ర జా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగ తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో ములుగు మండ లం జాకారం గ్రామంలో రూ.3.76 కోట్ల అంచనా వ్య యంతో నూతనంగా నిర్మించిన 11 కె వి విద్యుత్ ఉప కే ంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రూ.41 కోట్లతో 12 విద్యుత్ ఉప కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు ఇప్పటికే 3 ఉప కేంద్రాలను వి నియోగంలోకి తీసుకురాగా మరో ఉప కేంద్రం ప్రారం నికి సిద్ధంగా ఉందని తెలిపారు మిగిలిన ఉప కేంద్రాలు వివిధ దశల నిర్మాణ పనులలో ఉన్నాయని మంత్రి వివ రించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ క ళ్యాణి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ టిఎస్ఎన్‌పిడిసిఎల్ చీఫ్‌ఇంజనీర్ రాజు చౌహాన్ ఎస్ ఈ బిక్షపతి డిఇ నాగేశ్వరరావు స్థానిక కౌన్సిలర్లు ప్రజా ప్రతి నిధులుసంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ మున్సిపాలిటీలో రచ్చ..రచ్చ

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపల్ సాధా రణ సమావేశం సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు రచ్చ..రచ్చ చేశారు. సమయం పాటించి కౌన్సిలర్లు సమావేశానికి రాకపోగా ఎజెండా ఎలా ఆమోది స్తారంటు చైర్మన్‌ను చుట్టుముట్టడంతో పాటు కమీ షనర్ చాంబర్‌కు వెళ్లి గోల చేశారు. బల్లలు చరుస్తూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఓ కౌన్సిలర్ ఏకంగా ఎజెండా కాపీలు చింపి కమీష నర్ మొహాన కొట్టారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఓ వైపు రచ్చ చేయగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మాత్రం ప్రశాంతంగా ఉన్నారు. అవగాహన లేకుండా ప్రజా సమస్యపై మాట్లాడే అవకాశాన్ని దుర్విని యోగం చేస్తూ బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారని చైర్ పర్సన్ కడకంచి బాలమ ణితో పాటు కౌన్సిలర్లు ఆరోపించారు. జనగామ మున్సిపల్ సాధారణ సమావేశం గత నెల 30న నిర్వయించగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు కుర్చీ కోసం నిరసన తెలపడంతో వాయిదా పడింది. బుధ వారం ఉదయం 10.30 గంటలకు చైర్ పర్సన్ కడకంచి బాలమణి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగా కోరం లేకపోవడంతో కొద్ది సమయం వేచి చూశారు. బిఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సమావేశానికి రావడంతో కోరం ఉంది. దీనితో చైర్ పర్సన్ కడకంచి బాల మణి సమావేశాన్ని ప్రారంభించి ఎజెండా చదివి వినిపించారు. ఎజెండాలో 58 అంశాలు ఉండగా వాటన్నింటి ఆమోదించారు. అర గంట ఆల స్యంగా వచ్చిన పలువురు బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎజెండా ఎలా ఆమోదిస్తారు..మళ్లి చదవాలని పట్టుబట్టారు. దీనికి చైర్ పర్సన్ అంగీకరించలేదు. దీనిపై సుమారు అరగంటకు పైగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు గొడవ చేశారు. ప్రశాంతంగా ఎజెండా అంశాలు కాకుండా ఇతర అంశాలు చర్చిద్దామని 15వ వార్డు కౌన్సిలర్ మారబోయిన పాండు నచ్చ జెప్పె ప్రయత్నం చేశారు. అయినా బిఆర్ఎస్ కౌన్సిలర్లు వినలేదు. దీనితో చైర్ పర్సన్ కడకంచి బాలమణి సమయం ప్రకారం 1/3 కోరం ఉండ డంతో సమావేశం ప్రారంభించి ఎజెండా ఆమో దించామని వివరిస్తూ సమావేశం పూర్తయ్యిందని చెప్పి వెల్లిపోయారు.

**కమిషనర్ చాంబర్‌లో గొడవ, కారు అడ్డగింపు**

ఆ తరువాత బిఆర్ఎస్ కౌన్సిలర్లు కమీషనర్ మహే శ్వర్‌రెడ్డి చాంబర్‌కు వెళ్లి గొడవకు దిగారు. ఎలా సమావేశం ముగిస్తారని మండిపడ్డారు. ఎజెండా అంశాలు ఎలా అమోదిస్తారంటు సుగుణాకర్ అనే కౌన్సిలర్లు ఎజెండా కాపీ చింపి విసిరేశారు. కమీష నర్ తన చాంబర్ నుండి బయటకు వెళ్తుండగా అడ్డుకున్నారు. తప్పించుకొని కారు ఎక్కగా కారు ముందు కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం సిఐ సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకొని కౌన్సిల ర్లతో చర్చించి ఏ అంశానైనా చైర్మన్ ద్వారా తేల్చు కోవాలని, కోఆర్డినేషన్‌తో ముందుకు పోతేనే సమ స్యలు పరిష్కారం అవుతాయని వివరించి సద్దుమ నిపారు.

## దశల వారీగా హామీల అమలు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమ-కొండ టౌన్ :** హనుమ కొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదా నంలో ఈ రోజు నిర్వ హించిన మీడియా సమా వేశంలో వ రంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వాగ తిస్తామని, అయితే అసత్య ఆరోపణలు చేయడం సహించబోమని హెచ్చ రించారు.ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డిసిసిఅధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టిపి సిసి నాయకులు, డిసిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి

### సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కేంద్ర ప్రభుత్వం పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభు త్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో ధర్నా, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నగర కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపో యాయని, పేద మధ్యతరగతి ప్రజల పైన పెద్ద ఎత్తున భారం మోపి పేద ప్రజల నడ్డి విరిసిం దని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఎన్నడు లేని విధంగా కమర్షియల్ సిలిండర్ ధర 950 రూపాయలు పెంచడం సిగ్గుచేటు అని అన్నారు. కమర్షియల్ సిలిండర్ ధర 3500 చేరుకుందని ఈ భారం పేద ప్రజల పైన పడుతుందని తెలిపా రు.పెట్రోల్ డీజిల్ ధరలను అదుపు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధా నాలపైన పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా నిరసన తె లియజేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు టిఫిన్ 30 రూపాయలు ఉంటే గ్యాస్ ధరలు పెరిగా యని 50 రూ పాయలు తీసుకుంటున్నారని, పెద్ద హోటల్లో అయితే జీఎస్టీ, పెరిగిన గ్యాస్ ధర పేరు మీద పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నా రని తెలిపారు. వెంటనే నరేంద్ర మోదీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడు తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, బూడిద తిరుపతి,ఎండియాకు పాషా, గోలి లావణ్య, పల్లెల రజిత, పొనగంటి లావణ్య, గడ్డం సరూప, గంప రాజు, సమ్మయ్య, గోనాల తిరుపతి, కుమార్,పాండ వుల తిరుపతి, ధరావత్, చిట్యాల పద్మ తదిత రులు పాల్గొన్నారు.

## 'లీడ్ ఎడ్యు ఫెస్ట్' పోస్టర్ ఆవిష్కరణ

### నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** లీడ్ ఫౌండేషన్ 20వ వార్షి కోత్సవం పురస్కరించుకొని నిర్వహించనున్న లీడ్ ఎడ్యు ఫెస్ట్ కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్‌ను నర్సం పేట ఎమ్మెల్యే దొంతి మా ధవరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి గత 20 ఏళ్లుగా కృషి చేస్తున్న లీడ్ రవికుమార్, శోభారాణి దంపతుల కృషి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. లీడ్ సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఎడ్యు ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వివిధ అంశాలు, పోటీలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభి నందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇ లాంటి వేదికలు అందించడం ద్వారా వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. లీడ్ ఎడ్యు ఫెస్ట్ విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవికు మార్, శోభారాణి, ఉపాధ్యాయులు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి



**ప్రజాపక్షం / వరంగల్:** భారత రైల్వేలో ఉద్యో గాల కోత నిర్ణయానికి వ్యతిరేకంగా అఖిల భా రత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్య ంలో వరంగల్‌లో విస్తృతంగా పోస్టుకార్డు ఉద ్యమం నిర్వహించారు. పట్టణంలోని పోచమ్మ మైదాన్ సెంటర్ , ఇక్బాల్ మినార్ వద్ద బుధవా రం నిర్వహించారు. దేశ ప్రధాని, రైల్వే మంత్రికి సు మారు 500 పోస్టుకార్డులు పంపిస్తూ యువత తమ నిర సనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ భారత రైల్వేలో మొత్తం 14,80,455 పోస్టులు ఉండగా ప్రస్తుతం సుమారు 10 లక్షల మంది మాత్రమే పనిచేస్తు న్నారన్నారు. దాదాపు 3 నుంచి 4 లక్షల వరకు ఖాళీలు ఉన్నప్పటికీ, రైల్వే బోర్డు 2శాతం ఉద్యోగాల కోత (సు మారు 29,608 పోస్టులు) నిర్ణయం తీసుకోవడం అన్యా యమని తీవ్రంగా విమర్శించారు. ఖాళీలు ఉన్నప్పుడు ని యామకాలు చేపట్టకుండా, మరోవైపు ఉద్యోగాలను తగి ంచడం యువత భవిష్యత్తుపై దెబ్బ అని ఆయన అన్నా రు. ఆర్ఆర్‌బి పరీక్షల ఫలితాలు పెండింగ్‌లో ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సంస్కరణా? లేక ఉ ద్యోగాల నిర్మూలననా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రైల్వేలో ఉన్న అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2 శాతం ఉద్యోగాల కోత నిర్ణయాన్ని రద్దు చే యాలని, ఆర్ఆర్‌బి పరీక్షల ఫలితాలను తక్షణమే విడు దల చేయాలని, యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఉ ద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించింది. వరం గల్ జిల్లా కార్యదర్శి మస్కా సుదీర్, జ గదీష్, మతీన్, ఎం.డి. అబ్బూ, యూసుఫ్, రమేష్‌పాల్గొన్నారు.

## గూడూరును పర్యాటక కేంద్రంగా మారుద్దాం



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూ డూరు మండల అభివృద్ధి రైతులకు సాగునీటి సౌకర్యం పర్యాటక అభివృద్ధి అంశాలపై జాతీయ ఎస్టీ కమిషన్ స భ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆధ్వర్యంలో గూడూ రు తాహసీల్థార్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఇరిగేషన్‌శాఖ మిషన్ భగీరథ రెవెన్యూ అటవీశాఖ అధికారులు పాల్గొ న్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూ రు మండల రైతులకు సంవత్సరానికి రెండు పంటలు ప ండేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారు లకు సృష్టమైన దిశనిర్దేశం చేశారు.పాఖాల వాగుపై చెక్ డ్యాంలు నిర్మించి చెంద్రు చెరువు కోడి చెరువు కొత్త కుంట గండి చెరువు సహా మండలంలోని అన్ని చెరువు లకు లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించేందుకు కార్యాచ రణ రూపొందించి పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని సూచించారు. మిషన్ భగీరథ పరిధిలోని 42 గ్రామపం చాయతీలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరం తరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశిం చారు.గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించి ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచిం చారు. అదేవిధంగా గూడూరు మండలాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధిచేసే అవకాశాలపై కూడా చర్చిం చారు. భీమునిపాదం గండి చెరువు అడవి ప్రాంతాలు పులిమడుగు వంటి ప్రాంతాలను పర్యాటక కేంద్రా లుగా అభివృద్ధి చేయాడానికి అటవీ,రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రెవెన్యూ సమస్యలపై స్పందిస్తూ సీతానగరం తైన్‌తండా మచ్చర్ల వంటి గ్రామాలలో సుమారు 65 సంవత్సరాల క్రితం సాగుచేస్తున్న భూములకు రైతులకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ , అటవీశాఖలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించా రు.ఈకార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి తాహశిల్థార్ నాగభవని వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ రెవెన్యూశాఖ అడవి శాఖ మిషన్ భగీరథ ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాత అగమ్యగోచరం



**ప్రజాపక్షం/జనగామ:** ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం ఆకాల వర్షం తో తడిసి ముద్దైంది. చిన్నపాటి వ ర్షానికే కల్లాల్లో పోసిన ధాన్యం కొట్టుకుపోయింది. దీ నితో రైతులు అన్నమో రామచంద్రా అంటు ఆర్థనాదాలు పెట్టు కున్నారు. అయ్యా జర మా ధాన్యం కొనిపించండి అంటూ ఆర్‌డిఒ కాళ్లు మొక్కి వేడుకున్నారు. ఈ సంఘటన బుధ వారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిం ది. దీనితో అధి కారులకు ఏం చేయాలో పాలుపోక రైతులపై ఆగ్రహం వ్యక్తం చేసిన పరిస్థితి. జనగామ జిల్లా వ్యాప్తం గా బుధ వారం తెల్లవారు జామున ఆకాల వర్షం కురిసి ంది. జన గామ, రఘునాథపల్లి, స్టేషన్‌ఘనపూర్, బచ్చన్నపేట, నర్మెట ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. జనగా మలో రోడ్లపై నీరు జాలుపారేలా వర్షం కురవడం తో వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దైంది. రై తుల నుండి ధాన్యం కొనుగోలు చేసేందుకు మా ర్కెట్‌లో ఐకెపి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొంత ధాన్యం కొనుగోలు చేయ గా కొంత బస్తాల్లో, కొంత కుప్పలుగా ఉంది. లారీలు సకాలంలో రాకపోవడ ంతో బస్తాలు అక్కడే ఉ న్నాయి. అదే విధంగా గోనే సంచులు ఇవ్వకపోవడం తో తూర్పాల పట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ ఉన్న ధాన్యం కుప్పలు గా మార్కెట్‌లోని కళ్లంలోనే ఉంది. బు ధ వారం ఉదయం తెల్లవారుజామున ఉ రుములు, మెరుపు లతో కూడిన వర్షం రావడంతో నీరు జాలువారి ధాన్య ం కొట్టుకుపోయింది. కుప్పలు తడిసి ముద్దయ్యాయి. బ స్తాల్లో నింపి కాంటా వే సిన ధాన్యం నీటిలో మునిగింది.

**ధాన్యం కొనిపించండని ఆర్‌డిఒకాళ్లు మొక్కిన రైతు**

ఒక వైపు ధాన్యం తడిసి ముద్ద కాగా..మరో వైపు నెల రో జులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడం తో ప్రకాష్ అనే రైతు జనగామ ఆర్‌డిఒ గోపిరామ్ కాళ్లు మొక్కారు. సార్ కాళ్మొక్కుతా జర మా ధాన్యం కొనిపిం చండి అంటు రెండు చేతులతో కాళ్లు పట్టుకునే ప్రయ త్నం చేయగా ఆర్‌డిఒ వారించారు. తప్పక కొనుగోలు చే యిస్తా మని హామీ ఇచ్చారు. అయితే ఐకెపి సెంటర్‌కు కే టాయిం చిన రైతులు కాకుండా వేరే వారు రావడంతో ఆ గ్రహానికి గురైన ఆర్‌డిఒ డ్రామాలు చేస్తున్నారా అంటు గట్టిగా మందలించారు. ఆ తరువాత అధికారులను పి లిచి వెంటనే ధాన్యం షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు.

**పట్టించుకోని మార్కెట్ చైర్మన్ :రైతులు**

జనగామ మార్కెట్‌లోని పిఎసిఎస్ సెంటర్‌తో పాటు మా ర్కెట్‌లో కొనుగోళ్లను చైర్మన్ శివరాజ్ యాదవ్ అసలు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. రైతులు ప్రకాష్, రాములు, రాజేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు మాట్లా డుతూ మార్కెట్‌కు వచ్చే ధాన్యాన్నే సక్రమంగా కొనుగోలు చేయకుంటే గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఏం కొంటున్నారని ప్రశ్నించారు. జనగామ మార్కెట్ కొను గోళ్లు సక్రమంగా జరగక నెల రోజులుగా రైతులు ఇబ్బం దులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎనుమాముల ఇవిఎం గోదాంల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం / వరంగల్ :** వరంగల్ లోని ఏను మాముల ఇవిఎం గోదాంను బుధవారం జిల్లా కలెక్ట ర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచి న ఎలక్ట్రాని క్ ఓటింగ్ మెషీన్లు భద్రతా ఏర్పా ట్లు, సిసి కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద ని వారణ చర్యలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాంలో విధుల్లో ఉన్న సిబ్బ ందితో మాట్లాడి భద్రతా చర్యల అమలుపై సూ చనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఇవిఎంల భద్ర త అత్యంత ముఖ్యమని, ఎలాంటి లోపాలు లే కుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసా గించాలని అధికారులకు ఆదేశించారు. ఈ తని ఖీలో అదనపు కలెక్టర్ రెవె న్యూ జి.సంధ్య రాణి , వరంగల్ తహసీల్దార్ , ఎలక్షన్ డిటి , సంబం ధితఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

“ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని, డీజిల్ పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ”

## పెట్రోల్, డీజిల్ కొరత నివారించి, పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని

# సిపిఐ నిరసనలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** పెట్రోల్, డీజిల్ కొరతను, గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారం మోపిందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్ష పతి విమర్శించారు. పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని, పెంచిన గ్యాస్ ధరల తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండలోని కాళోజి సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, కర్రే లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, వేల్పుల సారంగ పాణి, మాలోత్ శంకర్ నాయక్, కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాము నూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్ :** గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు రామకృష్ణాపూర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, నాయకులు సాంబయ్య, మొండివనం సత్యం, మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, మామిడి గోపి, కౌన్సిలర్లు మద్దెల శంకర్, ముని, ఈరవేణి రవి, శ్రీనివాస్, తోకల రాజన్న, కొమురయ్య, జిలకర మురళి, గజ్జి రమేష్, మాదాసు శంకర్ పాల్గొన్నారు.

**మందమర్రి :** గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. నిరసనలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమనాథుని సుదర్శన్, నాయకులు బండారి రాజేశం, రాళ్లపల్లి వీరయ్య, ఎండి రసూలు, నరేష్, బియ్యాల పద్మ పాల్గొన్నారు.

**మేళ్లచెరువు:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర ధరలను తగ్గించాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పతల కోటమ్మ, మండల కార్యదర్శి గొంగిరెడ్డి భద్రారెడ్డి, చిదిరాల యలమంద, సోమగాని మల్లయ్య పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** గ్యాస్ ధరలను నిరసిస్తూ సిపిఐ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఓ. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.విలాస్, జిల్లా కార్యదర్శి భుక్యా రమేష్, నాయకులు నషీర్, సంతోష్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** పెట్రోల్ డీజిల్ కొరత గ్యాస్ అధిక ధరలను నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఖాళీ సిలిండర్లతో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.పద్మావతి, బి.కృష్ణయాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.సత్యనారాయణ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మణ్ పట్టణ మహిళా కార్యదర్శి ఇందిరక్క, సుందర్ రాజు, కృష్ణయ్య, విగ్నేష్ కుమార్, చిన్నమ్మ, మల్లేశ్వరి, లక్ష్మమ్మ, గౌలి, సురేష్ , కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ :** యుద్ధం పేరుతో అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినప్పటికీ మేము పెంచుతలేమని ఎన్నికల్లో ప్రచారం చేసుకొని ఓట్లు వేయించుకున్న తర్వాత తక్షణమే సిలిండర్ కమర్షియల్ గ్యాస్‌పై విపరీతంగా ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని ఎంపి మల్లు రవి విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ధరల పెంపుపై ధర్నా ఆందోళన నిరసన కార్యక్రమాలో సిపిఐ శ్రేణులు ఖాళీ గ్యాస్ కుండలకు ఉరి తాళ్లు బిగించి వినూత్నంగా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపి మల్లు రవి మాట్లాడారు. నిరసనలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, మర్యాద వెంకటయ్య, బిజ్జ శ్రీనివాస్, మారేడు శివశంకర్, బండి లక్ష్మీపతి, తప్పెట కిరణ్ కుమార్, బండి వెంకటమ్మ, ప్రేమ్‌కుమార్, కొత్త రామస్వామి, వంకేశ్వనం శ్రీనివాసులు, బాల ,పీర్, జి. వెంకటస్వామి, సిద్దేశి విజయ్, బి. శివ శంకర్, బి. కురుమయ్య, సీతయ్య, హుస్సేన్, అంజి, ఎండి నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్:** పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కరీంనగర్ :** గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తా వద్ద జరిగిన నిరసన నిర్వహించారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, నూనావత్ శ్రీనివాస్, పి.సాంబయ్య, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అరికట్టడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలం అయిందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. సిపిఐ షాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నర్సింలు, రఘురాం, మధు, నారాయణ రాములు, దుర్గయ్య, నాగరాజు, బూరుగుల నరసయ్య, పాండు, మురళి, రామకృష్ణ, విటల్, వెంకటేష్, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలో...


కరీంనగర్‌లో...



మహబూబ్‌నగర్‌లో...



నాగర్‌కర్నూల్‌లో...



రంగారెడ్డి...షాబాద్‌లో...


సూర్యాపేట..మేళ్లచెర్వులో...


రామకృష్ణాపూర్‌లో...



నిర్మల్‌లో...


మందమర్రిలో...

## నిత్యావసరాల భారం

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటి కాడి కూడును లాగేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని కూనంనేని డిమాండ్ చేశారు. ప్రజల ప్రధామిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గు చేటన్నారు. దేశంలో ఇంధన కొరతపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదని, ఇప్పటికైనా నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ధరల పెరుగు దలకు వ్యతిరేకంగా సామాన్యుని గొంతుకై నిలబడతామని, ఈ పోరాటాలను గ్రామగ్రామానికి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, వంగ వెంకట్, ఎస్‌కే ఫహీమ్ దాదా, దీటి లక్ష్మీపతి, కె రత్నకుమారి, మునిగడప పద్మ, కార్పొరేటర్లు, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ హెడ్ పోస్టాఫీస్ కేంద్రంలో

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బుధవారం వరంగల్ జిల్లా హెడ్ పోస్ట్ ఆఫీస్ కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఖాళీ సిలిండర్లతో ప్రదర్శన నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా 993 రూపాయలకు పెంచడం అత్యంత దుర్మార్గమన్నారు. దీనితో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారులపై పెనుభారం పడుతుందని, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. 2014లో రూ. 400 లోపు ఉన్న గ్యాస్ ధరను నేడు వెయ్యి రూపాయలకు చేరువ చేయడం మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాసుమియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, బుస రవీందర్, గుండె బద్రి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







### హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన

ఎన్నికలు రాగానే ధరలు తగ్గిస్తూ అయిపోగానే తిరిగి ధరలను రెట్టింపు చేస్తూ పేద ప్రజలపై మోయలేని పెనుభారాన్ని మోపుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా ఐక్యంగా కదిలి రావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. ఈ నెల 10న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో విభజన హామీల అమలతో పాటు తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలంతా రోడ్లపైకి కొచ్చి తమ నిరసన తెలియజేయాలని కోరారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని, డీజిల్ పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈ.టి,నరసింహ మాట్లాడుతూ వాణిజ్య సిలిండర్లను పెంచడంతో ఉద్యోగాలు లేక చిన్నచిన్న టీ స్టాల్, టిఫిన్ సెంటర్, హోటళ్లు నడుపుకుంటున్న నిరుద్యోగ యువతపైనే కాకుండా ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రత్యక్షంగా భారంగా మారిందన్నారు. ఇరాన్‌తో దశాబ్దాలుగా భారతదేశం సత్సంబంధాలను కలిగి ఉందని, వీటిని కాదని ప్రధాని మోదీ అమెరికా ట్రంప్ సర్కార్‌కు కీలుబొమ్మగా మారారని ఆయన విమర్శించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రధాని ముందు, చివరకు హోంమంత్రి ముందు కనీసం నోరెత్తే ధైర్యం కూడా చేయలేని అసమర్థులు అన్నారు. ఆలాంటి వారు రాష్ట్ర ప్రజల కోసం ఇంకేమి చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం, ఉమర్ ఖాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సక్రి బాయి పాల్గొన్నారు.

## లెనిన్ విగ్రహం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలోని పదమ్‌కండి ప్రాంతంలో కూడా బిజెపి గూండాలు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడిచేశారు. కార్యాలయాన్ని దోచుకుని ధ్వంసం చేశారు. లెనిన్ విగ్రహాన్ని బిజెపి అల్లరిమూకలు ధ్వంసం చేయడాన్ని, కార్యకర్తలపై దాడులు చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఎక్స్ వేదికగా బిజెపి గూండాయిజంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. అక్రమ పద్ధతులలో అధికారం చేజిక్కించుకున్న బిజెపి ఇంకా పదవీ ప్రమాణస్వీకారం కూడా చేయకముందే వామపక్షలపైన,ప్రత్యర్థిపార్టీ కార్యకర్తలపైన దాడులు చేయడంపై ఖండనలు కొనసాగుతున్నాయి. పలుపార్టీలు కూడా బిజెపి గూండాగిరీని ఖండిస్తూ ప్రకటనలు చేశాయి. ఈ విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల కార్యకర్తకలు పెద్దసంఖ్యలో గుమిగూడి నిరసన ప్రదర్శన చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు దాఖలు చేయాలని కోరారు. లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత పోలీసు అధికారి ఒక ప్రకటన చేస్తూ, ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయినీ, ఐనప్పటికీ పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు. కాగా, లెనిన్ విగ్రహాన్ని శుక్రవారం తిరిగి పునఃప్రతిష్ఠిస్తామని సిపిఐ(ఎం) నాయకులు ప్రకటించారు.

### బెంగాల్‌లో మరణాలు, విధ్వంసం

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతర హింసలో కనీసం ముగ్గురు మరణించడం, విస్తతమైన విధ్వంసం చోటుచేసుకోవడంతో శాంతిభద్రతలపై తీవ్ర ఆందోళనలు తలెత్తాయి. ఈ ఘటనల్లో పాల్గొన్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదేశించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్, కోల్‌కతా పోలీస్ కమిషనర్, కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఉన్నతాధికారులతో సహా రాష్ట్ర ఉన్నతపరిపాలనా, పోలీసు అధికారులను సిఇసి ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలలో నిరంతర గస్తీ ఉండేలా చూడాలని జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లను ఆదేశించారు. 'హింసను ప్రేరేపించి, విధ్వంసానికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి' అని సిఇసి ఆదేశాలను ఉటంకిస్తూ ఆఅధికారి తెలిపారు. మంగళవారం ఎన్నికల అనంతర హింసా ఘటనల్లో కనీసం ముగ్గురు మరణించడం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అనేక పార్టీ కార్యాలయాలు ధ్వంసం కావడం వంటి ఘటనలు జరిగిన ఒక రోజు తర్వాత ఈ ఆదేశం వెలువడింది. కొన్ని జిల్లాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో చట్టాన్ని వేగంగా, కఠినంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ నొక్కి చెప్పారు. ప్రజా భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఎన్నికల సంఘం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. 'మేము అత్యంత అప్రమత్తంగా ఉండాలని, శాంతికి భంగం కలిగించే ఏ ప్రయత్నాన్ని అయినా కఠినంగా ఎదుర్కోవాలని మాకు ఆదేశాలు అందాయి' అని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా నిరోధించడానికి రాష్ట్ర పోలీసులు, కేంద్రబలగాలను సమన్వయంతో మోహరించి, అధికారులు జిల్లాల వ్యాప్తంగా నిఘా ముమ్మరం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఉద్రిక్త ప్రాంతాలలో భద్రతా సిబ్బందిని పెంచారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com